# ఆంధ్రశిల్పి

Vol. No. 12



సర్వజిత్తు : ఆషాఢము ౧౨

1947 JULY

# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాస పత్రిక 12

సంపాదకులు

శ్రీ గణపతిశాస్త్రి : శ్రీ చిత్రా

౧౦, నరసింగపురం వీథి,

మౌంట్ రోడ్, మద్రాసు.

# విషయానుక్రమణిక


| | | | పుట. |
|---|---|---|---|
| సంపాదక సమీక్షలు | ... ... | శ్రీ గణపతి శాస్త్రిగారు | ౧ |
| కన్నుల చందమామ | ... ... | శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్యగారు | ౩ |
| పసుపు: కుంకుమ | ... ... | శ్రీ పురిపండా అప్పలస్వామిగారు | ౪ |
| జలియన్ వాలాబాగ్ | ... ... | శ్రీ రమణా రెడ్డిగారు | ౫ |
| నగ్న సత్యాలు | ... ... | శ్రీ 'సదాశివ' గారు | ౭ |
| సాహిత్యోద్యమం | ... ... | శ్రీ పిల్లలమఱ్ఱి వెంకట హనుమంతరావు | ౧౦ |
| సాంఘిక మనస్తత్వం | ... ... | శ్రీ కవికొండల వెంకటరావుగారు | ౧౨ |
| కళలు_మానవ జీవితము | ... ... | శ్రీ రాజా రంగయ్యప్పారావుగారు | ౧౬ |
| సుందరం భార్య | ... ... | శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు | ౨౪ |
| అల్లరి | ... ... | శ్రీ 'సాక్షి' గారు | ౩౦ |
| విషకన్య | ... ... | శ్రీ గణపతిశాస్త్రిగారు | ౩౬ |


## శిల్పాలు


| | | |
|---|---|---|
| ముఖచిత్రము | ... ... | శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తిగారు |
| త్రివర్ణ చిత్రము | ... ... | అప్సరస: శ్రీ కృష్ణలాల్ భట్ గారు. |
| అమాయిక జీవులు | ... ... | శ్రీ మాధవ మోనన్ గారు. |
| గిండీపార్కు దృశ్యము | | ,, |
| డేగ | | ,, |
| పద్మము | ... ... | ,, |
| కొండలు | ... ... | మైకేల్ యోకయామా |



అ ప్స ర స

శ్రీ కృష్ణలాల్ భట్.

౧ సంపుటి

# ఆంధ్రశిల్పి

౧౨ సంచిక

## సంపాదక సమీక్షలు

### ఆంధ్రుల పరిస్థితులు

భారత దేశానికి స్వాతంత్ర్యం రాబోతూంది. జనసామాన్యానికి కట్టగుడ్డా, తిన తిండీ లేకపోయినా, ఈ స్వాతంత్ర్య భానూదయం భారత దేశానికి ఏదో కళ్ల నీళ్లు తుడిచినట్టుగా ఉంది.

కాని మన ఆంధ్రుల పరిస్థితి! ఢిల్లీ మంత్రివర్గ నిర్మాణంలో ఆంధ్రుల పేరైనా స్మరించకుండా ఉన్నారని తెలుస్తూంది. ఇటు రాష్ట్రాల గవర్నర్లలో అసలు మన మాటే లేదు. మద్రాసులో ప్రకాశం మంత్రి వర్గం పతన మయింది మొదలుకొని ఆంధ్రుల అగచాట్లకు అంతూదరీ లేకుండా పోతూంది.

ఏ పక్కనించి వచ్చినా ప్రతీ ఉద్యమానికీ తలలు వొంచాము; సమస్తమూ ధారపోశాము. తీరావచ్చాక ఫలితకాలంలో కాంగ్రెసు సర్వాధి కారుల దృష్టిలో, ఆంధ్రం అనేదే నశించినట్టు తోస్తూంది!

అసలు భాషా ప్రయుక్త రాష్ట్రవాదం ప్రారంభించింది మనం! ఈ వాదంవల్ల అనేకమంది ఫలితాలు అనుభవించారు. మనకి అసలు రాష్ట్రం వస్తూన్నదా? అనేదే సందేహం అయిపోతూంది! దీని కంతా కారణం?

మనకి మొదటినించీ మనలో మనం కలహించుకోవడం, ఒకరికి దాస్యం చెయ్యడం బాగా అలవాటై పోయింది. లేకపోతే అన్నివిధాలా

సర్వ సమర్థులయిన మన ఆంధ్రుల నాయకుల లీవేళ నస్మరంతులయి పోవ డానికి కారణం ఏమి ఉంది !

భారత దేశాని కేదో స్వరాజ్యం వచ్చింది. ఇక నించైనా మనలో మన విభేదాలు మరిచిపోయి ఒక తాడుమీద నడవకపోతే మనకి నామ రూపాలు పోవడం నిశ్చయం. ఈ క్షణం నించైనా మనకి ఆంధ్రరాష్ట్రం ఒకటే గమ్యమని దానికోసం సమస్త శక్తులూ ధారపోదాము. మనలో మన విభేదాలు మరిచిపోయి ఒకతాటికింద నడుద్దాము. మన నాయకుల్లోని భేదాల్లన్నీ సమసిపోయేటట్లు చేసి వారిలో వారికి ఐకమత్యం కల్పిద్దాము.

మనజాతిలో అటు హైదరాబాదులో ఇరుక్కున్నవాళ్లంతా రాజకీయంగా అష్టకష్టాలు పడుతున్నారు. ఇటు రాయల సీమలో అన్న వస్త్రాలకి అటమటిస్తున్నారు మనవా రీ సమస్యలన్నీ మనవిగా భావించుకొని అన్నివిధాలా సహాయం చెయ్యాలి. ప్రతి ఆంధ్రుడి హృదయంలో భాష విషయలోను, సంస్కృతి విషయలోను, తన రాష్ట్ర విషయంలోను, దృఢాభిమానం కలిగేటట్లు చెయ్యాలి !

మున్ముందు కొత్తఎన్నికలువచ్చేలోగానే మనరాష్ట్రం నిర్మాణం జరిగేటట్లు చూడాలి. ఇవి జరిగిననాడే మనకి ఏ విధంగానైనా విముక్తి ! లేకపోతే ఇటు అరవలకో అటు ఔత్తరాహులకో మనం పాలికాపులుగా ఉండవలసిందే.

శ్రీ గణపతిశాస్త్రి.

# కన్నుల చందమామ

[రుద్రమదేవి పురుషవేషముతో నంతఃపురమున కేగినప్పటి దృశ్యము]

వెన్నెలఁ బుక్కిలించు పురవీథిఁ బదాఱుగుఱాల బగ్గిపైఁ
గన్నుల చందమామ చనఁగా జయవెట్టి మహాజనమ్ము వె
న్కొన్నది: తృప్తిదీఱ దనుకొన్న దదేపని చన్నదిక్కు క
న్గొన్నది; జన్మధన్య మనుకొన్నది! యద్దెసఁ గూర్మి మెట్టిదో?
ఆమహనీయమూర్తికి జ్యోహారని రాజగృహమ్ములోపలన్
శ్రీమతు లెందఱో సిరులు చిందెడు కన్నులఁ గౌఁగిలించి; రా
కోమల హస్త మెత్తి కనుగొల్కుల నవ్విన దృశ్య మే కవి
గ్రామణికంటఁ బడ్డ, నది కమ్మని కావ్యము గాక తీఱునా?
నవ్వినదిందు కోసమగునా? తన తాల్చిన రాజవేషమం
దెవ్విధమైన లోటు గనిపింపదె? యూఁడుతనమ్ము దానికే
మవ్వము, జవ్వనమ్ము రసమాధురు లొల్కఁగ వెంతమాటినన్
బువ్వుసుధారస మ్మొలుకఁ బోయునుగాని విసమ్ము చిమ్మునే?
లోలవిలోచనల్ ధళుధళక్కని నింగికి దాఁటు నూత్న శం
పాలత లట్లు ముందుఁ బఱవన్ వెనువెంట గమించె నామె, శో
భాలస దృక్కులన్ నిజవిహార గృహోపరి చంద్రశాలికా
నీలసరోజ కుట్టిమ మణీమయ మంటప మధ్యభూమికిన్.
కగ్గని మొగ్గలైన చెలికత్తెలు పట్టిన తాళవృంతముల్
దగ్గర నీదు తన్మృదుపదద్వయి మించుక ముట్టనీయదా
ముగ్గిన పండు లైదువుల ముచ్చటకుం జెవియొగ్గి సొంతకే
లొగ్గని కార్యమన్యహిత మూఁకొన కున్న నిమేషమున్నదా?
తనపిన తల్లు లిర్వురు సుధామధురోక్తుల కుబ్బి తన్ముఖ
ప్రణిహితదృష్టులై మృదులపాణి సముజ్జ్వల రత్నకంకణ
క్వణన మెసంగ నామె చిబుకంబు కరాంగుళు లల్లనల్లనన్
బుణుకుచు రాజసమ్మొలుకఁ బోయు మొగ మ్మెగనెత్తి రాదటన్.

‘రుద్రమదేవి’నుండి

శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య.

# పసుపు : కుంకుమ

మెరుపులు కురిసే
తొలకరిరాతిరి
మంటల దోక గేయం నా
కంఠానికి విసిరిందా
కొంటె పిల్ల.
శిరంలేని నా కంఠం
ధరించిందా గేయం
[illegible]మె లే నాకాయం
మంటలై నా మస్తిష్కం
ఎక్కడిదో మూర్ధన్యం
ఆకాశం పాతాళం
ఆవరించు
ఆకళించు
నాకళ్ళకు
పిల్లకళ్ళు
కళ్ళజోడు
ఈనాటికి
ఈనాటికి
మానవలోకం నిండా
మంటల సస్యంకోసం
నాకలమే
హాలమైతే
మంటల మురిసే పిల్లా
మంటల మెరిసే పిల్లా
జంటగ నా
వెంటనె రా !

శ్రీ పురిపండా అప్పలస్వామి.

# జలియన్‌వాలాబాగ్

నాడందరి మనసుల అందలాలలో
స్మృతులాసీనాలై స్వారీ చేశాయ్—
నేడే కొందరి మనసుల మారుమూలలలో
బ్రదికిచెడిన మారాజుల్లాగా
ఒదిగి చితికి దోబూచాడును.
భారతి గర్భంలోనప్పు
డభిమన్యు వీరకుమారుణ్ణి,
బ్రతుకో చావో తేలని నెత్తుటిముద్దను ;
డయ్యరుదారి సైంధవుడై
అన్నలపై కెగబడితే
కన్నతల్లి నిండుగుండె
గుభిల్ గుభిల్ గుభిల్లంది !
పాలగుండె నాదికూడ
క్షణంసేపు వ్రణ మయింది !
తల్లిగర్భ క్షీరధారలన్ని
యింకియెండి నాయి
ఎంతవిశాలా లయినా దారిగనక కంటినీళ్లు
పోటునాటితరహాగా,
మాతృగర్భమహాం బోధి
మధ్యమధ్య గుండాలకు
సుమపేశల నా శోలకు
ఉబికి ఉబికి యెగబడితే
నాబంటిని కంటిని:నీళ్లే !
వేడివేడి నీటి యేట నాడు
జలకమాడి నాను,
వేడికి వాడిన నా కడుపాకటితో
మాడి నాను ;
నాటి స్మృతులు మఱపుదాటి మార్మ్రో
గును మనసంతా

వాడనికలగా నేటికి
నాయెదలో రొద సేయును,
నా ఊహకు నా శక్తికి
చేజిక్కక పైకెగురును,
మహాగాథ కాదా అది,
శిశువునెట్లు చెప్ప గలను ?
అగ్రజులందరు మరువగ
కలుగునాకు ఆగ్రహంబు !
ఆగ్రహోదగ్రుడు
పీడితతాడిత శిశువీరుడు చెప్పవినుడు:
" చేయిపోదు
కాలు లేవదా గోడకు,
నలువైపుల నాల్కలూపు నల్లగోడ—
ప్రజహృదయం పెనుతుఫాను—
ఊగుబడ భవిష్యత్తు—
మరఫిరంగి ప్రభంజనం—
భువి యీనినలా పౌరులు—
గోడమీద ఆవులించి
గాండ్రించే చావు గుహలు—
'ఎటుపోవలె ? నేది దారి?
యను కేకలు వేనవేలు,
వేనవేల కేకలన్ని ఫిరంగి గర్జను
గుసగు సలే!
డొక్కల నెగదన్నివచ్చు
పిక్కల గుర్రపు డెక్కలు.—
కక్కుతుంది ధూమ్రధూళి
పట్టలేక ఝిరుకుచోటు !
యముడిలాగ యెగసిపడే
ఎర్రబుట్ట గుర్రంపై—

# ఆంధ్రశిల్పి

పాశంలో పెనుకమ్మి
ఉరిమి ఉరిమి చూస్తోన్నది !
బట్ట చిరిగి పమిట తప్పి
బట్టబయలు జనుల ఒడలు—
వీపున గుర్రపు తాపులు !
మూపున లక్షల గుర్తులు !
'ధాం ధాం ధమా ధాం !
ధాం ధాం ధమా ధాం !'
ఆగోన్నది పెనురక్కసి,
ఖదం ద్రొక్కె సమదాశ్వం,
ఫెళాఫెళాతోలు కమ్మి :
ప్రజలు వధ్యల కింధనాలు !
కన్ను చన్ను రుధిరమయం,
ఒళ్లు పళ్లు చూర్ణమయం,
కీళ్లు కాళ్లు బురద రొంపి !
మాతృ మృతక ళేబరాన్ని
తడిమినాడు ముద్దుకొడుకు ;
క్షీణించని క్షీరధార కాణాచికి కరువయింది :
చన్ను మొనను నెత్తుటేరు
తన్నుకుంటు ప్రవహిస్తే,
పసినాలుక సొంగ కార్చి
మసిపూసెను తల్లి ఒంట.
చేతితోడ ధ్వజంబ్రాలి మన్నును
మూచూచింది,
ధ్వజమంతా రుధిరాంబుధి...
చేయి మారి మింటికెగయ మిన్నంతా
ప్రళయ సంధ్య మృత్యుగహ్వరంలాగా !
ఎముకలపోడి తెల్లముసుగు
వేసుకుంది విధవ ధరణి.
నాటిస్మృతులు మృతినికూడ ఢీకొంటవి.
నాటివధలు నేటికి కథ—
నేటి కథలు ముందుకు ప్రథ—

నా డెగిరిన వీరధ్వజం నేడు అరువదేళ్ల వృద్ధ!
ఒరగబోతు సొరగబోతు
కొసకునుకులు పడుతోన్నది !
నాడు తెల్లదయ్యంతో
కయ్యానికి చరిచె భుజం—
నేడు తెల్లభూతంతో నెయ్యానికి భళీభళీ !
వియ్యానికి భళీభళీ !
నాటి నిజం రుజనొందెను !
ఈనాడో మనం మనం
ఈతకల్లు మతం తాగి
తథిం తక్కతందనాలు—
పెరవాడికి చిరవైరికి భోజనాలు,
వాయనాలు, రాజ నాలు ;
దరిద్రులం మృతాంగులం
మాతృద్రోహులం సయితం!
మూలుగు వాగుల జలాల తడితో
ఎముకలపోడి సత్తువతో.
తొలివీరులు వరివెన్నై జన్మిస్తే...
తలలు వంచి రోదింతురు !
తరకగింజలే రాల్తురు !
నాటి ధ్వజం బరువు కొరిగి సొరిగిననుసరే...
నాటి సంస్థ భీరువై వెనుదిరిగిననుసరే...
మేము మేము పసికందులమైకూడా
భీరువులము కాము కాము !!
శతపత్రపు పద్మవ్యూహమయితేనేం ?
పుటుకతోటి ఒక్కొక్క డొక అభిమన్యుడు !
రేకు రేకు నూడ బెరికి పగఱ
తరిమి ఎగబడుతాం !
మాతృశ్రీని విడిపిస్తాం !
స్వాతంత్ర్యం సమవాదం సాధిస్తాం !!

శ్రీ రఘునా రెడ్డి

# నగ్న సత్యాలు

శ్రీ 'సదాశివ'

అయితే! గోపాలం కాఫీహోటల్లో అంతకాలం పనిలోవున్నవాడివి మాయింట్లో వట్టి కాఫీతో యెల్లా సంతుష్టి పొందుతున్నావోయి! అన్నా యేదో సందర్భవశాత్తూను.

'బాబూ! కాఫీహోటల్లో వున్నంత మాత్రాన్న అన్నీ తింటామనుకున్నారా? అవన్నీ అమ్మకంకోసమే గాని మేం తిండానికి కాదండి. నిజంగా ఆకలివేసినా అవి తినలేమండి. కాస్త చద్దన్నం అయినా యింత చల్లోసుకు తినాలని వుంటుందిగానండి ఆ ఫలహారాల జోలికి పోవాలని వుండదండి' అన్నాడు. ఏం యెందుచేతను అన్నా. అవి తయారయ్యే పద్ధతులూ, వాటి మంచిచెడ్డలూ తెలియడం మాటకేంగానండి, మొహం మొత్తికూడానండి అన్నాడు. ఆకలివేస్తుంటే మొహం మొత్తడంయేమిటన్నా. నిజమేనండి, హోటల్లోజేరిన క్రొత్తలో సాధారణంగా యేహోటలు యజమానీకూడా తన హోటల్లో జేరినవాడు యెంత తిన్నా చూచీ చూడనట్టు వూరుకుంటాడండి. మహా తింటే పదిరోజుల పాటండి. తర్వాత మరింక బంగారం పెట్టండి! యేహోటలు పనివాడయినాసరే దాన్ని ముట్టి అనుభవించి హాయిహాయి అనుకోలేడండన్నాడు. ఎంచేతనన్నాను. తయారయ్యే నాలుగు వంటకాల సంగతీ పూర్తిగా తెలియడాన్నేనండి మూడుపంతులు. కాగా నిజంగా తయారుచేసే జాగాలో వక్కపూట కూర్చుంటే. యెవరయినాసరే వాటిని వేటినీ ముట్టరండన్నాడు. అదేం అన్నాను. శుచి శుభ్రాల మాటకేం లెండి! అవియెప్పుడూ శూన్యమే ననుకోండి.

కాగా తయారీలోవున్న మహత్తేనండన్నాడు. కాస్త వివరంగా చెపుదూ అన్నాను. ఏవస్తువయినాసరే నికార్సుగా తయారు కాకపోవడమేనండి కారణం అన్నాడు. అంటే? అన్నాను. మీ కిష్టమయిన వస్తువు లేవో ఒకటిరెండు చెప్పండి అవి తయారయ్యే పద్ధతి చెపుతా. అప్పుడు మీకే తెలుస్తుందండి సంగతి సందర్భం అంతా నన్నాడు.

పకోడీలు అన్నా. ఎందుచేతనండీ అవి మీ కిష్టం అన్నాడు. వుల్లిపాయ వుండడాన్ని నిలవవుంచడానికి వీలులేక యెప్పటికప్పుడు తాజాగా తయారుజేసి అమ్ముతారుగనుక దాంట్లో నిలవసరుకన్నది కలియడానికి సావకాశం ఉండదు గనుకనన్నాను. రామరామా! యెంత వెర్రివారండీ అన్నాడు. అదేం అన్నాను. చెప్తా వినండి. సర్వసాధారణంగా వనస్పతో వేరుశనగనూనో వాడడం చాల్దాండి వంటడానికి అన్నాడు. వేరుశనగనూని నురగకట్టదా అన్నాను. దాని కేమిటండది వక్క నిమ్మకాయతో ఫయిసలన్నాడు. బాగా కాగుతున్న నూనెలో నిమ్మకాయ చెక్కలు రెండు వేయించేశాం అంటే నురగా లేదు యేమీలేదు నూనె రకమే మారిపోతుందండన్నాడు. కాగా అన్ని రకాలవంటకాలూ అయ్యాకనేనండి పకోడీ తయారు కారణమూ, తతిమ్మా వాటికి ఉల్లివాసన రాకుండానూ పకోడీకి ఎల్లాంటినూనె అయినా సరే రుచి లోటులేక పోవడమూనండీ. కాగా పూసాబూందీ వగైరాలన్నీ దూసేసినతర్వాత చట్రాన్నిబట్టి కారే చమురూ, అడుగూ బొడుగూ

వున్న నిన్న మొన్నటితాలూకు చమురూ పకోడీ ముద్దకలిపేటప్పుడే దాంట్లోనే తర్వాతనే పక్కని ఉన్న చెంబు లోవి (అనగా అప్పటివరకూ బూందీ వగైరాల దూతలో చేతికి పట్టుకున్న సెనగపిండి చెయ్యిముంచి కడుక్కున్న బాపతువి) యిన్ని నీళ్లు పోసి కలిపితే పకోడీ కరకరలాడుతుందండి. సఖం నీళ్లూ సఖంచమురూ అన్నమాటండి అన్నాడు. అయితే మెత్తపకోడీ అన్నది పూర్తిగా నీళ్లేపోసి కలిపేదా, అప్పుడప్పుడు అదీ దొరుకుతూవుంటుంది హోటళ్లల్లోనన్నాను. కాదులెండి, నిలవున్న పకోడీ కేవలం మర్నాటికే పాడవదుగానండి మెత్తపడుతుందండి. కబుర్లలోనూ, రేడియోపాటలలోనూ మరిగిన ముసిలాళ్లూ వాళ్లూ నవలలేక మెత్తపకోడీ బాగుందనుకోవడం తప్పితే వాళ్లు తినేదెప్పుడూ మర్నాటి కుండిపోయిన సరుకేనండి. కాగా యింకొక్క సంగతండి. బూందిలో బూందీ పూసలో పూసా, వాంపాడిలో వాంపాడీ అన్నీ కలిసిపోతాయనుకోండి నిలవుంటే, కాని వాటిల్లో అడుగూ బొడుగూ మిగుల్తూవుంటుందండి. యే నాలుగైదు రోజులకో వకసారి, బూందీ బాపతు కారం వుప్పూల కల గలుపూ, పూసలో నలిగిపోయిన బాపతు చిన్న చిన్న ముక్కలువగైరా వగైరా (వుంటే గింటే చీమలతో సహా) ఆ నికార్సంతా పకోడీపిండి కలిపేటప్పుడు దాంట్లో పడిపోయిం దన్న మాటేనండి. నాటి పకోడీకి కొత్త రుచి వచ్చిందన్నమాటేనండి అన్నాడు. అదేనా యింకా యేమయినా కలుస్తాయా అన్నాను, నవ్వుతూను. వెనుక నేను కోయంబత్తూరులో పనిచేసేటప్పుడండి వక హోటల్లోని పకోడీ చాలా బాగుందన్న పేరుండడాన్నండి వాకబుచేయగా చేయగా ఆ హోటలువాడు దాంట్లో మాంసం ఉడకబెట్టిన నీళ్లుపోసి కలిపేవాడనీ దాంతో వింతరుచివచ్చేదనీ విని నేనూ నిర్విణ్ణుచిణ్ణయ్యానండన్నాడు. చాలా వింత సంగతే చెప్పావన్నా. నిత్యం జరిగే సంగతులకు వింతేమిటండి, తెలియనంతసేపు బ్రహ్మవిద్య తెలిస్తే కూసువిద్యానన్నాడు.

అయితే తీపి సరుకుల మాటేమిటన్నా. అదీ అంతేనండి. లడ్డూలలో లడ్డూ జాంగ్రీలో జాంగ్రీ కలిసిపోతూనే వుంటుందండి! కాగా జాంగ్రీ తడారిపోతే పాకంలో మళ్లీ ముంచుతాం, లడ్డూలు నిలవయితే బూందీకింద చిదుపుతాం కాదా అంటే మిగిలిన నాలుగు లడ్డూలు, ఆరు జాంగ్రీలు, పది మైసూరుపాకం ముక్కలూ వుండిపోయినహల్వా, గులాబిజాంలలో పాటు మిశ్రమమై, గోధుంపిండిలో పొదగబడి వత్తబడి వేపడమై, యే సూరతు పూరీగానో బయటికొస్తుందండి. దాంతో నిలవసరుకులు క్లోజన్నమాటండి. క్రొత్తసరుకుల తయారీకి ప్రాతిపదిక సూరతు పూరీ అండన్నాడు. అయితేసూరతుపూరీమాహాత్మ్యం యిదా కొత్త రుచితో తమాషాగావుంటే అప్పుడప్పుడు తింటూవచ్చానన్నాను. ఒకటేమిటండి క్రొత్తపేరుతో తయారయి విడుదల కాబడుతూన్న ప్రతీ వస్తువుసంగతీ అంతేనండన్నాడు. ఓల్డువైను యిన్ న్యూ బాటిల్సున్నమాటన్నాను. మీరన్న దానిఅర్థం నాకు సరిగా తెలియదుగానండి అంతేనండన్నాడు. పైగా హోటెళ్లల్లో వున్నంతకాలం మాకు యేయే వస్తువులు అవసరం. అయితే యేయే కొత్తరూపాలు యెత్తుతాయా అన్నకిటుకు తెలియనంతసేపే మా నష్టంకానండి, అదికాస్తా తెలిస్తే కాఫీహోటలు వ్యాపారమంత లాభికయిన వ్యాపా

రమే లేదండన్నాడు. అల్లాగా అన్నా. వకసా రేమయిందనుకున్నారండి! తీపి ఒకటి చేద్దాంఅని సెనగ పిండి పంచదార వగైరాలు గుచ్చెత్తడంటో యెల్లా కలిసిపోయిందో గానండి పొరబాటున టేబిలుసాల్టు కలిసిపోయిందండి. నాడు తయారయిన తీపిలో ఉప్పూ కూడా ఉందన్నమాటండి! ఈ సంగతి వకళ్లిద్దరు తిన్నదాకా మాకు తెలియనేలేదండి. వెంటనే యజమానితో ఈసంగతి చెప్పేశా, అది యేదో పొరబాటు జరిగుంటుందని. ఒక్క అరఘంట అటూ యిటూ తిరిగి తయారయిన పాతిక రూపాయీల సరకూ పోగొట్టుకోలేక దాన్నంతా చిదిపేసి పొడుం చెయ్యమన్నాడండి. కాగా మాచేత బుద్ధిపూర్వకంగా యింత కారప్పొడి కలిపించాడండి. నాటి స్వీట్సు లిస్టులో కొత్తపేరు "బాంబేమిక్సర్"! చూడండి దాని మజా! సాయంత్రానికీ శాంపిల్ కికూడా మిగల్లేదండన్నాడు.

కొత్తసంగతులే చెపుతున్నావే అన్నా. యిన్నేళ్లు హోటల్లో పనిచేసి యిదేమిట్రా యిల్లాచేశావు యీ వేళ అన్నమాట మీకు తరుచవడాన్ని, హోటలు రుచి చస్తే యింటివద్దరాదని మీకు నచ్చచెప్పడానికి, నగ్నసత్యాలు కొద్దిగా బైటపెట్టవలసి వచ్చిందండి. ఆరకంగా కొత్తరుచులు కావలసివుంటే హోటల్లోనే తెప్పించుకోండి, నన్ను చంపక. యెంత హోటల్లో బ్రతికినా యింటిపట్టున అల్లా చెయ్యడం నాచేతాగాదండి నాతరమూగాదండిఅన్నాడు మా గోపాలం.

బాగానే వుందిగాని ఆఖరికి నీవు చేసే సాంబారు కూడా పాకాన్ని పడదేం అన్నా. చెప్పాను కానండి కీలకం, అన్నింటికీ వకటే మంత్రంఅండి. సాధారణంగా హోటలుసాంబారు తరవాణీలాంటి దండి. కుండ మార్చనంతసేపూ నిజానికి దాంట్లో పదేళ్లక్రితం బాపతు సశేషంకూడా, విశేషమయి వున్నదన్నమాటేనండి. మిగిలిన పప్పూ, అడిరసమూ కలగలుపై వుండిపోయిన బంగాళ దుంపలు లగాయితు వంకాయ కాకరకాయ వగైరా యావత్తురకాలకూరల తాలూకు సశేషాలతో కలసిపోయిన విశేషమే యిడ్లీలోని సాంబారండన్నాడు. కాగా యిన్ని కొత్తవుల్లిపాయ ముక్కలతోపాటు మళ్ళీ వకసారి పొయిమీద కెక్కుతుందండి. అవసరాన్నిబట్టి ఉప్పూ కారం వగైరాలు దాని మొఖాన్నికొడతాంఅండి. అడిరసం, మైసూరు రసంలాంటివి కలవడాన్నేనండి ఒక్కొక్కప్పుడు వంగాయంసాంబారులో యింగువవాసనన్నాడు. కాగా వేడి ఒకరుచి, కొత్తఒక వింతా అండాన్నండి హాట్ హాట్ యిడ్లీతోకలిపి అక్కడ వెడితేనండి రుచుల్దాకా పోకుండానే గుటకాయ స్వాహా అయిపోతుందండన్నాడు.

ఇంకయేం అడుగుతే యేంవిని, వాటన్నింటిపైనా పుట్టబొయ్యే అసహ్యంచేత, మళ్లీ యేకాశీ దాకా పోవాలో వాటినివదిలి పెట్టడానికని మరింక పలకరించలేదు మా గోపాలాన్ని, కాశీదాకా యెందుకంటారా? మరి అక్కడేగా మనకయిష్టమయినవీ జన్మలో అంతవరకూ తిననివీ యింకముందు తింటాం అని తోచనివీ వదిలెయ్యడం! దేముని మీద వుండుకున్న పరమభక్తి శ్రద్ధలతో!! మోక్షార్థులమై !!.



# సాహిత్యోద్యమం

**శ్రీ పిల్లలమర్రి వెంకట హనుమంతరావు.**

'సాహిత్యోద్యమం' అనగానే - సాహిత్యమనే ఉద్యమం-అనే అర్థాన్ని వ్యక్తీకరిస్తుంది ఆపదం. లేకపోతే ఒక ఉద్యమం సాహిత్యపరంగా ఉన్నట్టిది అనీ అర్థంస్ఫురిస్తుంది. ఉద్యమం అనే పదం మన కెక్కువగా రాజకీయ రంగంలో అగుపిస్తున్నది. అక్కడే ఎక్కువగా చెల్లుబడి ఔతున్నది. కాని సాహిత్యపరంగా వాడడం అంతగా సిద్ధముకాదు. అందుచేత సాహిత్యోద్యమం అనే పదం కొత్తగా కన్పిస్తుంది. అయినా దీని పరమార్థాన్ని గ్రహిద్దాం.

ఉద్యమంగా సాహిత్యాన్ని స్వీకరించాలి అనే సిద్ధాంతం యీనాడులోకంలో బలీయంగాఉన్నట్లు చూస్తున్నాము. రాజకీయ ఉద్యమాలను ఉద్దీపనం చేసుకోవడానికి సాహిత్యం ఉపయోగపడాలి అనే సూత్రాన్నిసిద్ధాంతీకరిస్తున్నారు నవ్యులు. ఈవిధంగా సాహిత్యాని ఉద్యమంగాను - తదితరోద్యమాలకు సాహిత్యాన్ని ముఖ్యాంగంగాను గ్రహించాలి అనే భావం చక్కగా ఉద్భవించింది. ఈ రెంటిలోఉన్న రహస్యాన్ని పరిశీలించుదాం.

నన్నయభట్టు దగ్గర్నుంచి నాదాకావచ్చిన సాహిత్యంలో ఎన్నెన్ని మార్గాలో అగుపిస్తున్నవి. వివిధ మతాలకు అవకాశం ఇచ్చిన వివిధ రచనల్ని చూడ గల్గుతాం. ఉపనషత్తులలో సత్యం - శివం-సుందరం అనే పరమాశయాలను ఇముడ్చుకున్న మహాతత్త్వాన్ని పదిలపరిచారు పూర్వులు. తరువాతవచ్చిన పురాణాలలో దాన్నే మరోవిధంగా ప్రచురించారు. అటు తర్వాతవచ్చిన ప్రబంధాలలో లౌకిక సుఖాన్ని చిత్రించి అలౌకికానందం ఎంత మహత్తరమైనదో తారతమ్య వర్ణనపైన ప్రకటించే ప్రయత్నంచేశారు. 'తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్' అనే భావాన్ని ప్రకటించి ఉత్తమ ఆనందసిద్ధికై యత్నించాలి అని ప్రబోధ సలపడంలోకూడా పై ఉపనిషత్సారం లీలగా ప్రతీయమానం అవుతూనేఉంది. తర్వాతవచ్చిన వచన గ్రంథాలలో - యక్ష గానాలలో - గేయాలలోకూడ ఉత్తమ మానవత్వాన్ని గుర్తించేటందుకు సాధనం జరగకపోలేదు. ఇటీవల వచ్చిన నవ్య కవిత్వంలోకూడా కావ్యభిత్తిక ముఖ్యంగా ఛేదించినా, అందులో నిగూఢంగా దాగిఉన్న సూత్రం సౌందర్యోపాసనమే. ఈవిధంగా విశ్వసత్యాన్ని, సౌందర్యాన్ని, ప్రకటించడంలో ఏనాటి కవులైనా ప్రయత్నిస్తూనేవచ్చారు. కనుక కవితా వ్యాపారం అంతా ప్రధానంగా ఒకే సంప్రదాయం మీద ఆధారపడింది. మానవతత్త్వాన్ని విశదంగా ప్రకటించి అంధులోనుంచి ఉత్తమమైన వికాసాన్ని పొందించి పరతత్వంలో ఉత్సుకత కల్పించడమే ప్రధానంగా కవియొక్క కర్తవ్యం. ఈ ప్రధాన సూత్రాన్ని ఉత్తములకు-మధ్యములకు-పామరులకు ప్రబోధించడానికి ఒక్కొక్కకవి రచనసాగిస్తాడు. అంటే ఈ సూత్రపు ప్రచారానికి సాహిత్యాన్ని ఉద్యమంగా స్వీకరించారు కవులంతా అన్నమాట. భిన్నయుగాల్లోరచనాపద్ధతిలో వైవిధ్యం అగుపిస్తూ ఉండ[illegible]లాన సాహిత్యంలో అనేక ఉద్యమాలు వచ్చినట్లు తలుస్తున్నాము. ఎన్ని ఉద్యమాలుగా మన

సాహిత్యాన్ని విభజించినా ప్రయత్నం అంతా ఒకే లక్ష్యానికి కేంద్రీకరింపబడిందని చెప్పుకోవాలి. కనుక ఉత్తమ మానవధర్మాలను ఉపదేశించడానికి వివిధ కవులు వివిధ పద్ధతుల సాహిత్యాన్ని నడిపించి వివిధోద్యమకారులైనారు. సాహిత్యాన్ని ఉద్యమంగా గ్రహించిన పద్ధతిలో రహస్యం ఇది.

ఇక సాహిత్యాన్ని తదితరోద్యమాలకు ముఖ్యాంగంగా గ్రహించాలి అనే విషయాన్ని ఆలోచించుదాం. రాజకీయము - వాణిజ్యము - మొదలైన విషయాలలో ఉద్బోధ కల్గించడానికి సాహిత్యాన్ని ఉపయోగించుకోవలెనని ఇటీవలవారి కుతూహలం ; అనగా ఒక్కొక్క ఉద్యమానికి ప్రచారం కల్గించుకునే నిమిత్తం సాహిత్యాన్ని ఆశ్రయించడం అన్న మాట. ఆవిధంగా బయలుదేరే 'సాహిత్యం' పరిమితావకాశం కలిగింది అవుతుంది. ఆ ఉద్యమం ప్రాచుర్యంపొంది ఫలవంతమయ్యేదాకానే గదా ఆ విధమైన సాహిత్యం పనికివచ్చేది? ప్రయోజనం నెరవేరిం తర్వాత ఆవిధమైన ప్రచారకసాహిత్యం స్థితిలేక పోయిందే అవుతుంది గదా ! అందుచేత ప్రచారక సాహిత్యం ఆనేటటువంటిదాన్ని 'సాహిత్యం' అనే పదంతో వ్యవహరించడం పొరబాటే అవుతుంది. అది వాఙ్మయం - సారస్వతం - అవుతుందేమోకాని, శాశ్వతత్వం కలగిన కావ్యసంచయానికి వర్తించే 'సాహిత్యం' మటుకు కాదు. ఉద్యమప్రచారం నిమిత్తం వాఙ్మయాన్ని ఆశ్రయించవచ్చు ; కాని ఆ వాఙ్మయం తాత్కాలిక ప్రయోజనంకలదై కాల గర్భంలో కలిసిపోతుంది. శాశ్వతత్వంకలిగి సర్వ మానవ సముద్ధరణం - నిమిత్తంగా జనితమైనది కాక పోవడంవల్ల ప్రచారక వాఙ్మయం సాహిత్యస్థితిని అందలేదు. ఇది తదితరోద్యమాలకు వాఙ్మయాన్ని వినియోగించుకున్నందువల్ల కలిగేస్థితి.

సాహిత్యం సాహిత్యంకోసమని ఉపయోగించుకుంటే అప్పుడు తత్ప్రచారానికి సాహిత్యాన్ని ఉద్యమంగా స్వీకరించుకోవచ్చు. ఇంటింటా, ఊరూరా సాహిత్య దీపాలను వెలిగించవలసిన కర్తవ్యం ఈనాడు అధికంగా మనమీద ఉన్నది. సాహిత్యాభిరుచి కల్గించాలి. అందుకోసం ఉద్యమంగా సాహిత్యాన్ని గ్రహించాలి కాని సాహిత్యాన్ని రాజకీయోద్యమాలకు ప్రచారంగంగా స్వీకరిస్తే కలిగే పర్యవసానాన్ని ముందే చెప్పాను.

ముఖ్యంగా సాహిత్యార్చకులీనాడు సార్వకాలికముగా-సార్వజనీనముగా అభిమానింపబడే రచనావ్యాపారంలో ఎక్కువగా కృషిచేయవలసి ఉన్నది తాత్కాలిక ప్రయోజనాన్ని అపేక్షించి, మానవ సూత్ర గ్రథనంలో ఉపేక్షచేయరాదు. ఉత్తమ మానవులనుగా సంస్కరించేరచనలు అవతరించాల్సిన అవసరం ఎంతైనావున్నది యీనాడు, ప్రపంచశాంతికి పాటుపడవలసిన బాధ్యత కవిపై వున్నది; కుల తత్వ భేదాలను వర్గవైమనస్యాలను - తొలగించి సంఘంలో శాంతిని నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనావున్నది. దీనికంతకూ ఉత్తమాధికారి సాహిత్యరంగంలో ప్రవేశించాలి. ప్రబోధ వాఙ్మయంకన్న మానవత్వాన్ని నిలిపే సాహిత్యం శాశ్వతత్వం పొందుతుంది. కాబట్టి సాహిత్యంపైన అభిరుచి కల్గించే రచనలు. సాహిత్య సౌందర్యాన్ని వ్యక్తీకరించే రచనలు-సాహిత్యార్చకులు చేయవలసివున్నది. అంటే సాహిత్యాన్ని ప్రచారంచేసే నిమిత్తం పాటుపడాలి అన్నమాట, 'సాహిత్యోద్యమం' ఈ అర్థంలో చాల అవసరం. సాహిత్యం వుద్యమంగా పరిణమించాలి. అంతేగాని వాఙ్మయాన్ని ఒక ఉద్యమ ప్రచారానికి అంగంగా స్వీకరించి దాన్నే సాహిత్యం అనడం చాలా పొరపాటవుతుంది.

# సాంఘిక మనస్తత్వం

శ్రీ కవికొండల వేంకటరావు

ఒకానొక నా డాక్టర్ స్నేహితుడు, హైందవుడు, "మనవాళ్ళకు ఆసుపత్రుల్లో పురుళ్లోసుకోవడం విపరీతంగాను, విడ్డూరంగాను కనిపిస్తుంది కాని, దొరసానులకు అది పరిపాటిసుమా! రైల్లో మొదటి తరగతి బెర్తుమీదలేచి కారులో కూర్చుని నేరుగా 'పురుళ్ళవార్డు' గేటుదగ్గఱకువచ్చి, హారన్ కూయించి, లోపల ప్రవేశించి వెయిటింగురూములో ఏకాస్సేపు కష్టపడతారో అట్టే పురుటి టేబిల్ మీద సుఖంగా బిడ్డను గంటారు, స్పెషల్ వార్డు తీసుకుంటారు, వారంరోజు లయ్యేసరికి తల్లీ పిల్లా విడుమరగంటారు. ఎల్లా గుంటారనుకున్నావ్ వాళ్లు దుక్కల్లా! ఎక్కడా చెక్కు చెదరకుండా గులాబీ చెక్కిళ్ళతో తల్లీ! గుప్పిళ్ళ గులాబీతో గుంటడు!" ఇలాగ్గా చెప్పే సేస్తున్నాడు.

వాని మాటలు నేను నమ్మలేదు. నమ్మి నా బీదలకు సాధ్యముకానిది. అంతకూ నేను మగవాణ్ణి, మగవానికి మెటర్నిటీ వార్డుతో పనేమిటన్నట్టూరుకున్నాను. అతడు ఆ నా డాక్టర్ స్నేహితుడు పదే పదే హైందవసంఘాన్ని తిట్టి పోయసాగాడు. ఆ సంఘం అంత అజ్ఞానాంధకారంలో ఉన్నది మరొకటిలేదని, అధునాతన నాగరీకతతోను, నవయుగ శాస్త్రవిచికిత్స, శస్త్రచికిత్స, విధివిధాన విజ్ఞానంతోను సంబంధం బొత్తిగా పెట్టుకోదని, పన్నులిస్తూ పనులు చేయించుకోలేని ప్రజలు వీళ్లని, ఇలాగ్గా విమర్శింపదొడగాడు.

నేను "ఎల్లోపాథిక్ డాక్టర్లు అందఱూ ఇలాగ్గానే మెచ్చుకుంటారు హాస్పిటల్సుని, మళ్లీ 'హాలివుడ్డు' తారలదగ్గఱకు వచ్చేసరికి పరామర్శిస్తూవుంటారు పాశ్చాత్య నాగరకత అంత పాడుది మఱొకటిలేదని, వాళ్ల జీవితమంతా మూడు సీల్లోనూ మునగా తేలా, వారి పరమావధి సాంఘిక సంస్థలు గాని సంసారాలుగావని, అసలువాళ్లకు పిల్లల్తోటి తల్లుల్తోటి పనేలేదని మీరే అంటారు". అన్నాను. డాక్టరు "మూడు 'సీ' లంటే?" నేను "సినిమా, రేస్ కోర్సు, నైట్ క్లబ్ **Cinema C Course C, Club C.** మూడు 'సీ' లు కాలే!" డాక్టర్ "అవా? నేనింకా మెడిటరేనియన్, అరేబియన్, కరిబియన్, ఇలాంటి 'సీ' లు, సముద్రాలు అనుకున్నాను" అంటూ నవ్వేశాడు. "నవ్వేయకు డాక్టరూ! హైందవసంఘం మునుముందు 'సోషల్ మైండెడ్' కావాలి, పాశ్చాత్యపద్ధతు లనుకరించాలీ అంటే." అన్నాను నేను, ప్రబోధగా. డాక్టర్ "అవసరాన్నిబట్టి సోషల్ మైండ్, అనగా సాంఘిక మానసం, అదే అలవడి తీరుతుంది. ఏమిటిచేస్తున్నాం బస్సుల్లో, రైళ్లల్లో? కాస్తజాగా కూర్చోడానికి దొరక్క, మనుష్యులమీద మనుష్యులు ఎక్కిపోతున్నారా లేదా? పెళ్లాన్ని మూల నిలబెట్టి, మగడింకోమూలో మళ్లీ చెప్పాస్తే, ఇంకో పెట్టెలోనో వ్రేలాడిపోతున్నాడా లేదా? ఈ పెళ్లాంవాళ్లనూ వీళ్లనూ కుసింత సోటెడ్డండి అని అంటూవుంటే వాళ్లు చోటెడుతూవుంటే, అదంతా ఏమిటంటావ్? సోషల్ 'మైండెడ్ నెస్' కాక ఏం 'మైండెడ్ నెస్' అంటావు?" అన్నాడు, నేను "మనవాళ్లు ఆడవాళ్లకు చోటెట్టడంకూడాను? నువ్వెక్కడ చూశావో కాని, ఆ 'పొలైట్ నెస్' ఆ 'ఎటికెట్' చెప్పవలసివస్తే అదంతా శ్వేతముఖుల్దే సొమ్ము. కొమ్ములుతిరిగిన సోల్జర్ అయినా కోమలాంగిని చూచాడా అంటే తాను అమాంతంగా నిలుచుండి ఆమెకు 'సీటు'

చూపిస్తాడు". అన్నాను. డాక్టర్ "తాను నిలువు జీతమిచ్చుకుని తన నెలజీతం ఆమెకు ధారపోసేదు కూడానా ?" అని ప్రశ్నించాడు. నే నేదో అన బోయాను. "నీవెక్కడో సోల్జర్ చేత టోకుతిన్నా" వని; కాని అంతలో మెటెర్నిటీ భవనంముంగిట ఒక కారు ఆగింది, కారులోనుంచి ఒక పంజాబీయువకుడు సిక్కుదిగాడు.

అతణ్ణిచూస్తూ "హల్లో! మేఘమధన్ సింగు! జైహింద్!" అన్నాను. మేము అన్యోన్యం ఎఱుగుదుము. డాక్టర్ ఏదో పనిమీద వెళ్లిపోయినాడు, నాదారిని నేను షికారువెడతాననుకొని. అయితే, మేఘ మధన్ సింగు నాతో కరచాలనంగావిస్తూ "పైకి మేడమీదకురా! స్పెషల్ వార్డులో రూమ్తీసికొమంటూ నా భార్య నిక్కడకు పురిటికి పంపాను. యు,సి! మేమున్నది పరాయిదేశం. అఫ్ కోర్సు అఖండ భారత్ అమార్ మాయీ" అన్నాడు. నేనున్నూ "హమ్కు తుమ్కు ఏ కోదరభాయీ" అన్నాను. "అచ్ఛా! ఉపర్ ఆవ్! జల్దీఆవ్!" అంటూ నన్నాతడు ఆ హాస్పిటాల్ మేడ మెట్లన్నంటినీ ఎక్కించుకుంటూ లాక్కుపోయాడు.

సిక్కు మహాశయుడు మంచి ఎత్తరి. బలవసి, రూపసి . రెండుమూడు తడవలు అతని భార్యాను కూడా నేను చూచిందికద్దు. ఆమెకూడా మహాయిల్లాలు, మంచి ముద్దరాలు, మించులాగు తళుక్కుమనేకపోలాలు, కళ్లు, గల జవరాలు, వాళ్లనెప్పుడు చూచినా నేను వాళ్ల జాతీయమైన దిరీసులోనే చూచియున్నాను. ఆమె ఒక షరాయి, లాల్చీ, వోణీ వేసుకొనేది. అతడు తలపాగాను బట్టే ఇట్టే పోల్చబడేవాడు.

నన్ను అతడు గదిలోకి తిన్నగా తీసికొనివెళ్లి ఒక ఎత్తుపీటమీద కూర్చోబెట్టాడు. మెట్లు ఎక్కడంలోనే స్థల పారిశుద్ధ్యం ఆ ప్రతిమానం అని అనిపించిది. మెట్లయొక్క ప్రక్క కమ్మి నున్నదనం, తేటు, పలువురు ప్రజల పరిచయాన్ని సూచించింది. మెట్లా వసారాలోకి మమ్ము ఎగరేసుకుపోయాయి. ఆవసారాలోకి-నడుంతలుపులు స్ప్రింగుగలవి మాత్రమేవున్న ఓ పెద్ద గుమ్మం వుంది. ఆ గుమ్మమే చాలు గదియొక్కలోపలి వైశాల్యం సువిశాలమని కొలతబద్ద అక్కఱలేకుండానే చాటడానికి. గదిలోకి వెడుతూనే మనకు తగిలే ఎడం మూలనో తెల్లని ఇనపముక్కాలి మీదనో తెల్లని పింగాణీ దోనెగిన్నె లైసాల్ నీళ్లతో కనిపిస్తుంది. ఆ ముక్కాలి ప్రక్కనే వుంది నేకూర్చున్న ఎత్తుపీట, ప్రవేశపు పెద్ద గుమ్మంకు కుడితట్టునో పెద్ద కిటికీ, కిటికీకి గజాలు లేకుండా రెండు తలుపులు దళసరిగాజువీ ఉన్నాయి. తలుపులన్నీ తెఱవబడినాయి. గాలి విచ్చలవిడిగా లోపలకు వస్తూవుంది. వెలుతురు అంతకన్నా అవలీలగా ప్రసరిస్తూవుంది. కుడివైపుమూలగా డ్రాయర్సు, డ్రాయర్సుమీదనో పెద్ద అద్దం వున్నాయి. డ్రాయర్సుకు ఉండవలసిన సొరుగులన్నీ, సలక్షణంగా తాళాల సమేతంగా అమర్చబడివున్నాయి; అద్దంమునుముందో ఆకు పచ్చగళ్ల రవికపేటీ సైజుగుడ్డ మేజా బల్లపైని పరవబడివుంది. అందుమీద ట్రే, ట్రేలో రెండు నారింజపండ్లు ఒక కెటిల్, ఓ పంచదారగిన్నె, ఓ పాలకూజా, ఓ పళ్లెంలో నాలుగు మేరీ బిస్కట్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఎదరగోడ నో పెద్ద అలమారు. అలమారు తలుపులూ అద్దాలచేతనే కాని లోతట్టు తెర కప్పబడివున్నాయి, పెద్ద గుమ్మానకెదురుగా, అవల దిశ దిఙ్మండలంకాపఅచే వసారా, వసారాకు ఇనపతీగల వలఅల్లిక వుంది. దానికి కుడిమూల స్నానాలగది. రైళ్లల్లో మొదటితరగతి గాడీ లావటరీకన్న పెద్దది, పరిశుభ్రమైనది అయి వుండి తీరుతుంది అని అనుకోవాలి అది. తరువాత తెలుసుకున్నాను అందులో ఒకనీటి తుంపరకురిసే కుషీకుళాయి అమర్చబడివుంది అని. గదిలో ఓచోట పేముపడక కుర్చీ పెద్దదివుంది; వసారాకు చేరువుగా, ప్రకృతినుండి గాలోసుకుంటూ మరోమూల కర్ర కుర్చీ, డ్రాయర్సు చేరికనుంది, కూర్చుని అద్దంలో

దిద్దుకోవడానికి వీలుగా. మధ్యను ఇనపమంచం తెల్లని రంగుది వుంది. ఆ ప్రక్కన అనతిదూరంలో తెల్లటి చిట్టి వుయ్యాలా ఇనుపవల మూదిమెత్త కలిసింది ముచ్చటగొలిపింది. మంచం తలాపుదిక్కున తెల్లటి కప్‌బోర్డు వుంది. అందు మీదపచ్చగుడ్డవుంది. మంచానకు తిన్నగా సరంబీని తిరుగుతూవుంది బృహద్విద్యుద్వీవన. దాని కనతిదూరంలో వ్రేలాడుతూ పూరా డోమ్ లైట్ వొకటివుంది. గదిగోడలు ఎత్తుగాను, సరంబీ బూజూమకిలీ లేకుండాను అపరిమితమైన శుభ్రత కలిగివున్నాయి. గోడల రంగు లేలేతపసుపు. అంచుల్ని నలుపు చారలు. గదిపఱపు ఎఱ్ఱటి నున్నటి రాయి. ఆలా ఈగవాలితే తెలిసిపోతుంది. ఈగెందుకు వాల్తుంది? ముప్పొద్దూ తుడిచి ఫినైల్తో మెఱుగడుతూవుంటే ఆ నేలను?

నాకున్న తెల్లటి మంచానకున్న మధ్య అడ్డుగా ఆకుపచ్చ స్క్రీన్, స్టేండ్ మోపుదలను నిలిచివుంది. ఆస్క్రీన్ స్టేండును ఆలా దూరానకు ఓ వారకు పెడుతూ, తాను క్రకుర్చీమీద నామిత్రుడు మేథ మథన్ సింగ్ ఆసీనుడయ్యాడు.

మంచంమీదనువున్న ఆమెను చూస్తూ సింగు "తేనీరు తీసుకున్నావా?" అని డ్రాయర్సుమీది కప్పుసాసర్ అందిచ్చాడు. ఆమె "అక్కరలేదు, తీసికొన్నాను." అంది. "బిస్కట్, ఫ్రూట్?", అతిప్రేమగా ఆఫర్ చేశాడు. వద్దన్నట్టు చేత్తో నీరసంగా తెల్లటిదుప్పటి చాట్నుంచే సంజ్ఞ చేసింది.ఆమె కన్ను అలా చిట్టి ఉయ్యాలా కేసి మలిపింది. "ఓహో! పాప! చిట్టిపాప! చిట్టి ఉయ్యాల్లో చిట్టిపాప! ఆడపాపా!" అంటూ ఆలా వెళ్లి చూచాడు తన ఆడ శిశువును, ఒకపూట వయసు బిడ్డను, మేథ మథన్ సింగు. "అయితే నీవు పురుడు పోసుకునే పండుకొన్నావు ఇప్పుడు" అని భార్యాను కుశలప్రశ్న వేస్తూ, తిరిగివచ్చి క్రకుర్చీలో కూర్చున్నాడు. ఆమె నాకు "జైహింద్!" చెబుతూ అలా సంజ్ఞ వేసింది, పడకుర్చీలో విశ్రాంతిగా విశాలంగా కూర్చోమని.

నేనున్ను "జైహింద్" చెబుతూలేచి పడకుర్చీలో కూర్చున్నాను "కులాసాగావుందా అమ్మా తమకు?" అని అంటూ. ఆమె "ఊ" అని భర్త వంకకు తిరిగింది. నేను ఆమె పైపైని "ఆన్" తిరిగే సరంబీ వీవనను, ఆ వీవనయొక్క నీడల్ని పెద్దద్దంలోను, నున్నని గోడలమీదను, అద్దాల అలమారు తలుపుల్లోను కంటూ, నడుమనడుమ గదిలోకి ప్రసారించిన నూతన సంధ్యారాగాన్ని తిలకిస్తూ ఏదో ఆలోచనా నిమగ్నుడ నయ్యాను. నేనో పురిటిగదిలో వున్నట్టు బిడ్డ పుట్టడం గన్నట్టు తలపోయనేలేదు. "భగవాన్ విలాసం" అన్నాను అప్రయత్నంగా బిగ్గఱగా. మంచంమీద ఆమె లోలో నాతో ఏకీభవించినట్టు "భగవాన్ అఖండ విలాసం" అంది. చూపు భర్త వైపునే వుంచింది. పసిపాపకన్నులు వాలినవి వాలినట్లే వున్నాయి, ఒక లిప్త ఎదోధ్యానాంతర్గాములై.

"నీకు సెలవిచ్చారూ తుదకు?" అని అడిగింది, ఆ బాలెంతరాలు తన భర్తను, భర్త, చీకటిపడుతూవున్న గదిలో ప్రియురాలిమోమును మిస్టిక్‌గా చూస్తూ అంతకంటె మిస్టిక్‌గా శిశువును చూస్తూ ఒక నిమేషం అయ్యాక ఎదో తోచి స్విచ్ ఎక్కుపెట్టాడు. గది అంతా తేటు, డోమ్ షెడ్‌న పట్ప్రాళ్ళ్వలా గదిలో మొగాలన్నీ కొత్త కాంతుల్తో వెన్నెల్నా అన్నట్టు తేటబడ్డాయి. పురటాలు నవ్వుతూ "నేను మరోగడియ ఆలస్యంచేసివుంటే రైల్లో నీల్లాడి వుండే దాన్ని!" అంది. మేథ మథన్‌సింగు చిరునవ్వునవ్వుతూ "అదోవింత భోగమై ఉండేది" అన్నాడు. ఆమె "భోగం?" అని గద్దించింది. మేథ మథన్ సింగు "ఈ ప్రకంచమంతా మానవుని భోగంకోసమే సృజింపబడింది. మానవుడు తన అన్ని కార్యాలూ బొంగరంలా తిరుగుతూవున్న భూగోళంమీద నే నిర్వహిస్తూవున్నాడు. ఈరైళ్లూ, ఆసుపత్రులూ, పార్కులూ ఇవన్నీ మానవుని భోగంకోసమే అమర్చబడ్డాయి నీకు నడిచేరైలంటే అంత భయమెందుకు?"

అన్నాడు. ఆమె నాకోసమైతే భూమి కంపిస్తూ వున్నా భయపడను, చూడుదూడు, ఆ బేబీకోసం, డేఖో! అంది, ఆమె ఆలా అందో లేదో ఉయ్యాల్లోని బిడ్డ కేరుమంది, చిట్టిచేతు లెగరేసికొంటూ, తల్లి వెంటనే తన కందుబాటులోవున్న కాలింగ్ బెల్ బొత్తం నొక్కింది. వెంటనే ఒక ఆయా, ఒక స్టాఫ్ నర్సు, ఒక లేడీ డాక్టరు హాజరు జవాబిచ్చారు. నేను పడక్కుర్చీలోంచి లేస్తూ, ఆ మూగురూరాకపూర్వమే చిట్టి పాపాయి తొట్టి కుంయి కుంయి మనేలా పూప దొడగేను, మెల్లిగా, కల్లబొల్లిగా ఊరడిస్తూ.

స్టాఫ్ నర్సు అందరికంటె ముందు తన కర్ర హై హీల్సు చప్పుడు చేసుకుంటూ చేరి, ఉయ్యాల్లో శిశువును పైకెత్తి "నైస్ బేబీ" అంది, మేఘ మదన్ సింగుకు చూపిస్తూ. గరుగు కాగితం గలి గలిగివున్న తన పాదాల నలా నేల గీచుకొంటూ, పోయి, ఆయా ఆ పురటాలిమంచం, ఇంకొ సరిగా ఫోన్ క్రిందకుజరిపి "సాహెబ్ జీ, పురుడప్పుడు నరక మనుభవిస్తాం మా ఆడవాళ్లం" అంది. లేడీ డాక్టర్ తన మెత్తటి రబ్బర్ శాండల్సుతో అడుగులు లెక్కపెట్టుకుంటూ, దరిసి, పెద్దద్దంలో తన ప్రతిఫలం చూచుకొంటూ, అటే వుండి, "మేఘ మధన్ సింగు అంటే తమరే నా? నిండా అదృష్టవంతులు మీరు. మెయిల్ ఒక్క మినిట్ లేటు అయివుంటే, ఈమె డెలివరీ హాస్పిటాల్ వాకిట జరిగివుండేది. మీ దంపతులయొక్క పూర్వ కిస్మత్ వల్ల, బిడ్డని మహాదృష్టంవల్ల, ఇప్పుడు పురుడు కుసాలాగానున్నారు. మీరూవచ్చారు. మా కందఱకూ నిండా సంతోషంగావుంది" అంది.

నేను గ్లేర్ చాలా హెచ్చుగావుందని, ఎలెక్ట్రిక్ లైట్, సరంబీది, ఆర్పేశాను. తక్షణం నర్సు, టకటక నడచివెళ్లి టేబిల్ లైట్ మీట ఎక్కట్టింది. దాన్ని గ్రీన్ స్క్రీన్ కొంత చాటుపఱచడంవల్ల గది మిక్కుటంగా కాంతి వెల్లిగక్కలేదు, లేకుంటే ద్వాదశార్క తేజోమయం అయివుండేది.

"క్షమించాలి! ఇతఃపూర్వమే అన్యోన్యం ఎరుక పఱచకపోయినందుకు, ఆయన నాభర్త మేఘమథన్ సింగు. డార్లింగ్ వీరు వరుసగా మెయిడెన్ డాక్టర్ గిర్జాంబ, కన్య నర్సు కంపమ్మాళ్, అవివాహిత ఆయా అనుగమ్మ." అని చూపెట్టింది గృహిణీలలామ.

నేను అప్పటికప్పుడే గది అవలకువెళ్లి వసారాలో నిలబడివున్నాను. ఎలాగన్నా లాలివాణ్ణి!

మేఘ మధన్ సింగు అమ్మాగురు యువతులకు కరచాలనం అందిస్తూ, గిర్జాంబ గారి నడుం కిటకిటలాడ్డం కనిపెట్టి, కాంప్లిమెంటు 'వే' చేశాడు "మిసెస్సు! బలమంతా మీరే లాగున్నారే!" అని. "నేను కానండోయి! మీ అమ్మాయిగారున్నారు నాకంటె పిలగా, నాకంటె పిన్నగా!" అని చిరునవ్వునవ్వింది, అదో లీలగా. లేడీ డాక్టర్ మాతృస్వరూపిణి వెంటనే "పిన్నదనాని కేమిగాని పిలుపునకు పోగొట్టాలండీ మా అమ్మాయికి, డాక్టరమ్మ గారూ" అంది, ధోరణి మారేలా. నర్సు "అదంతా మేంచూచుకొంటాం. మీరు విశ్రాంతి తీసికొండి." అంది.

సింగు "కృతజ్ఞుడను" అంటూ గది యీవలకు వచ్చేశాడు. వచ్చివేసి, నన్ను కలుసుకుని చఱచఱా నాతో కూడా మేడదిగుతూ "మన ఆడదాన్ని నెక్కడ పెట్టినా ఒక లేకూత! పిల్ల వలంగాలేదని కంప్లయింటు. నేనెంతో కాంప్లీమెంటరీగా-నీవూ చూచేవుంటావు!" అని అగ్గోత్తిన సింగు తన ఛాతీ నా ఛాతీకి మోపి చప్పచప్పగా ఆలింగనం గావించి నిష్క్రమించాడు. నేను "ఆమెనే అన్నమాట, అందర్నీ చూచాను." అని మెసురిగేలో నా డాక్టర్ మిత్రుడక్కడేవున్నాడు. అతడు నన్ను సింగు ననుకరిస్తూ తన ఛాతీ నా ఛాతీకి చప్పచప్పన తగిల్చి ఆలింగనం గావిస్తూ "మీసింగు కోరేది తన భార్య వొక సొసైటి బర్డు కావాలని కామోసు! తన కూతురు నొక నర్సు కావాలని కామోసు!" అంటూ వీడ్కోలుగొన్నాడు. మఱి రోడ్డుమీదున్నది నేనొక్కణ్ణే! ఎవర్ని ఏమని అనేందుకు! తోచక కుందాను.

# కళలు — మానవ జీవితము

శ్రీ రాజా రంగయ్యప్పారావు

౨

మనకు కావలసింది ప్రస్తుతం సౌందర్య విషయం. సౌందర్యంవల్ల కలిగే మానసిక పరిణామం జీవితంలో ఉత్తమస్థానాన్ని వహిస్తుంది. జీవితం ఈ పరిణామంవల్ల క్షాళితమై ఉన్నతపథాన్ని అనుసరిస్తుంది! ఈ సౌందర్యం లలితకళల్లో మూర్తీభవించి ఉంటుంది కాబట్టి కళలకు జీవితంలో అత్యుత్తమస్థానం ఉంది. విద్యయొక్క ఉన్నతాశయంకూడా ఇదే.

మానవునిలోని సున్నిత భావాల్ని అభివృద్ధిచేసి మానసిక పరివర్తనం తీసుకొచ్చి జీవితంలో శోభ, ఆనందం, పారమార్థికసాధన మొదలైన వివేక విజ్ఞానాల్ని అభివృద్ధిచేయడమే పరమధర్మం.

ప్రకృతివస్తు సంపర్కంచేత అనేక మానసికానుభవాలు కలుగుతుంటాయి. ఇవి అనేక రకాలుగా ఉంటాయి. అన్నీ సౌందర్య అనుభవాలు కావు. మానసిక అనుభవం కలగడానికి కారణం శరీరంలోని నరాలద్వారాకలిగే మానసిక సంచలనం. మంచుమీద వేలు పెడితే ఆవేలు చివరనున్న నరాలలో సంచలనం కలిగి వెన్నెముకద్వారా మెదడుకు ఆ సంచలనంపోయి మంచుమీద చేయి ఉంచినామని తెలుస్తుంది. మళ్లీ మనసునుంచి వేలు తీసెయ్యమనే వార్త వస్తుంది. అపుడు అక్కడనుంచి వేలు ఇవతలికి వచ్చేస్తుంది.

శరీరంలో అరిషడ్వర్గ ప్రకోపంచేత భయంకల్గినా, కోపంకల్గినా, సంతోషంకల్గినా ఈ విధంగానే సంచలనం కలుగుతుంది. ఇంతేగాక కోపంవస్తే శరీరంలోని యాడ్రినాలిన్ గ్రంథులు "యాడ్రినాలిన్" అనే రసాన్ని రక్తంలో ప్రవేశపెట్టి రక్తాన్ని తొందరించి ఉడికిస్తాయి. దీనివల్ల పోట్లాడడానికి తగినధైర్యం, ఉత్సాహం, శక్తీ వస్తాయి. పూర్వపు రోజుల్లోమల్లే మనం సాధారణంగా పోట్లాడం కాబట్టి శరీరంలో కంపమూ, మనస్సుకు తొందర వస్తాయి. ఇవి మనం ఆపుకొంటాం కాని దీనివల్ల శరీరానికి కొంత నష్టంవస్తుంది. అందువల్లనే శాంతి గావుంటే ఆరోగ్యానికి మంచిదని చెప్తారు.

సౌందర్యానుభవం ఈ విధమైన వస్తుసంపర్క సంచలనం మాత్రమేకాదు. ఇది మానసికంగా ఉద్భవించే స్వతంత్రానుభవం. ఈ సంచలనం అవయవాల్లోనుంచి మెదడుకు కాక మెదడునుంచి అవయవాల్లోకి వెళ్లుతుంది. ఈ సంచలనానికి జన్మస్థానం అవయవ సంచయం.

మానసికోద్భవమైన సంచలనాన్నే సృష్ట్యాతురత అంటాం. ఇది సాధారణంగా మానవ ప్రకృతిలోనే ఉంది. ఏ మానవునకుగాని — ఏ జాతికిగాని ఈ సైజమైన సృష్ట్యాతురత-అంటే స్వశక్తిచేత నూత్నసృష్టిని చేయాలనే ఆకాంక్ష సహజమే.

ఈ సత్యం మనకు అనాగరక జాతులచిత్రణ దగ్గరనుండి మహా చిత్రకారుల ఉజ్వల చిత్రరచన వరకూ ద్యోతక మవుతూనే ఉంటుంది. ఈ మహాభావనాశక్తే మానవునికీ జంతుజాలానికీగల అపారమైన అవధి. ఈ శక్తే ప్రపంచంలోని సుప్రసిద్ధకళాసృష్టికి కారణము.

ఈ సృష్ట్యాతురత కళా నిర్మాణంతోగాని శాంతి చెందదు.

సౌందర్య సంచలనం మానసికోద్భవమైనా పరిసర ప్రాంతాలకు సంబంధంలేదని గాని, సర్వతంత్ర స్వతంత్రభావ జన్యమని కాని అనుకోకూడదు. పరిసరాల ఛాయలు తనలో జీర్ణించుకొని ఉజ్వలభావ స్వాతంత్ర్యం విజృంభిస్తుంది.

ఏ మహదాశయమైనా భౌతికరూపం తాల్చాలంటే కాగితంమీద చిత్రించాలి. లేదా, వ్రాయాలి. రాతిలో చెక్కాలి. గొంతుతో పాడాలి. లేక సంగీత పరికరాలతో వాయించాలి. ఇంతేగాదు చిన్నప్పటినుంచీ మనలను అనుసరించిన అనుభవాలు, మన జాతిమర్యాదలు - మన మత, సాంఘిక నైతిక, రాజకీయ, ఆర్థిక సంస్థల ఛాయలన్నీకలసి స్వతంత్ర శక్తితో మేళనమై ఒక వింత నూత్నసమ్మేళన కళా వస్తు వుద్భవిస్తుంది. ఈ నూత్న సౌందర్యం జీవితానికి దైనందినపరికరాలద్వారా ఎట్లా చైతన్యం కలుగజేస్తుందో పరిశీలించాలి.

ప్రపంచంలో ధ్వని ఉంది . ఇది కళాశక్తితో కలసి సంగీత మౌతుంది. రాళ్లు సున్నం కలప మొదలగు వస్తువులు, ఈశక్తిలోకలసి వాస్తువు, శిల్పం అవుతాయి. రంగులు కాగితం ఈ శక్తితో కలసి చిత్రాలవుతాయి. మానవునిలోని సత్వరజస్తమో గుణాలు, నవరసాలు, శబ్దధ్వని రూపాలు కలసి కావ్యాలు నాటకాలు మొదలైన మహత్తర సారస్వత స్వరూపాన్ని తెలుస్తాయి.

ఈ మహత్తర రసానంద సాధనయందే మానవ జీవితం జంతు స్వభావాన్ని విసర్జించడము, మానవత్వాన్నీకూడా అధిగమించి అధిమానవ తత్వమైన అమరత్వాన్నికూడా పొందడము జరుగుతుంది.

అప్పుడే మనస్సు సౌందర్య స్వరూపపుటంచుల సాంగత్యం చేస్తుంది. సౌందర్య స్వరూప అనుభవానందాలలో మనస్సు ఆగుతుంది. ఈ ప్రాంతాల్లోనే భౌతికానుభవం ఆత్మానుభవంలో కలుస్తుంది. వాద ప్రతివాద పూరితమైన హేతువాదపు తుదిమెట్టు కూడ ఇదే.

పూర్ణానుభవం వచ్చేసరికి భాషాపరికరం కుంటుపడుతుంది. భౌతిక మానసిక శక్తులు స్తంభిస్తాయి. సౌందర్యానుభవమే నిలుస్తుంది! ఇది వర్ణనాతీతం! ఆత్మానుభవనీయమే కాని ఈ మానసిక కళాసృష్టి కొల్తలకు అపారం.

ఉత్తమకళాస్రష్ట తన మహత్తర శక్తిచే ఈ తన పూర్ణానుభవస్మృతిని కళా నయనాలద్వారా చూపడానికి యత్నిస్తాడు. ఒక్కొకప్పుడు కళాచైతన్యమైన వ్యంగ్యాభావంచేత దాని దూరపు వెలుగులు కళ్లల్లో మెరుస్తాయి. దీని అనుభవం కళోపాసకుని సాధనాపూరితమైన ఆత్మ వికాసానిదే కాని కళదికాదు. అందువల్లే దివ్యకళావస్తు సంప్రదాయంలో, కవిత్వంలోని మాటలుగాని, సంగీతంలోని నాదంగాని, శిల్పంలోని విగ్రహంగాని, చిత్రకళలోని రేఖగాని ప్రధానమయ్యే స్వరూపశక్తివల్లగాక అందులో అంతర్యాతమైన దివ్యశక్తిచే కల్గించే ఆత్మానుభవం మీదనే ఆధారపడతాయి.

ఈ మహోత్తరశక్తే దివ్యకళాస్రష్టను సామాన్య కళారాధకులనుండి విడదీస్తుంది.

త్యాగయ్య కీర్తనలు, జయదేవుని అష్టపదులు, కాళిదాసు శాకుంతలం, అజంతా చిత్రాలు, నాగార్జున కొండశిల్పాలు, అమరావతీ స్తూపం, మధుర దేవాలయం సామాన్యకళా ప్రపంచంలోంచి విడివడి అమరత్వాన్ని పొంది మహోజ్వల కళారాధకుల్ని సృష్టింపగల్గుతున్నాయి.

అందుకనే శ్రీ శంకరులవారు ఆనందస్వరూపాన్నిగురించి ఇలా నిర్వచించారు.

జాగ్రత్స్వప్న......శబ్దావాచ్య మహం
నమామి సతతం వ్యుత్పత్తినాశాత్పరం.
[శ్రీరామ కర్ణామృతం]

తా- జాగ్రదాద్యవస్థా త్రయమందు ప్రకాశించు తత్వమును, జ్ఞానమాత్రమును, రూపముగలిగినట్టి, చేతనా స్వరూపమయినట్టి, మనోవ్యధా పాపములు లేనట్టి, భూమి మొదలగువాని తన్మాత్ర స్వరూపమయినట్టి, శాంభవీముద్ర మొదలగు సమస్తయోగముల యొక్క సమూహమయినట్టి, సాంఖ్యతత్వములకంటె వేరైనట్టి శబ్దగోచరం కానట్టి, జన్మనాశనములు లేనట్టి, ఆనంద స్వరూపమునకు నేనెల్లపుడునమస్కరించుచున్నాను

అన్ని కళల్లోనూ పూర్వంనుంచీ కవిత్వానికే ప్రాముఖ్యం.

ఆర్యులు వేదబుక్కలు ఆశ్రమాల్లో పఠిస్తుంటే-సామగానం చేస్తుంటే-ఆ కవితామాహాత్మ్యం ఆ సంగీతస్వరమాధుర్యం, మహారణ్యాల్లో శాంతంగా శ్రావ్యంగా ప్రతిధ్వనిస్తూ మానసికత్వానికి ఆత్మవికాసం సులభ్యం జేసేవి.

ఈ భారతదేశంలో అంతా శ్లోకమయం, ఛందః పూరితం. ఇటీవలివరకూ సారస్వతం అంటే పద్య రచనే. వచనానికి మన సంప్రదాయంలో ప్రాముఖ్యతే లేదు. అందువల్లనే భారతీయ సారస్వతానికీ సంగీతానికీ అవినాభావసంబంధం.

మనుధర్మశాస్త్రము శ్లోకాలు, కౌటిల్యుని అర్థశాస్త్రమూ శ్లోకాలే. ఒకటేమిటి అన్నీ ఛందోభరితములయ్యే ఉంటాయి. పూర్వం వ్రాతలేనిరోజుల్లో ఈ ఛందస్సే సారస్వతాన్ని రక్షించింది. వేదాలు ఏలా రచింపబడ్డాయో, రచింపబడి ఎలా జ్ఞాపకం ఉన్నాయో, మనకు ఇపు డర్థంకాదు. ఈ అపార ధారణాశక్తి బ్రహ్మచర్యము, హఠయోగకర్మలు మొదలగు శారీరక శక్తులచే సాధ్యమైంది. ఇంత సాగరతుల్యమైన సారస్వతాన్ని తరతరాలుగాపోనివ్వకుండా వారి శక్తులన్నీ ధారవోసి మనకందజేసినందుకు ఆశ్రమవాసులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞులమై ఉండాలి.

ఒక్క ఉదాహరణచూస్తే సంగీతానికీ సారస్వతానికీ ఉండే సన్నిహిత సంబంధం బోధపడుతుంది.

జయదేవ గీతగోవిందం ప్రపంచ సారస్వతంలో ఉత్తమోత్తమశ్రేణికి చెందిందని ప్రాజ్ఞులందరి అభిప్రాయం. దీనికి కారణం దీలోగల సంగీత సాహిత్యాల ఐక్యతయే. ఈవిధమగు నైక్యత సంస్కృత భాషలో తప్ప మరేభాషలోనూ సాధింపబడలేదు. వీటిదగ్గరగా వస్తే త్యాగయ్యగారి తెలుగుకృతులే కావాలి.

“ లలితలవంగలతా పరిశీలన
కోమలమలయసమీరే
మధుకరనికరకరంబితకోకిల
కూజితకుంజకుటీరే.

ఇందలి శబ్దాల కూర్పు-అర్థంలోస్ఫురించే భావం-ఛందస్సులో ఉండే లయ-కవిస్వీకరించిన ప్రకృతి సౌందర్యం - అన్నీ ఏకైక రసస్వరూపంలో సమైక్యత పొందడమే మహత్తర సృష్టి.

ఈ గేయాన్ని వసంతరాగంలో పాడాలి ఆదితాళంకాని యతితాళంగాని నడపాలి అని నిర్ణయం.

లవంగల తలతో ఉండే మంజకుటీరం - మలయమారుతం - మధుకరధ్వని శృతి - కోకిల కూజితం సంగీతం - వసంతరాగం - జయదేవుని కవితామృత ప్రవంతిలో విడదీయరాని సమైక్యత పొందాయి, శబ్దంలో అర్థంవలెనే ఛందస్సులో సంగీతం కలిసిపోయింది. ప్రకృతిలో తుమ్మెదశృతికీ కోకిల పాటకూ సహజైక్యత ఉన్నట్లే ఈ కవితా చిత్రణంలో కళలన్నిటికీ సమ్మేళనం కుదిరింది.

పదకొండో అష్టపది చూడండి.

“ ధీరసమీరే యమునాతీరే......
కురుమమవచనం - సత్వర రచనం -
పూరయ మధురిపు కామం.

ఈ అష్టపదిలోని రెండో చరణంలో భావగాంభీర్యం ఎంత ఉన్నతపథంలోకి వెళ్లిందో భావానికి అక్షరరూప సృష్టి దానిఅంత అదే జరిగింది.

“ నామసమేతం - కృతసంకేతం
వాదయతే మృదు వేణుం
బహుమనుతే నను తే తను సంగత
పవనచలితమపి రేణుం ”

“ తా—నామమువే మురళీగానము చేయును నీ మేని గాలిచే రేగిన పరాగరేణువునైనను ప్రేమించును.” సామాన్య కవివలె ‘కృష్ణుడు నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నా’ డని అనలేదు.

# కళలు — మానవజీవితము

జయదేవుని మృదుశబ్దాలు సులభంగా కన్పించినా శ్రీ కృష్ణుని కళాజీవనమూ భౌతిక జీవనమూకూడా రాధకే అంకితమైనవనే ధ్వని స్ఫురింపజేయుటలోనే నిశితత్వం ఉంది. అంతర్బాహ్య జగత్తులు రెండూ ప్రేమలో లీనము చెందించుటే పూర్ణపరిణతి. ఇదే మహాకవికీ సామాన్య కవికీ ఉండే తారతమ్యం.

సంగీతంలోనే మన ప్రపంచం ఉద్భవించింది. నాకే సృష్టికి మూలకారణం. ఓం కారమనే నాదబ్రహ్మమే సంగీత సారస్వతాలకు ప్రధాన బీజం. "ఓం"లో అ ఉ ఓ అనే మూడక్షరాలున్నాయి. ఇది అనాదికాలంనుంచీ మన సంప్రదాయంలో మహోన్నత స్థానాన్ని అధిష్టించిన సర్వశక్తివంతమగు ప్రణవవాదం. ఈ నాదోచ్చారణ వల్లనే అనేక అపూర్వానుభవాలు కలుగుతాయి. వేదంలోకూడా అందుకే ఉచ్చారణకు అంత ప్రాముఖ్యం. మంత్రశక్తికూడా సదుచ్చారణమీదే ఆధారపడి ఉంటుంది. అందుకనే పళ్లూడిపోతే మంత్రం పట్టివ్వదంటారు. నాదాన్ని మన పూర్వులు ఎంత భక్తితో స్తుతించారు! "నాదం నాదవినీలచిత్తపవనం ...... నాదాంతధృవమండలే బ్జరుచిరం రామం భజే తారకం".

తా— ఓంకారవాచ్యుడును, వేదాంతములయందు ప్రతిపాదింపబడినవాడును, నామరూపములు లేనివాడును, శ్రొత్తమేఘమువలెనల్లనైనవాడును, వేదములయందు ప్రీలికలవాడును. అంతరాత్మయైనవాడును, ఆశ్రయించువారిని రక్షించువాడును, నైన శ్రీరాముని సేవించెదను" (శ్రీరామ కర్ణామృతము).

ప్రస్తుతకాలంలోకూడ మనశ్శాంతి కావలసిన రోగులకు ఆరోగ్యం కుదరడానికి ఆస్పత్రులలో సంగీతంకూడా పాశ్చాత్యదేశాల్లో ఉపయోగిస్తున్నట్టు వింటున్నాం. యుద్ధసమయంలో, శుభసమయాలో అశుభసమయాల్లో వాద్యాది విశేషాలు ఉపయోగించడం చూస్తూనే ఉన్నాం.

కళావస్తువుకు ఐక్యత ముఖ్యగుణం. ఈ ప్రత్యేకత వల్ల పరిసర ప్రాంతాలనుండి వేరుచేయబడుతుంది. ఈ ఐక్యత అనేక గుణసమీకరణవల్ల చేకూరుతుంది. భారతీయ సంప్రదాయప్రకారం స్త్రీలను రేఖావిన్యాసంతో చిత్రించి పాశ్చాత్య సంప్రదాయ సిద్ధమయిన వెలుగునీడల మిశ్రమంతో వెనకఉన్న వృక్షాలు పర్వతాలు చిత్రిస్తే చిత్రంలో ఏమీ ఐక్యత ఉండదు. బాపిరాజుగారి చిత్రాలు విక్టోరియా ఫ్రేముల్లో పెడితే ఇలాగే ఉంటాయి.

ఐక్యతలోకూడా రెండువిధాలున్నాయి. ఒకటి సామాన్యమయిన, ఒకేవిధమయిన వస్తు సమీకరణ వల్ల వచ్చేది. రెండవది వివిధవిధాలైన వస్తుసమీకరణ వల్ల కలిగేది. ఈ రెంటిలో రెండవది ఉత్తమమయినదీ, జీవితంలో ప్రకృతిలో శోభ తెచ్చేదీ అవుతుంది.

ఉదాహరణంగా:— ఒక కొలను ఉంటుంది. అందులో వికసించిన పద్మాలు ఎంతో సొగసుగా ఒకదాని ప్రక్క ఒకటి ఉంటాయి. వీటి సమూహం అందంగానే ఉంటుంది. ఇంతేగాదు ఈ కొలనులో ఇంకొక మహత్తరమయిన ఐక్యతా, సుందర ప్రకృతి దృశ్యం ఉన్నాయి. కొలనులో పద్మాలు వికసించినై. ఆరేకుల్లో, కర్ణికారాల్లో తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నాయి. వీటి మధ్య బాతులు నెమ్మదిగా తూగిపోతుంటాయి, మధ్యమధ్య తెల్లటి కొంగలు కూర్చొని ఉంటాయి. ఇక్కడికే వివిధవిధాలైన వస్తువుల సమైక్యతవల్ల శోభిలుచున్నది. ఇంకా ఉషఃకాంతులు గాలిచే కదల్పబడ్డ నీటి కెరటాల్లో ప్రతిబింబిస్తుంటాయి. స్త్రీలు గృహకృత్యాలకు రేవుల్లో నీళ్లుముంచుకు వెళ్లుతుంటారు ఈ మహత్తరదృశ్యమెంత రమణీయం! భిన్నవర్ణాలు, విభిన్న స్వరాలు, వివిధదృశ్యాలుకలిసి ఐక్యత చెందడమే ఈ మహాదృశ్యంలో ఉజ్జీవించే రామణీయకత.

ఇందువల్లనే ఉత్తమ కళలో విభిన్నైక్యత ముఖ్యమౌతుందిగాని, అభిన్నైక్యత కాదు. అభిన్నైక్యత విసుగు, ఏవగింపు, కలిగిస్తుంది. విభిన్నైక్యతనే సంఘపరంపరంగా చూస్తే సంఘీభావం అంటాం. అంటే వివిధప్రకృతులు, భావాలు, కలిగిన మనుజులు సమరసమార్గగాములు కావడమే.

ఈ భిన్నైక్యతలో రెండుభాగాలు ఉన్నాయి. ఒకటి ఆంగిక పరిమాణం, రెండవది మాధుర్య సమ్మిళితం (Proporton & Harmony) ఆంగిక పరిమాణం కళావస్తువులో భౌతిక స్వభావానికి చెందింది. ఇక విజయనగర పద్మమహల్లో కొంత కనుపిస్తుంది. తాజ్ మహల్లో చాలా దివ్యంగా కనుపిస్తుంది.

మాధుర్య సమ్మేళనం (Harmony) స్వరైక్యత) ఈవిధంగానే అధిభౌతిక సంచలనారికి సంబంధించింది. ఇది అన్ని కళావస్తువుల్లో ఉన్ననూ సంగీతంలో అనేక వాద్యాది విశేషాలు కలిపి వాయించు మేళంలో స్ఫుటంగా వ్యక్తమవుతుంది.

ఆంగిక పరిమాణం కళావస్తువులోని అంతర్భాగాలన్నిటినీ కలిపి ఏకైకమగు కళైక్యత చేకూరుస్తుంది. ఇందువల్ల కట్టడంలోని ముఖ్యమయిన భాగాలు ప్రాముఖ్యత వహిస్తాయి. ముఖ్యంగానివి మరుగుపడి ఉంటాయి. చిన్నవీ పెద్దవీ కలిసి సుప్రసిద్ధ వాస్తు సౌందర్యాన్ని సృష్టిస్తాయి. ఈ సత్యం అన్ని కళల్లోను ఇంతే.

మాధుర్య సమ్మేళనం (Harmony) కళావస్తువులోని లావణ్యయోజనలేక సౌందర్య - చైతన్యాల కలయిక అని చెప్పవచ్చు. ఇది ముఖ్యంగా సంగీతంలో ద్యోతకమవుతుంది. సంగీతంలో మాధుర్య సమ్మేళనమేకాక మార్దవం (Melody) కూడా ఇంకొకగుణం ఉంటుంది. ఇది త్యాగయ్య కీర్తనల్లో ఉంది. పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు పాడుతుంటే, బాలమురళీకృష్ణ పాడుతుంటే, చాల హృదయరంజకంగా మార్దవంగా ఉంటుంది. వెంకటస్వామి నాయుడుగారి ఫిడేలు వాద్యం ప్రపంచాన్ని మరిపిస్తుంది.

గాత్రపాట ఇద్దరుగాని, ఇంకా ఎక్కువమంది గాని కలిసిపాడేటప్పుడుబాగాఅనుభవించగలుగుతాం. పాటకచేరి చేసేటప్పుడు గాత్రముతో అనేక సంగీత వాద్యవిశేషాలు కలిసినపుడుకూడా ఈ మాధుర్య సమ్మేళనం అనుభవించగలుగుతాం. దీనినే త్యాగయ్యగారు

"స్వర - రాగ - లయ సుధారసమందు
వరనామమనెడు కండచక్కెర మిశ్రముజేసి"

అనిన్నీ

"మూలాధారజనాద మెఱుంగుటే
ముదమగు మోక్షమురా"

అనిన్నీ

"స్వరరాగసుధా రసయుత భక్తి
స్వర్గాపవర్గమురా"

అనిన్నీ మానవకోటికి దివ్యసందేశ మొసంగియున్నారు. వివిధములగు జంత్రగాత్ర స్వరసంయోగముల ఐక్యతయందే కళాసౌందర్య ముజ్జీవించుట స్పష్టము.

కర్ణాట సంగీతంలోను, హిందుస్తానీ సంగీతంలోను సుస్వరానికి ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. ఒక్కే రాగం సాధారణంగా పాడుతుంటాం. ఇది మార్దవాన్ని ప్రసాదింస్తుంది. పాశ్చాత్య సంగీతంలో సొనాటా కాన్సర్టో మొదలయిన జంత్రనాద మిశ్రమంలో వివిధ నాదాలుకలిసి భిన్నైక్యత అయిన మాధుర్య సమ్మేళనాన్ని చేకూరుస్తాయి, ఉత్తమ సంగీతంలో మాధుర్యసమ్మేళనం - మార్దవంకూడా కలిసి ఉంటాయి. "బీథోవెను అయిదవ సింఫనీలో" ఈరెండు భాగాలుకలసి సుప్రసిద్ధ ఐక్యతను తీసుకొచ్చాయి. అందులో, పరుగెత్తే భావాలన్నీ హృదయాన్ని కరిగిస్తాయి, ఇలాంటి మాధుర్య సమ్మేళనం కలిగించడానికి మహత్తరమయిన మానసిక సమీకరణ శక్తి కావాలి. ఈ మధ్య కొత్తగా రష్యాదేశంలో ఒక కంపోజరు "స్టాలిన్‌గ్రాడు సింఫొనీ" అని తయారు చేశాడు, ఇది వింటుంటే అక్కడ జరిగిన ఫిరంగుల ధ్వనులూ, బాంబు ప్రేలుడులూ. స్త్రీ పురుషుల ఆర్తనాదాలూ, నారి ధైర్యసాహసాలూ, జర్మనుల క్రౌర్యం, రష్యనుల ఔపయికా వేశము, శాంతిస్థాపనావేశము, ఎన్ని పేపర్లు చదివిననూ అర్థంకానంత బాగా తెలుస్తాయి. మన కర్ణాట సంగీతంలోకూడా ఇట్టి మాధుర్య సమ్మేళనం ఎవరైనా విద్వాంసులు ముమ్ముందు చేయవలసి ఉంటుంది.

మార్దవం వ్యక్తిత్వ భావాన్ని—మాధుర్య సమ్మేళనం సాంఘికభావాన్ని తెలియచేస్తాయి. ఇది కొంత

వరకు ప్రాచ్య పాశ్చాత్య నాగరకతా విభేదాన్ని కూడా చూపుతుందేమో ?

జడపదార్థలయిన రాయి, కఱ్ఱ, లోహము, నార మొదలయిన వాటికి నైజ నిర్మాణంఉంటుంది. ఈ వస్తువులతో కళాసృష్టిచేసినపుడు ఈ నైజనిర్మాణం నూతనకళావస్తువుకు ప్రత్యేకశోభను కలుగజేస్తుంది కాబట్టి ఆయా వస్తువుపయోగించేటప్పుడు శోభచెడకుండా చూడాలి.

ఇనుముకు రంగువేసి కొయ్యవలె చూపించడమూ, కాగితంతో పూలు తయారుచేసి పూలపాత్రలలో పెట్టడం ఘోరమయిన అన్యాయం. ఈ కృత్యం కళా నిర్మాణానికి సంబంధించిన అవినీతి. నడవడిలో ఎట్లా కట్టుబాట్లుంటాయో కళా నిర్మాణానికి కూడా అలాంటి మర్యాదలే ఉన్నాయి. ఇవి ఉల్లంఘించడం నిర్మలకళోపాసకునకు ధర్మంకాదు. కొమ్ములను దంతంలాగ చేసేవాళ్లు కర్రలకు రంగువేసి అడవిగేదెల కొమ్ములని చెప్పేవాళ్లు అందరూ కళాపచారం చేస్తున్నా రన్నమాటే. ఇది నాటకంపట్ల మాత్రం చెల్లదు. ఎందుకంటే నాటకంలో మనం అన్ని వస్తువుల్నీ సంజ్ఞామాత్రంగా తీసుకొంటాం. ఈ సంగతి నటులకీ ప్రేక్షకులకీ తెలిసివుంటుంది. శకుంతల నాటకంవేస్తే దుష్యంత పాత్రధారుడు దుష్యంతుడిలాగ నటించి పాత్రలో పూర్తిగా లీనమయినా తను నిజంగా దుష్యంతుడను కానని తెలుసుకోకుండా ఉండరు ప్రేక్షకులు. దుష్యంతుడే ననేభావం కల్గించుకొన్నా నిజమయిన దుష్యంతుడు కాడని అందరకూ తెలుసు. అలాగే రంగస్థలంలో ఉండే అన్ని వస్తువులూ. ఇవుడే కాగితంపూవుల సంగతి అనుకొన్నాం. కాగితంపూలు రంగస్థలానికి ఉచితమే అవుతాయి. ఎందుకంటే రంగస్థలమంటేనే అనుకరణం, కృతకం. గనుకను, కాగితపు పూలు సహజసౌందర్యం మధ్య గృహాల్లో అనుచితం.

వర్ణం కళావస్తువులన్నిటికీ ఉండే ముఖ్యగుణాల్లో ఒకటి. సూర్యకాంతిలో ఇమిడివున్న సప్తవర్ణాలే ముఖ్యాలయినప్పటికీ వీటి కలయికవల్ల ఉద్భవించేవి అసంఖ్యాకంగా ఉన్నాయి. ఈ రంగులు మానవ ప్రకృతికి స్వచ్ఛమయిన పరిణామంకలిగిస్తాయి. రంగుల అద్దాలక్రింద పరుండబెట్టి వైద్యంచేస్తారు. రంగుల సీసాల్లో పోసిన నీళ్లు త్రాగించికూడ చాల జబ్బులు కుదురుస్తారు. దీన్నిగురించిన శాస్త్రం ఒక పెద్ద గ్రంథం ఉంది

ఈ రంగుల కలయికవనల్లనే చిత్రకళలో ఉత్తేజం కలుగుతుంది.

ఉషఃకాలపు అరుణకాంతులు, పూర్ణిమా చంద్రికలు, తటాకంలో ఆకాంతుల ప్రతిబింబాలు, చామంతుల పసుపురంగులు, గులాబీలరక్తిమ, అందరికి ఆనందం కలుగజేస్తాయి. వసంతఋతువు చూడండి.

శ్లో॥ ద్రుమాః సపుష్పా : సలిలం సపద్మం
స్త్రియస్స కామా : పవనస్సుగంధిః
సుఖా : ప్రదోషా దివ సాశ్చరమ్యాః
సర్వం ప్రియే చారుతరం వసంతే.

ఋతుసంహారం

వసంతఋతువులోని ఉద్యానవనాలకు దివ్యాంబరారకు ఆనందించని ప్రాజ్ఞుడెవడుంటాడు.

రంగులు వెలుగు కెరటాల తారతమ్యత మీదే ఆధారపడి ఉండేవి కాబట్టి మానవ శరీరానికి ఆతపస్నానంలాగా ఇవికూడా ఆరోగ్యమున్నూ మానసికంగా ఆనందమున్నూ ప్రసాదిస్తాయి. అందువల్లే రంగులు మానవ జీవితంలో అంత ప్రాముఖ్యత వహించాయి.

కజిన్సుగారు కళల విషయమయి ఒక విచిత్రమయిన విషయంచెప్పారు. అదేమిటంటే చలనమున్న కళలను అచలనంగా ఆనందించాలి. అచలనమయిన కళలను చలనంతో ఆనందించాలి. చిత్రలేఖనం. శిల్పం—వాస్తువు మొదలయిన కళలు అచలనములు. వీటినిచూచి ఆనందించాలంటే ఒక ప్రదేశన్నుంచి ఇంకొక ప్రదేశానికి తిరుగుతూ పరీక్షిస్తేనేగాని వాటి నైజశోభా, ఆంగిక ప్రమాణం, మాధుర్య

సమ్మేళనం, పూర్తిగా అనుభవించలేం. చలనంగల నాటకం, నాట్యం, సంగీతం, శ్లోకపఠనం, అచల నంగా ఉంటేనేగాని ఆనందించలేం. అందువల్లనే చలనంగల కళలను చూచేందుకు కూర్చునే అసనా లుంటాయి. నాటకంలో సినిమాల్లో డబ్బిచ్చి కదల కుండా రెండు గంటలసేపు కూర్చుంటాం. చిత్రకళా ప్రదర్శనంలోగాని శిల్పాలదగ్గరగాని కూర్చో నవ సరంలేదు. తిరుగుతూనే ఉంటాం.

భారతీయ చిత్రకళా-శిల్పాలలో మహోజ్వల జీవిత లక్ష్యాలు చిహ్నితములై ఉంటాయి. రూప కల్పనం,భావప్రకటనం లావణ్యయోజనం, వర్ణికా భంగిమ, మొదలయిన గుణాలు భారతీయ చిత్రక ళలో ప్రశంసనీయాలు. అజంతా చిత్రాల్లో రేఖా సౌందర్య విన్యాసాల్లోను, బోరాబొద్దూరు (జావా) లో ఉన్న బుద్ధ విగ్రహంలో శాంతి భావంలోను మానవ జీవితప్రవృత్తికి లక్ష్యంపదగిన ఉజ్వలత స్ఫురిస్తూ ఉంటుంది.

భారతీయదృష్టిలో లలితకళలకీ జీవితానికీ అవి నాభావ సంబంధం ఉంది కాబట్టే పండితులు జీవి తాన్ని జీవితకళ అన్నారు.

ఈ లలితకళ ప్రభావంవల్ల ఎంత కఠినమనస్సు యినా కరగమానదు.

ఇంత ఎందుకు; ప్రళయరుద్రునిచే శివానృత్యం. మురళీకృష్ణునిచే రాసక్రీడా చేయించింది భారతీయ కళా చరిత్ర.

భారతీయ దృక్పథంలో సృష్టి విలయాలుకూడా కళలే అన్నమాట మరువరానిది. మన జీవితమంతా కళాలలితం—మనం కట్టుకొనే బట్ట తీసుకొందాం. చేతితో వడికి చేతితో నేసిన బట్టలో ఉండే చైతన్యం యంత్రనిర్మిత వస్త్రంలో మనకు కన్పించదు. ఇది మన మానసికభావమే అయినా చైతన్యం, మానవ హస్తనిర్మితిలో నిర్మాతభావపరిణామం స్ఫురించక మానదు, రంగునూలుతో నేసినబట్టకూ అచ్చు దిమ్మతో అద్దినబట్టకూ కూడాకొన్ని లోపాలు తేడా కనిపిస్తాయి.

చిత్రకళలో చూడండి. చిత్రకారుడు స్వహస్తా లతో చిత్రించిన **(Original Painting)** దాని అచ్చు ప్రతిమలకీ తేడాలేదూ ? అచ్చుప్రతిమ, ఒక రూపాయి అయితే, అసలు చిత్రం వేయి రూపా యిలుంటుంది. అసలు చిత్రాన్ని అమూల్యంగా భావి స్తాం. అర్థికదృష్ట్యా చూస్తే దీనికి కారణం వజ్రం ఖరీదులాగా అలభ్యత్వాన్నిబట్టి అనిపిస్తుంది కాని అది పూర్తి సత్యంకాదు.

సంతక విషయంలోచూచినా, సంతకపు అచ్చు ప్రతిమలతో మీరు సంతోషపడతారా, ఎన్ని సంత కాలయినా స్వహస్తంతో చేయమంటూరు కాని నిర్జీవ ప్రతిమతో సంతృప్తిపడరు.

ఈవిషయం నాటకానికీ సినిమాకీ పోల్చి చూస్తే మనకు బాగా తెలుస్తుంది. నాటకం కంటే అన్నివిషయాల్లోనూసినిమా పైచేయి వేస్తుంది. సినిమాలో దృశ్యాలు సహజమైనవి. నాటకంలో దృశ్యాలు కృత్రిమాలు. సినిమాలో పాటలుమాటలు అనేకసార్లు సరిచూచి చివరకు సరియైనవాటినిగాని ప్రదర్శించరు. నాటకంలో ఎన్ని రిహార్సల్సు వేసినా చివరకు రంగంమీద కొచ్చేసరికి ఎన్ని అపభ్రంశాలు జరుగుతుంటాయో మీకు తెలియని విషయంకాదు. అయినా, సినిమాలో ప్రతిమలు—నాటకంలో మాన వులు భావప్రకటనంచేయడం తేడాలో మనం నాట కాన్నే ఎక్కువ హర్షిస్తాం.

సినిమా ప్రదర్శనంరోజున అందులో నటించిన ప్రముఖ నటీనటులు వస్తే ఎంత డబ్బు వస్తుందో చూడడంలేదా !

సంగీతంకూడా అంతే మనిషివచ్చి పాడినదానికీ గ్రామఫోను ప్లేటులమీదగాని రేడియో పాటగాని వినడానికీ ఎంత తేడా వుంటుంది. దీనికి కారణం మానవహృదయంలో వుండే నైసర్గిక చైతన్య వాంఛ. యంత్రంలో చైతన్యం శూన్యం.

కార్లయిలు అన్నట్లు ఇదే జీవిత రహస్యం.

తప్పు చేయడానికి 9 పాళ్లు సావ

కాళం నైజంలో వుంటే తప్పుచేయకుండా ఒప్పును సాధించడం గొప్ప. అలాగే కళాసృష్టియంనునూ. యంత్రం తప్పుచేయనే జాలదు. అధఃపాతానికిపోయే మార్గమున ఉండే మానవుడు దివ్యశిఖరంమీదికి ప్రయాణించడం చేయాలి. మనం ఎవరెష్టును ప్రాకగలిగితే ఎంత సంతోషంగా ఉంటుంది. ఎందుకని! ఎక్కడానికంటే జారిపడడానికే ఎక్కువ వీలుంది కాబట్టి.

సుప్రసిద్ధ చిత్రకారుడు ఒక చిత్రాన్ని చిత్రిస్తే దానిలో ఉండే లోట్లనుగణించడానికి ప్రయత్నిస్తాం. యువకుడెవరైనా చిత్రిస్తే దానిలో ఉండే సొగసుల్ని మాత్రమే పరిశీలిస్తాం ఇది హృదయంలో ఉండే సౌహార్ద్రం.

యంత్రం ఒకేమాదిరి వస్తువులను ఎంతకాలమయినా తయారుచేస్తుంది - మానవుడు అంత సామగ్రి తయారుచేయలేకపోయినా ఎన్నిచేస్తే అన్నీ నిత్యనూత్నాలుగా ఉంటాయి. అందువల్లనే మానవ నిర్మితాలనే కళలంటాం. యంత్ర నిర్మితాల్ని కళలనం. యంత్రాలకు భావంలేదు. స్వశక్తిలేదు. ఒకవేళ ఈ నూతనప్రకృతి శాస్త్ర నాగరకతా యుగంలో ఎవరైనా ఆలోచనా యంత్రాన్ని కనిపెట్టినా మనం సంతృప్తిపడం. ఎందుచేతనంటే అది తప్పు చేయజాలదు. అది స్వర్గనరకాలకు ప్రయాణింపజాలదు మనం కోరేది కేవలం ఒప్పేకాదు, సత్యమే కాదు. తప్పును దిద్దుకొనే ఒప్పు—అసత్యాన్నిజయించేసత్యం.

“ కష్టసుఖముల సంక్రాంతి. కావ్యజగము ”



# సుందరం భార్య

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

నాకు సుందరాన్ని చూస్తే కోపము. ఎన్నిసార్లని చెప్పేది, మాట వినే రకం అయితే అనుకో వచ్చు. ఎబ్బే! ఈ రకం మనుష్యులను బాగుచేయ లేము.

వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. తీరా అతనికి చూచేటప్పటికి జాలివేసింది, ఈ తభా కూడా గట్టిగా చెప్పిచూస్తాను. ఇదే ఆఖరు సారి కూడాను. వింటాడా సరే, సరి. వినడూ. ఇక వాడి కర్మానికి వాడిని వదిలేసి ఊరుకొంటాను. ఇల్లా అనుకొని 'ఏమోయ్–ఏమంటున్నది మీ ఆవిడ' అని పలకరించాను.

సుందరం నవ్వి ఊరుకొన్నాడు.

'నీవు ఏమీ మారినట్టులేదే ?'

ఏమన్నా జబాబు ఇస్తాడనుకొన్నాను. అతనేమీ మాట్లాడక నవ్వి, తల వంచుకొని ఊరుకొన్నాడు.

'ఒరేయ్ వాజమ్మా! ఇంకా ఎన్నాళ్లు చెప్పాలె నీకు భార్యమీద కాస్త అధికారం చెలాయించాలని! తోడి వాళ్లను చూచి అయినా నేర్చుకోరాదూ! నీవు ఇల్లాగ అయిపోవటం నాకు తలవంపులుగా ఉంది. నాకేమిటి! మొగజాతికే తలవంపులుగా ఉంది!' అన్నాను మావాడితో.

మావాడు అంటే, ఈ సుందరం నాకేమీ బంధువుగాదు. ఒక విధంగా శిష్యప్రాయుడు. నాకంటే వయస్సులో చాలా చిన్నవాడు. భార్య కాపరానికి వచ్చి మూడేండ్లు అయింది. ఒక ఆడపిల్ల.

సుందరం వట్టి వెర్రిబాగులవాడు. ఆ పెళ్లాం ఎంతజెపితే అంత! ఆ అమ్మాయి చెప్పినట్లు వింటూ, ఆవిడకు సాహాయ్యంగా అన్ని పనులూ చేస్తూ ఉంటాడట! ఆడవాళ్లంతా చెప్పుకొని ఊహూ నవ్వుకొంటూ ఉంటారు. సుందరం సంగతి ఇల్లా ఉందని మా ఆవిడ చెపితే విని, నేనూ ఎంతో నొచ్చుకొని వాడిని కాస్త మంచిదారిలో పెడదామని ప్రయత్నం చేస్తున్నాను. అందుకనే అంత గట్టిగా కోప్పడాను. నేను కోప్పడితే వాడు ఏమీ అనుకోలేదు. జాలిగాచూస్తూ 'నన్ను ఏంజేయమంటావు'—? అని అడిగాడు.

'నా బొంద నీకు ఎన్నిసార్లు చెప్పానురా, భార్య ఎదట కాస్త దర్జాచూపమని?' అన్నాను.

'దర్జాచూపటం అంటే ఏమిటో నాకు బొత్తిగా తెలియదు'—అన్నాడు సుందరం దీనంగా.

నాకు వాడిమీద జాలికలిగింది. చిన్నతనం! తెలియదు! నలుగురి నోళ్లల్లోపడి నవ్వుల పాలు కాకుండా, వాడికి కొన్ని చిన్న చిన్న విషయాలు చెప్పటం అవసరం అని తోచింది.

'చూడూ. ఒరేయ్ అయితే చెబుతాను విను. ఇప్పుడు ఏదైనా పని కావాలనుకో. ఆవిడకు చెప్పి చెయ్యమని, అంతే గాని నీవు స్వయంగా చెయ్యబోకు.'—అన్నాను.

ఇట్లా సూత్రప్రాయంగా, ధర్మ నిర్వచనం చేస్తే వాడికేమీ అర్థమైనట్టులేదు. ఏదో బిక్కముఖం పెట్టి అల్లాగే కూర్చున్నాడు. విపులంగా చెప్పాలన్న ఉద్దేశంతో నేను మళ్లీ ఇట్లా అన్నాను.

'మంచి నీళ్లు కావాలె అనుకో నీవే వంటఇంట్లోకి వెళ్లి చెంబు వెతుక్కొని నీళ్లు ముంచుకొని తెచ్చుకో కూడదు,............వీధి వసారాలో కూర్చుని 'ఏయ్, మంచినీళ్లు కావాలె. చప్పున తీసుకురా!' అనాలె!

'ఆవిడ తీసుకొనిరాకపోతే?' అని అడిగాడు సుందరం. ఇంత వెర్రివాడేం వీడు!

'ఎందుకు తీసుకురాదురా! తప్పకుండా తీసుకొస్తుంది. నీవు అడగడంలో ఉంది! అంతగా తీసు

కు రాకపోతే, కొంచెం కోపం నటిస్తూ, 'ఏయ్ ఏమిటదీ, నీకుగదూ, చెపటం? మంచినీళ్లు కావాలె! ఏంజేస్తున్నావ్' అని అనాలె, తెలిసిందా? అన్నాను. తెలిసిందని తల ఊపాడు సుందరం.

'బట్ట కట్టుకొని బైటికి వెళ్లాలను కొంటావు. నీవే దరిద్రంగావెళ్లి, పెట్టె తీసుకొని బట్టలు తీసుకోకూడదు. స్నానం చేసినతరువాత దర్జాగా ఠీవిగా అనాలె, 'ఏమెయ్, బట్టలుతీసి ఇయ్యి' అని

'ఆవిడ ఏదైనా పనిమీద ఉండి తొందరగా రాకపోతే, 'ఏమిటా ఆలస్యం! వెళ్లాలినేను' అని కొంచెం కేక వెయ్యాలె.' అనికూడా చెప్పాను. వాడు తెలిసినట్లు తల ఊపాడు కాని ఏదో అడగాలని అడగలేక బాధపడుతున్నట్లు నాకు తోచి 'సందేహము ఏమన్నా, ఉంటే అడగరా' అన్నాను.

వాడు ఇంకా సందేహిస్తూనే అడిగాడు "స్నానానికి నీళ్లు ఆవిడనే తోడమనాలా?' అని.

'అను. ఎందుకూ సందేహం?' అన్నాను.

భావి చాలా లోతు. ఆవిడతోడటం కష్టం. అందుకని... అన్నాడు ఏదో సిగ్గుపడుతూ.

'కొన్నాళ్లదాకా అల్లాంటి భావాలు పెట్టుకోబోకు. అంతగా అయితే పనిమనిషిచేత తోడించమను. అంతేగాని నీవుమట్టుకు తోడబోకు' అని చెప్పాను.

'సరే ఆ పనిచేయిస్తా' అని తనకున్న ఒక్క సందేహమూ తీరిపోయినట్టు సంతోషించాడు సుందరం.

సంతోషించాడు కాని ఇంకా ఆలోచిస్తూ ఉండటం చూచి నేనన్నాను, 'ఒరేయ్, భయంలేదు. ఏ విషయంలోనైనా సరే, ఏమాత్రం సందేహం ఉన్నా సరే నన్నడుగు. చూచినవాళ్లంతా ఫలానివారి స్నేహితుడు పెళ్లానికి భయపడుతున్నాడని చెప్పకోటం నాకు తలవంపులుగా ఉంది. పదిమందిలో నిన్ను మనిషిగా నిలబడదామని నాఉద్దేశం.'

ఈ మాటలు విని మావాడు చాలా సంతోషించి కృతజ్ఞత చిలుకుతున్న చూపులు చూశాడు.

అయినా వాడికి ఇంకా ఏవో సందేహాలు బాధిస్తూనే ఉన్నట్లు ఉన్నాయి. వాడి ముఖమే చెప్తున్నది ఆ విషయం. వాడికి మంచి ప్రోత్సాహము ఇయ్యాలన్న సంకల్పంతో నేనే అడిగాను, 'తమలపాకులు వేసుకొంటారా మీరూ?' అని. 'ఆ రెండు పూటలా వేసుకొంటాము' అన్నాడు. 'అయితే మీ ఆవిడే నీకు తమలపాకులు ఇస్తుందా?' అని అడిగాను.

వాడు తల అడ్డంగా తిప్పతూ చెప్పకొచ్చాడు, 'అఁహ. ఆవిడా నేనూ, ఒకసారే భోజనంచేస్తాము. ఆవిడ ఇల్లు సర్దుకు వచ్చేలోపున నేను తమలపాకులకు సున్నంరాచి, చుట్టి ఉంచుతాను. ఆవిడవచ్చిన తరువాత ఇద్దరం కలిపి వేసుకొంటాము.'

నేను వాడికి విప్పిచెప్పాను ఇల్లాగ, "అట్లాకాదురా! నేను చెప్పినట్లు చెయ్యి. భోజనం చేసివచ్చి పడకకుర్చీలో హాయిగా పడుకో, ఆవిడగారు వచ్చిందాకా. ఆవిడ వచ్చిన తరువాత తమలపాకులు చుట్టి ఇయ్యమని అడుగు. ఆమెగారే, సున్నంరాచి, ఈనెలు తీసి చిలకలు చుట్టి ఇస్తే నీవు వేసుకోవాలె. ఈ మాత్రం తెలియదురా నీకు! ఎన్నని చెప్పేది?' అని విసుక్కున్నాను.

'ఇంకెందుకూ ఇక తెలిసింది' అని చెప్పి సుందరం లేచి గబగబా నడిచి వెళ్లిపోయినాడు.

## ౨

ఆ తరువాత నాలుగు రోజులు గడిచింది. వాడు మా యింటిఛాయల రాలేదు. ఏమి జరుగుతున్నదో ఎట్లా ఉన్నాడో చూద్దామని వెళ్లాను, నేనే వాళ్ల యింటికి.

వీథితలుపు వేసిఉన్నది. లోపల ఏదో చాలా గొడవ జరుగుతున్నది. నేను ఆ వరాండాలోనే నుంచుని విన్నాను.

వాడిపెళ్లాం అంటున్నది......'మరీ ఇల్లాగ తయారైనారేం అమ్మా! కాస్త ఏదైనా సాహాయ్యం చేయండీ అంటే, ఊహూ అని మూతి బిగించుకొని కూర్చుంటున్నారు. నేను ఒక్కదాన్నీ ఎంతని సద్దుకు కోనూ ఆడపనీ, మొగపనీ కూడా! కాస్త లేవండి'—

సుందరం ఏమీ మాట్లాడటం లేదు. ఆవిడ ఎన్ని కేకలు వేసినా వీడు మాట్లాడక ఊరుకొంటున్నాడు.

ఆ అమ్మాయి మళ్లీ అంటున్నది... 'లేవండి. నా మాట వినండి. బొమ్మలన్నీతీసి బైటపెట్టాను. కాస్త గుడ్డతో తుడిచి బల్లమీద పెట్టండి. అట్లా భీష్మించుకు కూర్చుంటే ఎల్లాగ చెప్పండి. బొమ్మలన్నీ పెడితే చూచి అమ్మాయి ఎంత సంతోషిస్తుంది చెప్పండి!'

'ఇటువంటి పనులు నావల్ల కాదు'—అని నిష్కర్షగా అన్నాడు సుందరం.

'ఎటువంటి పనులు మీవలన అవుతయ్యి?' అని అడిగింది ఆ పిల్ల.

'నాపని అల్లా ఇంత సంపాదించి తెచ్చి పడెయ్యటమే. ఆ తరువాత సంసారం జరిపే బాధ్యత అంతా నీదే' అని అనేశాడు సుందరం.

'ఈ బొమ్మలు సద్దాలె! అవతల వంటపని చూచుకోవాలె! పిల్లను సద్దుకోవాలె! ఇవన్నీ నేను ఒక్కదాన్నే చేయగలనా? మీరు నాకు కాస్త సాయపడకూడదూ?' అన్నది ఆ అమ్మాయి.

'ఇన్నాళ్లనుంచీ అల్లాగ అనుకొనే నెత్తిమీదికి తెచ్చుకొన్నాను. అందరూ నన్నుజూచి నవ్వుతున్నారట!' అన్నాడు.

'అవ్వ! ఎక్కడన్నా ఉందా, ఇంత అన్యాయం! సంసారంలో మొగుడికి, పెళ్లామూ పెళ్లానికి మొగుడూ సాయంచేసుకోటం తప్పని ఎవరండీ మీకు చెప్పింది? నాదగ్గరకు తీసుకురండి, చెపుతా!'

'అవసరమైతే అల్లాగే తీసుకొస్తాను. కాని ఇప్పుడు...ఆ బొమ్మలు తుడవటం, అల్లాంటి పనులేమీ నేను చెయ్యను'—

సుందరం నా సలహాను అనుసరించాడు కాని చాలాదూరం పోయినాడు. మళ్లీ వెనక్కు త్రిప్పుకు రావటం కష్టము!

ఇంతలో సుందరం వీథితలుపు తీసుకొనివచ్చి నన్నుజూచి, చాలా ఖంగారుపడి తెప్పరిల్లి, లోపలకు రమ్మనిపిలిచాడు. 'వస్తానుగాని...ఏమిటి సంగతి ఏదో గొడవ జరుగుతున్నది?' అని అడిగాను.

'గొడవేమీలేదు గాని...మీరు లోపలికిరండి, వచ్చి మా మనిషితో కాస్త చెప్పండి' అని దీనంగా అడిగాడు.

'ఏం చెప్పేదోయ్?' అన్నాను.

సుందరం తలవంచుకొనే జబాబు ఇచ్చాడు.

'ఏంలేదూ, నాకు చెప్పినట్లుగానే ఆమెకు కూడా చెప్పండి...భర్తచేత, భార్య ఏమీపనులు చేయించకూడదని. అల్లాగచేస్తే పాపమనీ—ఇల్లాంటి విషయాలు'

'అల్లాగే చెబుతాను' అని లోపలికి వెళ్లాను. సుందరం భార్యను కేకవేసి, నేను ఎవరైంది ఆ అమ్మాయికి చెప్పాడు.

నేను వివరైంది సుందరం చెప్పగానే 'ఓహో! రండి. బాబాయిగారూ' అంటూ పిలిచింది ఆ అమ్మాయి.

కూర్చుంటానికి అక్కడేమీ లేదు. ఆ ఉన్న ఒక్కకుర్చీ, ఎందుకో స్నానాలగదిలోకి పోయింది.

'కుర్చీ ఏదండీ?' అంటూ ఆ అమ్మాయి అటూ ఇటూ తిరుగుతూఉంటే 'ఎందుకులే అమ్మా ఇక్కడ కూర్చుంటాను' అంటూ నేనే మూలనున్న చాప తీసుకొచ్చి, వేసుకొని కూర్చున్నాను. సుందరం గబగబా వెళ్లి కుర్చీ తెచ్చాడు. నేను చాపమీదే కూర్చున్నాను.

ఆ అమ్మాయి అయినా నాకేమీ కొత్త పిల్ల కాదు. ఆ అమ్మాయి తల్లి తండ్రులూ, మేమూ గుంటూరులో ఒక ఇంట్లోనే ఉండేవాళ్లం. అప్పటికి ఈ అమ్మాయి బొత్తిగా పసిపిల్ల. ఈ సంగతులు ఆ అమ్మాయికి చెప్పాను. ఆ అమ్మాయి ఎక్కువగా సంతోషించి నాతో, తండ్రితో మాట్లాడినట్లు చనువుగా మాట్లాడింది.

'చూచావా, బాబాయి. పిల్ల బొమ్మలు పెట్టుకుని ఒక్క తీరాన గోలచేస్తున్నది. బొమ్మలన్నీ తీసి బైట పెట్టాను. ఇవి కొస్త తుడిచి ఆ బల్లమీద పెట్టకూడదూ! నేను వంటపనే చూచుకొనేదా, ఈపనే చూచేదా! కొస్త సాహాయ్యం చేయమంటే, ఆయన ససేమిరా అని కుర్చీలో పడుకొని లేవటం లేదు. ఇంత అన్యాయం ఎక్కడైనా ఉందా? ఇంటి పనులు చేసుకొంటే, ఎవరో నవ్వుతారట! విన్నావా బాబాయి!' అని నావంక చూచింది జబాబు చెప్పమన్నట్లు.

'ఎందుకు నవ్వుతారమ్మా. ఎవరింటి పని వాళ్లు చేసుకొంటే తప్పేముంది!—' అని అనాలిసి వచ్చింది నేను.

ఈ మాటలు విని సంతోషించి ఆ అమ్మాయి అన్నదీ, 'కాస్త ఆ మాట ఆయనకు చెప్పు బాబాయి!'

'చెప్పేదేమిటిలే అమ్మా. వింటున్నాడుగా!' అన్నాను,

'అయితే ఇవన్నీ నేను ఒక్కదాన్ని చేస్తూ కూర్చుంటే, వంట ఎవ్వరు చేస్తారు? ఎవరైనా పెద్ద వాళ్లు ఉన్నారు గనకనా? మొగవాళ్లయితే నిమిషంలోకి చేశేస్తారు. చూడు బాబాయి ఆయన తేస్తారేమో!' అన్నది.

నాకు జాలేసింది. నే నన్నాను 'నే సాయం చేస్తాలే అమ్మా. నీవు వెళ్లి వంట పని చూచుకో'.

ఆ అమ్మాయి సంతోషంతో అన్నది 'మీరు ఈ పూట ఇక్కడే భోజనం చెయ్యాలె. నేను నిమిషంలోకి వంట పూర్తిచేస్తాను.'

వెళ్లమ్మా, నీవు వెళ్లు. ఈ పని మే మిద్దరం చూస్తాంలే' అన్నాను నేను.

ఆ అమ్మాయి స్నానానికి లెమ్మనే లోపునే మేము ఇద్దరం కలిసి, బొమ్మలన్నీ తుడిచి బల్లపైని చక్కగా పెట్టాము.

ఆ తరువాత స్నానం చేసి భోజనం చేశాము. తమల పాకులు, వక్కలు తెచ్చి అక్కడ పెట్టింది సుందరం పెళ్లాం!

'ఏమ్, నీవు వచ్చి, ఆకులకు సున్నం రాచి చిలకలు చుట్టి ఇయ్యి' అని దర్జాగా అన్నాడు సుందరం.

'చెయ్యి ఊరుకోలేదండీ. పిల్లదానికి అన్నం పెడుతున్నా' అన్నది ఆవిడ లోపలఉండే!

# సుందరం భార్య

'ఎందుకోయి ఈమాత్రంపనికి ఆ అమ్మాయిని పిలుస్తావు?' అంటూ నేను వక్కలు నోట్లో వేసుకొని ఆకులకు సున్నం రాచుకొన్నాను. సుందరం కూడా ఆ పనే చేశాడు.

ఇంతలో వాడి భార్యకూడా భోజనంచేసి పిల్లనెత్తుకొని వచ్చి మాకు ఎదురుగా నిలబడ్డది.

'భోజనం చేశావా అమ్మా?' అని అడిగాను.

'చేశాను బాబాయి. పిల్ల ఏడుస్తున్నది. దాన్ని నిద్రపుచ్చాలె' అన్నది. ఆ అమ్మాయి ఆ తరువాత నాతో అన్నది; 'ఈ నవారుమంచం చూశావా బాబాయ్, ఇది తెగిపోయింది. కుక్కి అయిపోయింది. నాలుగు రోజులనుంచీ నెత్తిని నోరుపెట్టుకొని అరుస్తున్నాను దీనిని కాస్త విప్పి అల్లండీ అని. వింటేనా? పనిది చంక దిగదు. దానికోసం ఓదాసీ దాన్ని పెడితే, సంసారం గడుస్తుందా? ఏమంటావ్ బాబాయి, మన పని మనం చేసుకోవాలె అవునా?'

'అవును, అవును' అని నేను తల ఊపాను.

'ఇది ఏమంత కష్టమైనపని! అయిదు నిమిషాలలో అయిపోతుంది!'

ఇల్లా అంటూ ఆ అమ్మాయి మంచాన్ని విప్పింది.

'రండి, మీ ఇద్దరూ కూర్చుంటే నిమిషంలో అయిపోత్తుంది' అని భర్తవంక చూచింది. నేను ముందు వెళ్లి అక్కడ కూర్చుని సుందరాన్ని రమ్మన్నాను. తెగిపోయిన నేవారంతా కుట్టి, సాయంత్రం నాలుగు గంటలకల్లా మంచం అల్లేశాము. ఆ అమ్మాయి వచ్చి చూచి సంతోషించి, 'చూడు బాబాయి ఎంతలోకి అయిపోయిందో' అని నాతో అని, 'అవతల వాళ్లను చూచిఅయినా నేర్చుకోవాలె' అని భర్తతో అన్నది, దీర్ఘాలు తీస్తూ. మేము ఇద్దరం నవ్వి ఊరుకొన్నాము.

ఆ తరువాత మాకు కాఫీ ఇచ్చింది ఆ అమ్మాయి— ఇద్దరం పుచ్చుకొన్నాము.

నేను లేచి 'ఇక వస్తానమ్మా' అన్నాను.

'ఇల్లంతా చూశావా బాబాయి - ఇది, పడకగది. ఇది హాలు. వంట ఇల్లు చూశావుగా! ఇది స్నానాల గది' అంటూ అన్నీ చూపించింది.

'బాగుందమ్మా. అంతా సౌఖ్యంగా ఉంది' అన్నాను నేను.

'అన్నీ బాగానే ఉన్నయి కాని ఈ రోలు వంటఇంట్లో ఉంటే ఎంతో బాగుంటేది. ఇక్కడ వేశారు! వర్షం వస్తుందనుకోండి, అప్పుడు నాకెంత కష్టం! వర్షంలో తడుస్తూ పచ్చడి నూరుకోవాలె. ఏమంటావు బాబాయి? నేను అన్న మాట నిజం అంటావా కాదా?' అని అడిగింది.

'నిజమేనమ్మా' అన్నాను నేను.

'నిన్నటినుంచి గోలపెడుతున్నా ఆయన చెవికెక్కించుకోటంలేదు బాబాయి. కాస్త లోపల వేసిపెట్టరూ?' అని నవ్వుతూ అడిగింది. నేను కాదనలేక పోయినాను.

నేను ఒకణ్ణే ఆరోలు ఎత్తి ఎట్లాగో అవస్థపడి వంట ఇంట్లోకి చేర్చాను. సుందరం నవ్వుతూ నుంచున్నాడు.

నేను వెళ్లటానికి సిద్ధమైనాను. చెప్పులు తొడుక్కొని కర్ర తీసుకొని గడపదాటుతూ ఉంటే ఆ అమ్మాయి అన్నది 'ఎప్పుడన్నా వస్తూ ఉండు బాబాయి. ఈయన సంగతి ఏమీ బాగాలేదు. పూర్వం అన్ని విషయాలలోనూ ఎంచక్కా సాయం చేస్తుంటేవారు. నాలుగు రోజులనుంచీ భీష్మించుకు కూర్చుంటున్నారు. ఏమన్నా కాస్త సాహాయ్యం చేయమంటే చేయనని! ఎల్లా గడుస్తుంది ఒంటరి సం-


సారంలో! నిజమా అబద్ధమా బాబాయి?' అని అడిగింది.

'నిజమేనమ్మా. సంసారంలో ఒకరికొకరు సాయం చేసుకోపోతే ఎట్లాగూ?' అన్నాను.
ఆ అమ్మాయి నాకు దగ్గరకు వచ్చి 'ఈ సంగతి విన్నావా బాబాయి! ఇంట్లో పనులు చేసుకుంటేనట ఎవ్వరో నవ్విపోతున్నారట!' అన్నది.

'ఏడిశారులే! ఎవరమ్మా నవ్వేది?' అన్నాను నేను.

'చెప్పు బాబాయి ఆయనతో కాస్త చెప్పు' అన్నది.

'చెపుతానమ్మా, నేను తప్పకుండా చెబుతాను' అని రోడ్డుమీదికి వచ్చేశాను. సుందరంకూడా బట్టలు వేసుకొని నాతో రావటానికి బయలుదేరాడు. వాడి భార్య వీధివాకిట్లో పిల్లను ఎత్తుకొని నుంచుని భర్తను ఉద్దేశించి, 'ఏమండోయ్ మీరు బాబాయితో కలిసి షికారు వెడితేకాదు. ఇట్లా రైలు స్టేషను వైపునకు వెళ్లి ఒక బండి కేకేసుకు రండి. నేను నాయుడుగారి భార్యను కలుపుకొని సినిమాకు వెడదామనుకొంటున్నాను' అన్నది. సుందరం నావంక చూశాడు నవ్వుతూ. నేను, 'వెళ్లవోయ్, వెళ్లు. నేను ఇట్లా వెడతాను' అని చెప్పి ఇంటిదారి పట్టాను. ఆ అమ్మాయి, నా మాటలూ, విన్నది. మొగుడు గిరుక్కున రైలుస్టేషను రోడ్డుకు తిరగటమూ చూచింది. ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలికి వెళ్లిపోయింది.



# అల్లరి

సాక్షి

ఆవేళ కాలేజీకి వచ్చి క్లాసులో కూర్చున్నది మొదలు అదేపనిగా వర్షం కురవడం మొదలుపెట్టింది. వర్షం కుండపోతగా కురవడమూ లేదు — వెలిసిపోవడమూ లేదు. చూరులోనించి నిరంతరంగా పడుతూన్న వర్షధారలు చెవులల్లో విచిత్రమైన సంగీతంలా వినిపిస్తున్నాయి. క్లాసులో ఉన్న కుర్రాళ్లంతా చాలామంది హిస్టరీ లెక్చరరు చెప్పే ఉపన్యాసం వినడం మానేసి పరధ్యానంగా ఆ వర్షం కేసిచూస్తూ కూర్చున్నారు. పైకప్పులో ఒకచోట బంగాళా పెంకుల్లోంచి జారిన వర్షబిందువులు మెల్లి మెల్లిగా 'టపటపా' మని చప్పుడు చేస్తూ లెక్చరరు కుర్చీకి దగ్గరగా పడుతున్నాయి.

ఇంక లెక్చరరుకూడా ఇది సమయంకాదని ఉపన్యాసం చెప్పడం చాలించి, ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. క్రమక్రమంగా నల్ల నల్లని మబ్బులూ, చీకటీ కమ్ముకుంటున్నాయి. ధోరణిచూస్తే మళ్లీ వర్షం ఎక్కువయ్యేటట్లుంది. అప్పుడప్పుడు చలిగాలీ, జల్లులూ విసిరి విసిరి కొడుతున్నాయి. కుర్రాళ్లంతా గట్టిగా చొక్కా బొత్తాములు పెట్టుకుని, ఒకళ్లొకళ్లకి దగ్గర దగ్గరగా జేరుకుంటున్నారు. లీల, [illegible] పక్కనికూర్చున్న ఆడపిల్లలూ ఏవో కబుర్లలో పడ్డారు. ఆమె అప్పుడప్పుడు వర్షంలో తడుస్తూ సంతోషంగా తలలూగిస్తున్న పసిరిపచ్చిక గుబురులకేసీ, ఆ గుబురుల్లో వర్షపు చినుకులకి చెంగుచెంగున గంతులువేస్తున్న ఆకుపచ్చని గొల్లభామలకేసీ, చూస్తూంది. ఇంతలో వెంకటేశ్వర్లు బెంచీమీద నించి లేచి, తనకేసిచూస్తూ గది గుమ్మందాటి వెళ్లి, చూరుదగ్గరగా నిలబడి ఆ వర్షం కేసిచూస్తున్నాడు. అతని వెనకాల అతని స్నేహితులు నలుగురైదుగురు, ఒకళ్లొకళ్లే అతని దగ్గిరికి జేరుతున్నారు. లెక్చరరు పుస్తకం చదువుతూ చదువుతూ కునికిపాట్లుపడుతున్నాడు.

వెంకటేశ్వర్లు అప్పుడప్పుడు ఆమె కేసి చూస్తూ, చిరునవ్వులు నవ్వుతూ స్నేహితులతో మాట్లాడుతున్నాడు. ఇంతలో రివ్వుమని మళ్లీ చలిగాలి వేసింది. అల్లాగ ఆ వర్షం కేసి చూస్తూంటే ఆమెకు చిన్నతనంలో హైస్కూలు లో జరిగిన సంగతులన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఒక్క జ్ఞాపకం రావడమేమిటి? ఆ విషయాలన్నీ కళ్ళకి కట్టినట్లు మళ్లీ ఎదురుగుండా నడిచాయి!


అది చాలాకాలం కిందట! అప్పుడు లీలకి బాగా చిన్నతనం. పట్టుమని పదేళ్లయినా నిండాయో లేదో! అప్పుడు వెంకటేశ్వర్రావూ తనూ ఫస్టుఫారం చదువుతున్నారు. అతనికప్పటికి పన్నెండేళ్లో పదమూడేళ్లో ఉంటాయి, అంతే! అప్పుడతను ఎంత అల్లరి చేసేవాడని! ఒకనాడు మధ్యాహ్నం రెండో పీరియడు అయ్యాక మాష్టరుగారు పిల్లలనందరినీ మంచినీళ్లకి విడిచిపెట్టారు. వెళ్లడం పూర్ణా, తనూ కలిసే వెళ్లారు. కాని పూర్ణ మంచినీళ్లు గబగబా రెండు గుక్కల్లో తాగేసి, తనకంటె ముందే క్లాసులోకి వెళ్లిపోయింది! 'నేనూ వస్తున్నాను! ఆగవే!' అంటే ఆగలేదు. ఆ తరవాత తనుకూడా మంచినీళ్లు తాగి క్లాసులోకి వెళ్లింది. అప్పటికింకా మూడో పీరియడు మేష్టారు క్లాసులోకి రాలేదు. 'అమ్మయ్య!' అనుకుని తనచోట్లో కూర్చుంది.

ఇంతలో పూర్ణ మెల్లిగా తన చెవిదగ్గిరికి వచ్చి, "ఏమేవ్! వెంకటేశ్వర్లు నీ పుస్తకం తీసి అందులో ఏదో కాయితం మడిచిపెట్టాడే! నేను తలుపుచాటు



అమాయిక జీవులు

శ్రీ మాధవ మెనన్.



గిండీపార్కు దృశ్యము

శ్రీ మాధవ మెనన్.



డేగ

శ్రీ మాధవ మెనన్,

పెంచి చూస్తూనే ఉన్నారే!" అంతే! తను కంగారు పడుతూ పుస్తకాలన్నీ గజిబిజిగా వెతికి ఆ కాగితం మడత పట్టుకుని, అది విప్పి చదవడం మొదలు పెట్టింది. మొట్టమొదట తనకి అది ఏమీ బోధపడలేదు. రాతంతా గజిబిజిగా ఉంది. అందులో నీకో మాట చెబుతాను నీ సాయంత్రం ఒకసారి ఆడుకోడానికి రమ్మనమనీ వ్రాశాడు. ఆపైన ఒకటి రెండు వాక్యాలు ఏవో కంగారుగా రాశాడు. ఎంత చదివినా అదేమిటో బాగా తెలిసిందికాదు. అది ముగించేసరికి తనకి కళ్లు తిరుగుతున్నట్లయింది. మిగిలిన ఆడపిల్లలంతా తన వెనకాలకి వచ్చి, అది గబగబా చదివేసి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ తమ తమ చోట్లలోకి వెళ్లి కూర్చున్నారు. మళ్లీ తనకి వళ్లుమాలిన సిగ్గువేసింది. కొంతసేపటిదాకా ఏమి చెయ్యడానికీ తోచిందికాదు. తను ఒక్కర్తే ఆ ఉత్తరం చూసి ఉంటే మాట్లాడక ఊరుకుని ఉండునేమో! ఇంతలోనే పూర్ణ మళ్లీ చెవిదగ్గరికిజేరి "అదుగో మేష్టారు వస్తున్నారు. ఆయనతో చెప్పు!" అంది. ఇంతలో మేష్టారు వచ్చి ఆడపిల్లలందరూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూండడం చూసి "ఏమిట్రా! అది?" అన్నాడు. ఇంక తప్పిందికాదు. ఆమె మెల్లిగా తీసుకువెళ్లి ఆ ఉత్తరం ఆయన చేతుల్లో పెట్టింది. ఆయన ఆ ఉత్తరం అంతా ఒక్క గుక్కలో చదివేశాడు. ఆపైన ఒక్కసారి క్లాసంతా తేరి పారచూసి, "హరి వెధవల్లారా!" అన్నాడు. మళ్లీ రెండు నిమిషాలూరుకుని "ఇది ఎవరు రాశారో చెప్పండి! నిజం చెబితే ఏమీ చెయ్యను!" అన్నాడు. క్లాసుక్లాసంతా కుక్కిన పేనుల్లాగ మాట్లాడకూరుకున్నారు. ఎవ్వరూ మాట్లాడలేదు! మళ్లీ అమాటే రెట్టించాడు. ఊహుం ఎవళ్లూ పలకలేదు. "ఏం! చెబుతారా! లేకపోతే క్లాసుక్లాసంతా బెంచీ ఎక్కించనా!" అన్నాడు. అప్పటికీ ఎవరూ మాట్లాడలేదు! చివరికి మేష్టారు తనకేసి తిరిగి "లీలా! నీకు ఇది ఎవరు రాశారని అనుమానంగా ఉంది?" అన్నాడు. లీల తల వంచుకుని సిగ్గుపడుతూ "ఏమోనండి! నాకు తెలియదు! పుస్తకం తీస్తే అందులో ఉందండి!" అంది.

"ఇంతలో పూర్ణ చటుక్కుని లేచి నిలబడి మేష్టాండి! మరేమోనండి! వెంకటేశ్వర్లేమోనండి! ఆ ఉత్తరం లీల పుస్తకంలో పెట్టి వెళ్లాడండి!" అని చెప్పి పట్టలేనిసిగ్గుతో చటుక్కుని కూలబడి పోయింది!

"నువ్వు చూశావా!"

"చూశానండి! మంచినీళ్లకి వెళ్లి మళ్లీ క్లాసులోకి వచ్చేటప్పటికి గబగబా పుస్తకంలో ఉత్తరం పెడుతున్నాడండి!" అంది.

"ఏమిరా! వెంకటేశ్వర్లు! నువ్వేనా ఈ పని చేసింది." వెంకటేశ్వర్లుకి ఇంతకి పూర్వమే ప్రాణాలెగిరిపోయాయి. అయినా మొండికత్తి "లేదండి! నేను కాదండి!" అన్నాడు.

"నిజం చెప్పు!"

"నిజమేనండి!"

"ఇప్పుడైనా నిజం చెబితే నీ మర్యాద దక్కుతుంది! లేకపోతే ఇది హెడ్మాస్టరు గారి దాకా వెడుతుంది! జాగ్రత్త! బాగా ఆలోచించుకో! ఈ దస్తూరీ నీదే!"

"నాది కాదండి!"

"ఏదీ నీ తెలుగు కాంపోజిషను పుస్తకం ఇల్లాతే!"

"ఎందుకండి!"

"ఇల్లాగ పట్రావోయ్! ఆట్టే కబుర్లు చెప్పక!"

వెంకటేశ్వర్లు మాట్లాడకుండా పిల్లిలాగ ఆ పుస్తకం తీసుకు వెళ్లి ఆయన చేతుల్లో పెట్టాడు. మేష్టరు ఆ పుస్తకంలో పేజీలకేసీ, ఆ ఉత్తరం కేసీ బాగా పరీక్షించి చూడడం మొదలు పెట్టాడు. మొదట చాలామందికి అది ఎందుకో తెలిసిందికాదు. కొంత సేపటికి ఆయన ముఖం జేవురించింది. వెంటనే వెంకటేశ్వర్లుకేసి చూసి నాదగ్గిర వేషాలు వేస్తావూ! వేషాలూ నువ్వూను! లే! బెంచీ ఎక్కు!" అన్నాడు.

వెంకటేశ్వర్లు నేనుకాదండీ! మేష్టారూ!" అంటూనే బెంచీ ఎక్కాడు. అతనికి అందరిలోనూ అల్లాగ నిలబడవలిసి వచ్చినందుకు ఎంతో చిన్నతనం వేసింది. కొంతసేపల్లాగ వెర్రివాడిలాగ నిలబడి, అక్కడి నించి వెక్కి వెక్కి ఏడుస్తూ కుమలడం మొదలు పెట్టాడు. అతని ముఖం అంతా ఎర్రగా కంద గడ్డలాగ మారి పోయింది.

పాపం! లీలకి అతని ముఖం చూస్తే ఎంతో జాలి వేసింది. ఆ తరవాత ఆ సంగతి ఆ విధంగా ఆ ఖరయి పోతే బాగానే ఉండును! పక్కనున్న పూర్ణ తారాజువ్వలాగ లేచి తగుదునమ్మా అని మేష్టారిని పిలిచి, "మేష్టాండి వెంకటేశ్వర్రావేమోనండి! పాఠంకేసి చూడడం మానేసి అస్తమానమూ లీలకేసి చూస్తూ కూచుంటాడండి!" అని చెప్పి, పట్టరాని సిగ్గుతో తటాలున తలవంచుకుని కూర్చుంది.

మేష్టారు "ఏం! లీలా! నిజమేనా!" అని అడిగాడు. ఆ ప్రశ్నతో క్లాసులో పిల్లలంతా పకపక నవ్వడం మొదలు పెట్టారు. మేష్టారు వాళ్లకేసి గట్టిగా కళ్లెర్రజేసి చూశాడు. ఇంకా కొంతమంది నవ్వులు మానలేదు. ఆయన "ఏం! ఇంకా నోళ్లు మెదులుతున్నాయి!" అన్నారు. దాంతో క్లాసులో చాలా వరకు సద్దణిగింది.

లీల మేష్టారి ప్రశ్న మీద మొట్టమొదట "అబ్బే! ఉత్తవండి! నాకేసి చూడడంలేదండి!" అని చెప్పాలనుకుంది. కాని చివరకి ఎందు చేతనో కొంత భయపడి "అవునండి! చూస్తూ ఉంటాడండి!" అంది.

"అల్లాగ చూస్తూన్నట్లు నీ కెల్లాగ తెలిసింది!" తనకి ఆ ప్రశ్నతో గొంతుకలో వెలక్కాయ చిక్కడ్డట్లయింది. కాస్సేపటి దాకా ఏమీ తోచక నీళ్లు నములుతూ ఊరుకుంది. చివరికి "అస్తమానమూ నాకేసే చూస్తూ ఉంటాడండి!" అంది. మళ్లీ క్లాసులో ఉన్న కొంటి పిల్లలంతా పకపకా నవ్వడం మొదలు పెట్టారు. తనకి ఎంతో సిగ్గు వేసింది.

మేష్టారు పిల్లలమీద నిప్పులుకురిపిస్తూ "చాల్లెండి! వెధవ నవ్వులూ మీరూను! వేలెడంత ఉన్నారో లేదోగాని అప్పుడే రౌడీతనాలు మొదలు పెట్టారు. ఎవళ్లయినా పాఠం జరుగుతూంటే తలెత్తి చూడండి! వీపు పెట్లగొట్టేస్తాను!" అన్నారు.

దాంతో క్లాసు క్లాసంతా కుక్కిన పేలల్లాగ మాట్లాడక కూర్చుని తలెత్తకుండా పుస్తకాలకేసి చూడడం మొదలు పెట్టారు. అంతలోనే వరాండాలో బూట్ల చప్పుడు వినబడింది. అది 'టకటకా' మని క్రమ క్రమంగా దగ్గిరికి వచ్చింది. హెడ్మాష్టరు గారు చటుక్కుని గుమ్మందగ్గిర ఆగి "ఏమిటండీ మేష్టారు!" అన్నారు. క్లాసుమేష్టారు కంగారు పడుతూ లేచి క్లాసులోంచి ఆయన దగ్గిరికి వెళ్లి "ఏముందండి, కుర్ర వెధవలు! ఈ మధ్యన ఈ పత్రికల్లో కథలూ అవీ చదివి బొత్తిగా పాడైపోతున్నారు. అందులోనూ ఈ సినీమాలు చూడ్డం వచ్చాక వీళ్లకి బొత్తిగా పట్టపగ్గాలు లేకుండాపోతున్నాయి! ఇదిగో! చూశారా? మన వెంకటేశ్వర్లు

ప్రయోజకత్వం!" అని చెప్పి అతన్ని చూపించి, ఆ ఉత్తరం ఆయనచేతులో పెట్టారు.

హెడ్మాస్టరుగారు అది చదివి వెంకటేశ్వర్లుకేసి చురచురాచూసి "రేపంతా బెంచీమీద నిలబెట్టండి! దాంతో రోగం కుదిరిపోతుంది!" అన్నారు. ఆపైన వారిద్దరు ఒక నిమిషం ఏవేవో మాట్లాడుకుని విరగబడి నవ్వుకున్నారు.

వెంకటేశ్వర్లు అంతకిపూర్వమే నాలుగైదు నెలల కింకట లీలకి "ముద్వంకాయ" అని పేరుపెట్టి పిల్లలందరిలోను ప్రచారం చేశాడు. ఇంక ఆనాడు అది జనిగినప్పటినించీ అతని అల్లరికి హద్దూపద్దూ లేకుండా పోయింది. కాని ఆ అల్లరి ఎవరు చేశారో పట్టుకోవడం బ్రహ్మతరమయ్యేదికాదు. ఎక్కడ చూచినా 'ముద్వంకాయ' అనే పేరే! లీలకి ఆరోజుల్లో ఎంతో ఉడుకుమోతుతనంగా ఉండేది. క్రమంగా తనకి పెట్టిన పేరు అక్షరాలు పెద్దపెద్ద బెంచీలమీదకీ కాలేజీ గోడలమీదకీ పాకాయి! తను ఎప్పుడైనా హైస్కూలుకి నడిచివెళ్ళడం అంటే భయంగా ఉండేది. అతనంటే తనకి ఆరోజుల్లో చాలా ఉడుకుమోతుతనంగా ఉండేది. అతను అప్పుడు ఎంత అల్లరి చేశాడని!

ఆ రోజులన్నీ వెళ్ళిపోయాయి. క్రమంగా తన పేరందరూ మరిచిపోయారు. అప్పుడే అది జరిగి అయిదారేళ్ళయింది. తమరిద్దరూ ఒకే సంవత్సరం స్కూలు ఫైనలు పాసయి కాలేజీకి వచ్చారు. ఒకే సెక్షనులో పడ్డారు. అతనికి తను పూర్వం చేసిన అల్లరి పనులన్నీ జ్ఞాపకం ఉన్నాయోగావును! తనకి మాత్రం అతనికేసి చూడడానికి కూడా జంకుగా ఉంది! అతను ఇట్టే చూస్తూండగా కాలేజీలోకి వచ్చాడు!

ఆమె అల్లాగే ఏవేవో తన పూర్వకాలం అనుభవాలన్నీ జ్ఞాపకం చేసుకుంటూ కూర్చుంది.

ఇంతలో ఒక డవాలీబంట్రోతు ఒక కాగితం తీసుకువచ్చి లెక్చరరు చేతి కిచ్చాడు. ఆయన కళ్ళు నలుముకుంటూ కునికిపాటుల్లోంచి మేలుకుని ఆ కాగితం చేత్తోపట్టుగుని అందరికీ వినబడేటట్లు గట్టిగా చదివాడు.

అది ఆవేళ జరగవలసిన డిబేటు నోటీసు. అది వినేసరికి అంతవరకూ నిశ్శబ్దంగా కూర్చున్న విద్యార్థులలో చిన్న చిన్నదగ్గులూ నవ్వులూ ప్రారంభించాయి. క్రమంగా విద్యార్థులంతా జట్టులు జట్టులుగా కామనుహాల్లోకి జేరుకున్నారు. ఇంటరుమీడియేటులో ఉన్న విద్యార్థుల్లో అన్ని సెక్షనువారూ అక్కడికి జేరుకున్నారు. హాలుహాలంతా కిటకిటలాడిపోతోంది.

ఇంకా బాగా సాయంత్రంకాలేదు. క్రమక్రమంగా వర్షం వెలిసిపోతూంది. చూరుల్లోనించి ఒక్కొక్క చుక్క నేలమీద పడుతోంది. ఎదురుగుండా మర్రిఆకుల్లో, వర్షానికి తలదాచుకున్న కాకులు 'కావుకా' వని అరుస్తున్నాయి, ఉడత ఒకటి మెల్లి మెల్లిగా రెమ్మలమీదినించి నడుస్తూ, మధ్య మధ్యని వెనక కాళ్ళమీదకూర్చుని ఏదో తింటోంది. ఇంకా నల్లనల్లని మబ్బులు ఆకాశమంతా అలుముకునే ఉన్నాయిగాని, ఒక్కొక్కప్పుడు మబ్బుతెర తొలిగి, ఎండ తెరలుతెరలుగా పసిరిపచ్చికమీద పడుతోంది.

కొంచెం సాయంత్రం అయింది. డిబేటు ప్రారంభం అయింది. విద్యుద్దీపాలు తళుక్కుని వెలిగాయి. ఆ దీపాల వెలుతురులో వక్తలముఖాలు మెరిసిపోతున్నాయి! ఆవేళ హిస్టరీ లెక్చరే అధ్యక్షుడుగా

కూర్చున్నాడు. కొంత లెక్చరరుబలవంతాన్ని విద్యార్థినులుకూడా వాగ్వాదంలో పాల్గోడానికి అంగీకరించారు. చివరికిలీలకికూడా మాట్లాడేవంతు వచ్చింది.

ఆమె మొదట మెల్లిగా మాట్లాడడం ప్రారంభించి క్రమంగా గబగబా మాట్లాడుతోంది. హాలు హాలంతా శ్రద్ధగానే వింటున్నారు. ఎలక్ట్రిక్ దీపాలచుట్టూ ఏవో పురుగులు గిరగిరా తిరుగుతున్నాయి. గోడలమీద బల్లులుకూడా కదలకుండా ఉండిపోయాయి.

మొత్తంమీద లీలబాగానే మాట్లాడుతూంది. చాలావరకు విద్యార్థులంతా నిశ్శబ్దంగానే విన్నారు. ఆమె మాట్లాడడం పూర్తికావచ్చింది. ఇంతలో హాలులో ఎవరో గట్టిగా దగ్గారు. ఆపైన ఇద్దరు, ముగ్గురు, నలుగురు, అయిదుగురు, క్రమంగా హాలంతా దగ్గులే! అధ్యక్షుడు బల్లమీద గట్టిగా కొడుతూ విద్యార్థులకేసి చూసి "ఇస్స్" అన్నాడు. దాంతో చాలావరకు దగ్గులు తగ్గాయి.

మళ్లీ ఒకదగ్గు వినబడింది. అందరి ముఖాలూ ఆ దగ్గుకేసి తిరిగాయి. అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కేసిచూసి గట్టిగా ఆంగ్లంలో "పాపం నీకు చాలా దగ్గువస్తూన్నట్టుందే!" అన్నాడు. వెంకటేశ్వర్లు అతివినయంగా లేచినిలబడి మళ్లీ ఆంగ్లంలోనే "అవునండీ!" అన్నాడు. దాంతో హాలుహాలంతా గొల్లుమన్నారు! అధ్యక్షుడు మళ్లీ అధికార హుంకారంతో హాలంతా నిశ్శబ్దంగా ఉంచి లీలకేసి తిరిగి త్వరగా ముగించాలన్నాడు.

లీల ఆ తరవాత చాలా ఉద్రేకంగా మాట్లాడింది. ఇంక హాల్లో అల్లరిచేద్దా మనుకున్నవాళ్లు కూడా ఆ ఉపన్యాసప్రవాహంలో కొట్టుకుపోయారు! ఆమె ముగించేసరికి హాలంతా కరతాళ ధ్వనులతో మారుమోగిపోయింది. ఆమె సగర్వంగా వెళ్లి మళ్లీ తనస్థానంలో కూర్చుంది. స్నేహితురాళ్లంతా ఆమె మాట్లాడినదానికి ఎంతో అభినందించారు.

తనూ బాగానే మాట్లాడాననుకుంది. అయినా ఆమె మనస్సుకి ఎంచేతనో సంతృప్తి కలగలేదు. తన ఉపన్యాసాని కంతటికీ ఏదో ఒక పెద్ద లోటున్నట్లనిపించింది. ఏమిటాలోటు? అంతమంది మెచ్చుకున్న తన ఉపన్యాసంలో వెంకటేశ్వర్లు అల్లాగ అల్లరిచెయ్యడ మెందుకు? పోనీ ఒకసారి కులాసాకి ఏదో అల్లరిచేశా డనుకుందాము. అస్తమానమూ అదే పనిగా అల్లరిచెయ్యడమేనా? ఆమె ఉపన్యాసం ముగించి బండిలో ఇంటికివెడుతూంటే "ఒరేయ్! బజారులో మువ్వంకాయలు ఎల్లాగ ఇస్తున్నార్రా!" అనే ప్రశ్నా, దానికి సమాధానంగా కొన్ని వేళాకోళపు నవ్వులూ వినిపించాయి.

ఆ నవ్వుల్లో లీలకి వెంకటేశ్వర్లుకంఠస్వరం ఉన్నట్టు వినిపించింది. ఆమె అల్లాగే ఏవో ఆలోచిస్తూ ఇంటికి వెళ్లిపోయింది. ఆమెకి ఆరాత్రి తిన్నగా నిద్రపట్టనేలేదు! చాలా సేపటిదాకా వెంకటేశ్వర్లావిధంగా తను మాట్లాడేటప్పుడు అల్లరి చెయ్యడాన్ని గురించే ఆలోచించింది. పూర్వం కాలేజీకి వచ్చాక తనకి అప్పుడప్పుడు ఒకటిరెండుసారులూ "మువ్వంకాయ" అనే మాటలు వినిపించాయి. అప్పుడా మాటలకి ఆమె అంతగా పట్టించుకోలేదు! అయితే ఇప్పుడు ఆ మాటంటే వెంకటేశ్వర్లు పదిమందిలోను కలిసి నవ్వడం, ఆమెకు తేలుకుట్టినట్లు బాధపెట్టింది!

అల్లాగ దాన్నిగురించి అనుకుంటూ ఉండగానే ఒకవారం పదిరోజులు గడిచిపోయాయి. ఆమె ఆవేళ గదిలో కూర్చుని చదువుకుంటూంది. పొద్దున్న నీరెండ ఎదురుగా ఉన్న మందారం మీద పడింది. అది గాలిలో కదులుతూ ఆ నీరెండలో ఆడుకుంటూన్నట్టుంది. ఆమె చూస్తూండగా ఒక చిన్నపిట్ట మందారం రెమ్మమీద వాలింది. అది ఒక చిన్న నిమ్మపండంత ఉంది. తన చిన్నిముక్కుతో మందార పువ్వులో పొడిచి తేనె తాగుతూంది. ఆ పిట్టకేసి చూస్తూ ఆమె మధ్యాహ్నం పాఠం గొడవే మరిచిపోయింది.

ఇంతలో తనుకూర్చున్న గదితలుపు కొంచెం తెరుచుగుంది. టపా బంట్రోతు ఒక కవరు మెల్లిగా బల్లమీద ఉంచి వెళ్లిపోయాడు! ఆ ఉత్తరంపై దస్తూరీ చూస్తే ఆమెకి ఎంతో ఆశ్చర్యంవేసింది! అది తన స్నేహితురాళ్లెవరి దస్తూరీకాదు! కొంత లోలోపల కంగారుపడుతూ కవరువిప్పి ఉత్తరంతీసి చదివింది! ఆమెకాఉత్తరం చదువుతూంటే చేతులు వణికాయి. కాని అది ముగించడంతోటే చాలా ఆశ్చర్యంవేసింది. ఆమె ఇది ఇల్లాగ జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. పాపం! అతను తనని క్షమించవలసిందని వ్రాశాడు! అందులో అతను ఆప్యాయంగా వ్రాసిన ఆ అక్షరాలు చూస్తూంటే ఆమెకు కళ్లుచెమ్మగిల్లాయి! ఇంతలో చటుక్కుని కనురెప్పపాటులో తెరిచిఉన్న గదితలుపు బిగించి కూర్చుని ఆ మిగిలిన ఉత్తరం అంతా గబగబా చదివేసింది! ఆపైని మళ్లీమళ్లీ చదివింది! అలా చదువుతూన్నంతసేపూ ఆమెలో గర్వము, ఆనందము, సంతృప్తి ఒకదాన్ని ఒకటి తోసుకుంటూ పైకి ఉవ్వెత్తుగా పొంగాయి. క్రమంగా ఆమె రెండు కళ్లమ్మట రెండు కన్నీటి బిందువులు జారాయి! ఆమె అతి జాగ్రత్తగా ఆ ఉత్తరం మడిచి హృదయందగ్గిర దాచుకుని మెల్లిగా కళ్లుమూసుకుంది! అది అతిప్రాణప్రదంగా దాచుగోవాలి! ఎక్కడో పెట్టెలో పెట్టి బీగంవేస్తే ఎలాగ! అది వెంకటేశ్వర్లు తను చేసిన అల్లరి క్షమించమని అర్థిస్తూ ఎంతో ఆప్యాయంగా రాసిన ప్రేమలేఖ!



# విషకన్య

## శ్రీ గణపతి శాస్త్రి

### పాత్రలు

౧. చాణక్యుడు, ౨. రాక్షసుడు, 3. పర్వతేశ్వరుడు, ౪. మదిర=విషకన్య, ౫. వకుళ, ఆమె సఖి, ౬. చంద్రగుప్తుడు.

### విషకన్య బృందగానము

ఇది విషకన్యా చరితము
మృదులామృత ఘోర విషసమేతము, కరుణా
స్పద హృదయులార! దీనిం
బదిలముగా నవధరింపఁ బ్రార్థింతు మిదే!
చణక ప్రసూతి మదిరా
గణికా మణికిం గ్రమమ్ముగా, కణవిషభో
జనమిడి పెంచెం, దన
మనమున నొక కౌటిల్య తంత్రపూర్తి నిరీక్షన్
మదిరా పర్వతరాజ స
హృదయా కర్షకము ప్రేమ మొక వంకం, భీ
తిదమగు మంత్రి కుతంత్ర
మ్మదియమ్మొకవంకఁ బెనగ నది కథయయ్యెన్.

౧

### వకుళ – మదిర ప్రవేశం.

[ పాటలీపుత్ర నగరానికి అనతి దూరంలో ఉన్న విశాలోద్యాన వనము. ఆ ఉద్యానవనాన్ని ఒరుసుకుని ప్రవహించే భాగీరథీ తరంగాల గంభీర ఘోష. ఆ ఘోషా శ్రుతిలో అప్పుడప్పుడు మధురంగా వినిపించే కోకిలకుహూ ధ్వని].

౧

### ఆంధ్రశిల్పి

వకుళ : మదిరా! ఈ చైత్ర పూర్ణిమతో నీకు వింశతి వర్షాలూ నిండాయి. ఈ జన్మదిన మహోత్సవంకోసమని ప్రతిదినమూ ఈ వకుళ పుష్పాలు సేకరించి ఈ కంఠమాలిక నిర్మించాను గదా! నే నింత ఆప్యాయంగా రచించిన ఈ వకుళమాలిక తిరస్కరించడం నీకు న్యాయమేనా?...ఏమి మాట్లాడవు కి మదిరా!

మదిర : ఆ విషయం నన్ను ప్రశ్నించకు వకుళా!

వకుళ : పూలమాలిక అర్పించడానికూడా నేను తగనా!

మదిర; వకుళా! నాకీ వకుళ మాలిక వద్దు. అదుగో ఆ మందారాలతో పూలమాలికలల్లి తీసికొనిరా! నేను సంతోషంగా స్వీకరిస్తాను.

వకుళ : అయితే ఈ వకుళమాలిక చేసిన పాపమేమో!

మదిర : నేనీ ప్రశ్నకి ప్రత్యుత్తరం చెప్పదలచుకోలేదు.

వకుళ : మదిరా! నేను నీకంత చిన్న విషయం చెప్పడానికి కూడా తగనిదాన్నైనప్పుడు...... ఈ మాలిక అర్పించడం కూడా అనుచితమే! పోనీ! మదిరా! ఈ వకుళ మాలిక ఆ భాగీరథిలోకి విసిరి వేస్తానులే! [గద్గదిక]

మదిర : వకుళా-!

వకుళ : ఏమి మదిరా!

మదిర : ఒక్క క్షణం ఆగు! నేను చెప్పబోయే కారణం కొంచెం విను!-[మెల్లిగా] చూడు ఈ పరిసరాల్లో ఎవరూ లేరుగద!

వకుళ : ఏమి అంత భయమెందుకు? ఎవ్వరూ లేరు.

మదిర : వకుళా! ఇది అత్యంత రహస్యమైన విషయంసుమా! ఇది సరిగా నాలుగు సంవత్సరాలకి పూర్వం జరిగిన గాథ! అప్పుడు సరిగా ఇదే వసంత ప్రాదుర్భావం! అప్పుడు నేను అమాయికంగా ఈ వకుళ ముకుళాలు కొల్లలు కొల్లలుగా కోసి మాలికలు గుచ్చుగుంటున్నాను. ఇంతలో గంభీరంగా 'మదిరా!—' అనే పిలుపు వినబడింది. నేను అదిరిపడి వెనుదిరిగి చూచాను.

వకుళ : ఎవరా పిలిచినవారు?

మదిర : మహామాత్యులు చాణక్యులు! నేను చకితనై అప్రయత్నంగా నిలబడిపోయాను. నా హస్తంలో వకుళమాలిక సూత్రం మాత్రమే మిగిలిఉంది. పుష్పాలన్నీ చెదిరిపోయినట్లు జలజలా రాలిపోయాయి. అప్పుడు నాకు మహామంత్రుల ముఖంలో బొమముడి మధ్యన మెరసిన కుంకుమ రేఖ భయంకరమైన విషజ్వాలలా కనిపించింది!

వకుళ : ఎందుకు వారికింత క్రోధం నీ మీద!

మదిర : నామీద క్రోధం ఏమీలేదు!

వకుళ :మరి?

మదిర : అప్పుడు ఆయన నాతో 'మదిరా! నీ తల్లి దండ్రులు నిన్ను శైశవంలోనే దేవదాసిగా అర్పించారన్న విషయం ఎరుగుదువు! అందుచేత నీవీ వకుళ మాలికలు ధరించకూడదు!' అన్నారు.

వకుళ : ఎందుచేత?

మదిరా : వకుళా! వకుళ మాలికలు గృహిణులు ధరించవలసినవట! మరి నేను దేవదాసిగా సమర్పింపబడ్డానుగదా! అందుచేత నన్నా పుష్పాలు ధరించవద్దనీ, కింశుకాలూ, మందారాలూ, మొదలయిన పుష్పాలు ధరించవలసిందనీ ఆజ్ఞాపించారు. అంతే కాదు అప్పటినుంచీ నాకు గుర్రపుస్వారీ, కత్తిసాము, మొదలయిన వీరోచిత విద్యలూ, నృత్యమూ, సంగీతమూ, తదితరములైన లలితకళలూ నేర్పించారు. అప్పటినుంచే నన్ను వారి రహస్యాలోచనా గృహానికి ద్వారపాలికగా ఏర్పాటు చేశారు. నన్ను నిష్కర్షగా గృహిణీ సముచితములైన అలంకారాలేవీ అలంకరించుకో కూడదని నియమించారు.

వకుళ : మరి నిన్ను దేవదాసిగా కూడా ఉండనీయకుండా కేవలం సేనానాయకురాలినిగా కూడా చెయ్యావలెననా వారి సంకల్పము?

మదిర : ఏమో వకుళా! నా జీవితం చూస్తే, నాకే విచిత్రంగా కనబడుతూంటుంది. అప్పుడప్పుడు నాకీ సైనిక వేషం అంతా ఒక మహాభారంలా కనబడుతూంటుంది.

వకుళ : నాకు ఇది అంతా చూస్తే నవ్వుగా ఉంది మదిరా! ఆయన అన్ని నియమాలూ బాగానే ఏర్పరిచారుకాని, ఒక్క విషయంలో పొరబాటుపడ్డారు సుమా!

మదిర : ఏ విషయంలో.

వకుళ : చెప్పమన్నావా? కోపం రాదుగదా !

మదిర : కోపం ఎందుకు?

వకుళ: అన్నిటి మోస్తరుగానే నీ హృదయంలో ఒక్క క్షేమ బిందువైనా లేకుండా చెయ్యవలసింది. స్త్రీ జాతిని కూడా సమ్మోహింప చేసే నీకీ సౌందర్యం కూడా ఏమీ లేకుండా చెయ్యవలసింది!

మదిర : వకుళా—నే నందగత్తె నేనా ?

వకుళ : మదిరా! మరి యోధురాలు అడగవలసిన ప్రశ్నేనా ? ఇది!

మదిర : వకుళా—నీవు పొరబడ్డావేమో అనిపిస్తుంది. మహాత్ముల శిక్షణం వల్ల నాలో హృదయం పూర్తిగా హరించిపోయిన ట్లనిపిస్తుంది. అప్పుడప్పుడు నాలో జీవ చైతన్య స్రవంతి కూడా ఇంకి పోతూన్నట్లుంది. కాని నేను అశ్వంమీద అధిరోహించి సవారీ చేస్తున్నప్పుడు నాలో ఎన్నడూ లేని దేదో మహోత్సాహం పొంగివెల్లువలై పోతూన్నంట్లుంది. కత్తిసాము చేస్తూంటే ఈ లోకం అంతా ఒక్క బాకు పోటుతో జయించగలనని అనుకుంటాను.

వకుళ : బాకు పోటు దాకా ఎందుకు! ఒక్క చిన్ని క్రీగంటి పోటుచాలదా ? మదిరా !

మదిర : చాలులే నేర్చావు! అస్తమానమూ పరిహాసమే! [కోకిల కూతలు]

వకుళ : మదిరా! నాకీ కోయిల కుహూరాగం వింటూంటే ఎందుకో అప్రయత్నంగా జలజలా కన్నీళ్లు రాల్తాయి. మన నృత్యాచార్యులు చెప్పిన గీతిక పాడనా! దానికి కూడా చాణక్య మంత్రుల అనుజ్ఞ కావలెనా?

మదిర : ఎందుకు వకుళా మాటిమాటికీ ఈ ఎత్తిపొడుపు! పాటపాడుదూ! ఆ తరవాత ఆశ్రమ గృహాలకి వెళ్లిపోదాములే !

వకుళ : [పాడుతుంది]

పాట.

కఱకురాయిని నిన్ను కరగింప నేర్తునా !
మరుగు నా యెదయింక మరలింప నేర్తునా !
వలదన్న పలుమారు వారించినా సరే !
తొలగవిక నా కన్నుతుమ్మెదలు నిను వదలి !
వలపుగొని నీ మోముపై వ్రాలు నిరతమ్ము !
తలచి మన్నింపు మీ దాసి యపరాధమ్ము !
మరి మరుగు నా యెడద మరలింతునా ! ప్రియా !
కరకురాయిని నిన్ను కరగింప నేర్తునా !

౨

[చాణుక్యుడు-మదిర ప్రవేశము. చాణుక్యుని మంత్రాలోచనా గృహము ]

చాణుక్యుడు—ఎవరక్కడ ?

మదిర : [ప్రవేశించి] నేను మదిరను ప్రభూ !

చాణుక్యుడు : —మదిరా ! ప్రాతఃకాలంలో నా మంత్ర పునశ్చరణ సమయంలో ఎవ్వరినీ, చివరికి చంద్రగుప్త సార్వభౌముల్ని కూడా నాఆజ్ఞ లేనిదే ప్రవేశపెట్టరాదని నీకు ఆజ్ఞాపించాను కాదూ!

మదిర : [వణకుతూ] అవును ప్రభూ !

చాణుక్యుడు : మరి యీ పర్వతేశ్వరుడు ఈ సమయంలో అంతర్గృహంలోకి ఎల్లాగ ప్రవేశించాడు ?

మదిర : నేను వలదని వారించాను. వారు నా మాట లక్ష్యపెట్టకుండా లోపల ప్రవేశించారు. తమర్ని అత్యవసరంగా దర్శించాలన్నారు!

చాణుక్యుడు : [తీవ్రంగా] నీ మాట లక్ష్యపెట్టనేలేదా ? అప్పుడు అతని మృతశరీరంగాని నీ మృతశరీరంగాని ప్రాంగణంలో పడి ఉండవలసినది!

మదిర : అవును ప్రభూ! నేను నా కృపాణం దూసి ద్వారానికి అడ్డుగా నిలబడ్డాను. వారు ద్వారం దాటితే వెంటనే పొడిచివెయ్యాలనుకున్నాను. కాని ఎందుచేతనో క్షణంలో నా కన్నులలో వేయి మెరుపులు మెరిసి నట్లయింది! కనురెప్పపాటులో వారు లోపల ప్రవేశించారు. ఆ పైన తమరిద్దరూ సంభాషిస్తూండడంవల్ల నేను లోపలికి వచ్చి తమతో ఈ విషయం మనవి చెయ్యలేకపోయాను!

చాణక్యుడు : [తీవ్రంగా] ఇటు చూడు మదిరా! పూర్తిగా నావైపు కళ్లు తెరచిచూడు!

మదిర : ఏమి! మహామాత్యులు నన్నీ విధంగా పరీక్షిస్తున్నారు!

చాణ : మదిరా! నేను నీతో ఈ సామ్రాజ్య సేవ, ఈ చాణక్య సేవ అసిధారావ్రతం అని చెప్పాను. నీవు ఈ అసిధారావ్రతానికి అసమర్థురాలవైతే నీ సామ్రాజ్యసేవా ఖడ్గం ఈ ద్వారంమీద విడిచి వెళ్లవచ్చును! నీతో నేను ఈ మాట నిష్కర్షగా చెబుతున్నాను. ఇప్పుడైనా మించిపోయినదేమీ లేదు!

మదిర : అమాత్యదేవా! నా అపరాధం మన్నించండి. మరి నావల్ల ఇటువంటి అపరాధము జరగదు. మీమనస్సు నొప్పించను!

చాణ : మదిరా! నీ శైశవంలో నీ తల్లిదండ్రులు నిన్ను దేవదాసిగా సమర్పించినప్పటినుంచి, నిన్ను ఈ ఆశ్రమంలో ఉంచి నీకు, కౌటిల్యనీతి, శస్త్రాస్త్ర ప్రయోగము, అశ్వారోహణము, మొదలయిన వీరోచిత విద్యలన్నీ అభ్యసింప జేశాను. నీవు షోడశ వర్షాలు నిండగానే మహాశక్తి సన్నిధానంలో ఈ రాజ్యసేవకై ప్రాణాలైనా సమర్పిస్తానని శపథం పట్టావు! ఆ మహాశక్తి సన్నిధానంలో చేసిన శపథం పాలించనివారు ఆదేవి క్రోధానికి భస్మమై పోతారు! జాగ్రత, ! సార్వభౌములు రాలేదేమో!

మదిర : వారు వచ్చినారని తమతో మనవి చేయబోతూంటే ఇంతలో తమరు పిలిచినారు.

చాణ : వెంటనే వారిని ప్రవేశపెట్టు!

మదిర : చిత్తము.

[ప్రవేశము : చంద్రగుప్తుడు].

చాణక్యుడు : సార్వభౌములు చాలసేపటినుంచి నిరీక్షిస్తున్నట్లున్నారు.

చంద్ర : తమ తీవ్ర శాసనముల ప్రభావమది!

చాణ : అవును! నేను నన్నే అనుమానించు కొంటున్నాను! నందోన్మూలనం అయిపోయినా రాక్షసమంత్రి రాత్రింబవళ్లు, ఏవో కుతంత్రాలు పన్నుతూనే ఉన్నాడని వినికిడి.

చంద్ర : కోరలు తీసిన త్రాచు బుసగొట్టితే ఏమి ప్రయోజనము!

చాణ : ఎప్పటికైనా • తాచుపాము తాచు పామే! ఈ మధ్య పర్వతేశ్వరుని నడవడి ఏమీ బాగాలేదు. మదిరమాటలుకూడా నిర్లక్ష్యము చేసి, అంతర్మందిరములో ప్రవేశించినాడు!

చంద్ర : ఎంతటి సాహసము!—నాకు కూడా అతని వైఖరిలో మార్పు గోచరిస్తూంది.

చాణ : అవునవును! రాక్షసమంత్రికీ పర్వతేశ్వరునికీ రహస్యంగా రాయబారాలు నడుస్తున్నాయని ఒక గూఢచారి అన్నాడు.—ఇంకొక గూఢచారుడు కూడా ఆ విషయం నిర్ధారణ చేసేవరకూ నేనీ విషయం నిశ్చయం చేయలేక ఊరుకున్నాను.—సార్వభౌముల మాటవల్ల నాకీ విషయంలో నిశ్చయం కలుగుతూంది, సార్వభౌములకీ విషయం ఎలాగ అవగతమయిందో!

చంద్ర : మలయకేతువూ, ఇంకా కొంతమంది రాజులూ పర్వతేశ్వరుణ్ణి తమ పక్షానికి రావలసిందని వ్రాసిన పత్రిక మన గూఢచారుల కందింది!

చాణ : దాని ప్రత్యుత్తరమో!

చంద్ర : పట్టుబడలేదు.

చాణ : ఓహో! పట్టుబడలేదా! పట్టుబడి తీరుతుంది! 'శఠేశాఠ్యం! ప్రయోజయేత్' మీ రీ విషయంలో అప్రమత్తులై ఉండవలెను!

చంద్ర :తమ ఆనతి శిరోధార్యము! ఆచార్యదేవుల ప్రాతఃకాల తపశ్చర్యకు కాలాతిక్రమం జరుగుతూంది. మరి నేను సెలవు తీసికొంటున్నాను.

3

[పాటలీపుత్రము. రాక్షసమంత్రి రహస్య నివాస భవనము. రాక్షసమంత్రి, పర్వతేశ్వరుడు, ప్రవేశము]

రాక్షసమంత్రి : మనం అతి రహస్యంగా చాణక్య మంత్రి ప్రయత్నాలన్నీ గమనిస్తూండాలి. క్రమక్రమంగా పార్వతీయ సైన్యాలన్నింటినీ పోగుజేసుకుని హఠాత్తుగా పాటలీ పుత్రం ముట్టడించడం మంచిది. ఈలోగా ప్రతి రాజాధికార పదవిలోనూ ఉన్నవారిని ఆత్మీయులుగా మార్చివెయ్యాలి. అన్నింటికన్నా ముఖ్యం చాణక్యహృదయం. అది మానవమాత్రులెవ్వరూ గ్రహించలేరు. ఆయన రహస్య మంత్రాంగం అంతా ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటుండాలి. ఇది అత్యంత ముఖ్యము!

పర్వ : చిరునవ్వుతో నేను చాణక్య మంత్రిని జయించాను!

రాక్షస : అసంభవము!

పర్వ : కాని అసంభవమే సంభవమైనది!

రాక్ష :నిశ్చయమేనా!

పర్వ : ఔను! చాణక్యమంత్రి హృదయము నా చేతిలో చిక్కింది! అతని మంత్రగృహ ద్వారపాలిక నాయెడల వలపు గొన్నది!

రాక్ష : ఆమె పేరు?

పర్వ : మదిర.

రాక్ష : ద్వారపాలిక మన వశమైనంత మాత్రమున భవనము మీ వశముకాగలదా? మహారాజా!

పర్వ : —ఆమె అతని ద్వితీయ హృదయము!

రాక్షస : అతనికి హృదయమే లేనప్పుడు ద్వితీయ హృదయం ఎక్కడిది?

పర్వ : మీరిప్పుడు నా మాటలు విశ్వసించరు. కాని చాణక్య రహస్యాలు బయట పెట్టినప్పుడు నేనన్నమాటలు యదార్థములని రుజువుపడుతుంది.

రాక్ష : కాని చాణక్యమంత్రితో వ్యవహారము నాగుబాముతో చెలగాటము!

పర్వ : పార్వతీయులు నాగుబాములకు భయపడరు. అచిరకాలములో మీకా నాగుబాము నే పట్టి తెస్తాను:

రాక్ష : విజయీ భవ!

పర్వ : నేను తిరిగి చాణక్య నివాసానికి మరలిపోతున్నాను.

రాక్ష : పునర్దర్శనము!

పర్వ : నాగుబాము గరళంతోనే!

రాక్ష : సరే! మీ సామర్థ్యం చూస్తాను!

౪

[గంగానదీ తీరాన్ని చాణక్య నివాసగృహానికి సమీపంలో ఉన్న ఉద్యానవనమూ, దూరాన్నించి గంగా తరంగ ఘోష.]

వకుళ : ఆ తరవాత ఏమి జరిగినది?

మదిర : ఏమి జరిగినదని చెప్పను వకుళా! పర్వతేశ్వరులు నా వైపు చూచి 'నేనీవేళ చాణక్య దర్శనం చేసితీరాలి' అన్నారు. నేను 'ఈ సమయంలో మహామాత్యులు ఎవ్వరికీ దర్శనమివ్వరు! అన్నాను. అబ్బా! ఆయనకి ఎంత నిర్లక్ష్యము? ఆ పైన నా వైపు అనాదరంగాచూసి, ద్వారందాటి పోబోయారు.

వకుళ : అప్పుడు నీవు కళ్లు వప్పగించి చూస్తూ ఊరుకున్నావా?

మదిర : చాలులే వకుళా నీ పరిహాసము! నేనప్పుడు కత్తి దూసి అడ్డుగానిలబడి "ఒక్క అడుగు ముందుపడితే ప్రాణాలు దక్కవు" అన్నాను.

వకుళ : ఆ పైన?

మదిర : ఆ పైన ఆ పర్వతేశ్వరులు ఛాతీ విరిచి ఎదురుగా నిలబడి, నన్నుచూసి ఒక్క చిరునవ్వునవ్వి, 'ఇదిగో నా హృదయము! నేను లోపల ప్రవేశిస్తున్నాను! పొడవగలిగితే పొడు! అన్నారు.

వకుళ : పర్వతేశ్వరుడు గుండెలు తీసినబంటు! అయితే అల్లాంటప్పుడు ఒక్కపోటు పొడిచి వెయ్యలేకపోయినావా?

మదిర : పొడిచివెయ్యాలని అనుకునే కత్తిఎత్తాను! అంతే! నా కళ్లల్లో వెయ్యి మెరుపులు మెరిసినట్లయింది! ఒక్క కనురెప్పపాటులో పర్వతేశ్వరులు లోపల ప్రవేశించారు.

వకుళ : ఎంత సాహసము! మరి అంత నీ మాట కూడా ధిక్కరించి, అంత అనుచితంగా అనుమతి లేకుండా లోపల ప్రవేశించడమెందుకో?

మదిర : వకుళా! ఆయనకు అంత అత్యవసర రాజ్యవ్యవహారమే ఉండి, మహామంత్రులతో సంభాషించవలసిన అవసరమే ఉండి, నన్ను ధిక్కరించి లోపలికి వెళ్లి ఉంటే, నేనంతగా సంక్షోభ చెందేదాన్నిగాదు. ఆయన మర్యాదకోసం ఒకసారి మహామంత్రుల దర్శనం చెయ్యడానికి వచ్చారు. నేను మహామంత్రుల అనుమతిలేనిదే లోనికి పోనియ్యనన్నాను. వారు ప్రత్యేకంగా నన్ను నిర్లక్ష్యం చెయ్యడానికే లోపల ప్రవేశించినట్లుంది!

వకుళ : ఆపైన మహామంత్రులు ఏమిచేశారు?

మదిర : ఇక చెయ్యవలసింది ఏమి ఉంది? పర్వతేశ్వరులు వెళ్లిపోయిన తరువాత నన్ను పిలిచి సామ్రాజ్య సేవలో సామర్థ్యం లేకపోతే అది విడిచి పొమ్మన్నారు!

వకుళ : అతి భీకరమైన అరణ్యమృగాలని సంహరించినదానవు; ఆనాడు అంత బేలవైపోయావేమి మదిరా!

మదిర : వకుళా!—అదే నాకూ విచిత్రంగా ఉంది! ఆ నాటితో నాలో ఉన్న ఆ రాజసమూ, ఆ గర్వమూ, ఆ అహంభావమూ, అవన్నీ కూలబడిపోయాయి! నేను యుద్ధంలో పరాజితురాలనైపోయినట్లు అయిపోయినాను!

వకుళ : మరి ఎప్పుడైనా ఆ పర్వతేశ్వరుడు నీ మాట ధిక్కరించి, ఆ విధంగా మహామాత్యుల గృహంలో ప్రవేశించినాడా?

మదిర : ఆయన—అప్పుడప్పుడు మహామాత్యుల దర్శనంచేయడం ఉంది? అయితే! నా మాట ధిక్కరించడానికి ఆయనకి అవకాశమే కలగలేదు.

వకుళ : నీకు తెలియలేదేమోకాని ఆయన ఆ విధంగా నీ మాట ధిక్కరించి లోపలికి వెళ్లడానికి ఏదైనా ఒక ప్రత్యేక కారణం ఉందేమో!

మదిర : లేదు వకుళా! కేవలమూ నన్ను న్యూన పరచడానికే ఆ విధంగా ఆచరించి ఉంటారు. ఆహా! ఆ పర్వతేశ్వరునికి ఎంత రాజసము! నా కళ్ల ఎదురుగుండా నన్నుచూసి చిరునవ్వునవ్వి, నిర్లక్ష్యంగా ఛాతీ విరిచి నడిచి వెళ్లిపోయారు!

వకుళ : మదిరా! ఇంత చిన్న విషయానికింత మథనపడడం ఎందుకు? అవమానం అనేది ఏదైనా ఉంటే అది మహాత్ముల దిగాని నీదికాదే!

మదిర : [ఆలోచిస్తూ] వకుళా! నీ వన్నమాట యదార్థమే. అవమానం నాది కాకపోవచ్చును! కాని, నాలో నేను ఏదో గొప్ప పరాజయం పొందిన దానివలె అలిసిపోతున్నాను. నాలో లోపల ఒక తీయని నిద్రా, కలలూ ఆవేశిస్తూన్నట్లున్నాయి. వకుళా! నీ వింతకు పూర్వం అనురాగ గీతికలు ఆలాపిస్తూ నృత్యంచేస్తూంటే అవన్నీ ఏవో పిచ్చి పాటల్లాగ కనబడేవి! నాకిప్పుడు ఆ పాటల్లో కొత్త అంగాలు స్ఫురిస్తున్నాయి. నేనీ పారిజాత వృక్షాల నీడలో కొంచెంసేపు విశ్రమిస్తాను. నీ మధుర కంఠంతో ఒక అనురాగ గీతిక పాడు వకుళా!

వకుళ : మదిరా! నీ వెప్పుడూ దీనంగా మాట్లాడలేదు. నీ కంఠంలో ఏదో ఒక కొత్త మాధుర్యం వచ్చినట్లున్నది. ఇటుచూడు మదిరా! ఆ కళ్లమ్మట కన్నీళ్లేమి మదిరా!—మదిరా! నీకు కలిగిన దారుణావమానానికి కారణమేదో నాతో చెప్పకూడదా? నేను నీకు అన్యురాలను కాదుగదా?

మదిర : వకుళా! మీ ఆవేదనకి కారణమేమో నాకే తెలియడంలేదు. నాకు ఆ పసిరిపచ్చిక శయ్యమీద మేనువాల్చి ఆ పారిజాత పుష్పాలలాగ కన్నీళ్లు రాలుస్తూ నిద్రపోవాలని ఉంది - వకుళా! ఆ వసంత సంధ్యారాగంలో ఆ సీతాకోక చిలకలు ఎట్లా హాయిగా విహరిస్తున్నాయో!

వకుళ : మదిరా, నీ మనస్సులో భరింపరాని వేదనా నిర్ఝరిణి ప్రవహిస్తూంది. నీ హృదయశాంతికొక మధుర గీతిక ఆలాపిస్తాను. సావధానంగా వినగలవా?

పాట

ఇది నీ కెరిగింతునంచు! ఎడద కలవరించుగాని!

తుదిలో నొక మాటయైన
పెదవుల విడిరాదు సుమీ!
నాలో నేనె నవ్వుకొందు!
లోలో నినుపలు కరింతు!
ఏలనో మరొక్కకపుడు, బేల కనుల నీరునింతు!
తలపునగల తీయమలపు, తలచెద నెరిగింప నీకు!
జలజలమను కన్నీరయి వలపుమాట కరగు తుదకు
ఇది నీ కెరిగింతునంచు, ఎడద కళవళించు నాథ!
తుదిలో నొక మాటయైన పెదవుల విడిరాదుగదా!

మదిర : వకుళా! నా కీ పాట వింటూంటే మత్తులాంటి నిద్ర వస్తూన్నట్లుంది. నేనీ పారిజాత పుష్పశయ్యక్రింద విశ్రమిస్తాను. ఆ అంత్యచరణం మరి ఒకసారి అలాపింపగలవా! ఆ చరణం అలాపించిన తరవాత నన్ను కొంతసేపటివరకూ సుఖంగా నిద్రపోనీయనీ.

వకుళ : సరే మదిరా!

ఇది నీ కెరిగింతునంచు ఎడద కలవరింతు నాథ!
తుదిలో నొక మాటయైన
పెదవుల విడివడదుగదా!

x

[సాయం సంధ్య, చాణక్యాశ్రమ సమీపోద్యానవనము. మదిర, పర్వతేశ్వరుడు సంభాషిస్తూంటారు].

మదిర : మహారాజా ! తమరీ ప్రశ్న అడగరాదు. నేను సమాధానము చెప్పరాదు. మహామంత్రులు సార్వభౌముల మంత్రాంగ భవనానికి విచ్చేశారు. అంతకంటె నాకేమీ తెలియదు.

పర్వ : మదిరా ! ఇటు పైపు చూడు ! నీకీ విషయము తెలియదా ! నాకు నీ వీ మాత్రము విషయము తెలియనీయగూడదా ?

మదిర : ప్రభూ ! నేను మహామంత్రులకు క్రీత దాసిని ! నన్నీ విషయము మరి ప్రశ్నింపవద్దు—

పర్వ : పోనీ ! ఒక్క విషయము. ఇక్కడ చక్రవర్తీ, సైన్యాధిపతీ, ఎంతసేపు సంభాషించారు.

మదిర : సుమారు రెండుగడియల కాలము.

పర్వ : వారు ఏయే విషయములు చర్చించారు ?

మదిర : రాజ్యాంగ విషయములు.

పర్వ : రాజ్యాంగ విషయములుకాక, రమణీ విషయములు చర్చిస్తారా వారు ! నీవు చాల ప్రజ్ఞావంతురాలవు మదిరా !

మదిర : ఎవరు ? నేనా ప్రజ్ఞావంతురాలను ?

పర్వ : ఔను !

మదిర : నేనే ప్రజ్ఞావంతురాలనైతే, ఈ ఆశ్రమంలో ఈ విషయాలు ప్రశ్నించినవారు తిరిగి సజీవులై ఈ ఆశ్రమంవిడిచి వెళ్లగలరా !

పర్వ : అంతవరకూ ఎందుకు ? నేను ఈ ఆశ్రమంలో ప్రవేశించగానే నా జీవితం హరించావు గదా ! మదిరా !

మదిర : ఎవరు ! నేనా తమ జీవితము హరించినది !

పర్వ : ఔను మదిరా !

మదిర : మహారాజా ! ఆ మాట సత్యమో, అసత్యమో నాకు తెలియదు ! అది సత్యమే అయితే—

పర్వ : సత్యమే అయితే, ఆదేమి మదిరా ! ఐధంగా నీ కన్నులనుండి కన్నీరు ప్రవహిస్తూంది !

మదిర : నా హృదయంలో ఏదో అది సత్యము కాదని రహస్యముగా మంత్రిస్తూంది. అందుకనే నేను [అర్థోక్తిలో గద్గదిక].

పర్వ : అది సత్యమే అని నేను ఎట్లు నిరూపించగలను మదిరా !

మదిర : ప్రభూ ! అది అసత్యమే అయినా, సత్యమే అని మీ మధురవాక్కుతో ఒక్కసారి ఉచ్చరించండి ! నేనూ సత్యమే అనుకుంటూ విశ్వసిస్తాను. ఒకవేళ అసత్యమే అయినా ఆ వాక్కులో ఎంత మాధుర్యం ఉంది. అది అసత్యమే అని ఋజువుకాకముందే, నేనీ మధుర భ్రాంతిలోనే మరణించగలిగితే ఎంత అదృష్టవంతురాలను !

పర్వ : ఎందుకీ అమంగళ వాక్కులు, మదిరా ! నామాటలు విశ్వసించవూ, [కొంతసేపాగి మెల్లిగా]. అయితే మదిరా ! వారే విషయాలు చర్చించారో కొంచెమైనా తెలిసిదా ?

మదిర : నన్నీ విషయాలు గుచ్చిగుచ్చి అడగడానికేనా మీరిక్కడికి వచ్చినది ?

కాదు.

మదిర : మరెందుకు ?

పర్వ : నీ అనురాగం ఎంతవరకు యదార్థమైనదో అని పరీక్షించడానికి !

మదిర : నేను చెప్పజాలనంత మాత్రాన నా అనురాగం అసత్యమై పోగలదా ?

పర్వ : ఎందుకు చెప్పలేవు !

మదిర : సామ్రాజ్య సేవ ఎంతటి అసిధారా వ్రతమో మీకు బోధింపవలెనా ?

పర్వ : పోనీ, సామ్రాజ్య సేవనుండి విరమించు కొన్నప్పుడు చెప్పవచ్చునా ?

పర్వ : ప్రస్తుతం విరమించుకోలేదుగదా !

పర్వ : ఇకముందు విరమించుకొందువుగాని !

మదిర : అమ్మగోయ్యో ! మహామాత్యులు ఇందుకు అంగీకరిస్తారా ?

పర్వ : ఒకరి అంగీకారం కావలసివచ్చినప్పుడు, అంగీకరించకపోవచ్చును !

మదిర : బాల్యంనించి విద్యాబుద్ధులు చెప్పినవారి మాట జవదాటగలనా ? నేను !

పర్వ : అంతేనా ! నీ అనురాగ గాంభీర్యము !

మదిర : అంతేనా ! మీరు నన్ను అవగాహన చేసుకొన్నది !

పర్వ : అంతకంటె మరేవిధంగా అవగాహన చేసికోవలెనో నాకు అవగతం కావడం లేదు.

మదిర : అచిరకాలంలోనే అవగతం అవుతుంది!

పర్వత : అంటే ఎంతకాలమో !

మదిర : నాలుగైదు దివసాలలో.

పర్వ : నిశ్చయమేనా !

మదిర : నిశ్చయమే.

పర్వ : మరి నేను మరలిపోదునా ?

మదిర : ఒక్కటి - మీరు అన్నమాటనుండి మాత్రము మరలిపోగూడదు.

పర్వ : ఎంతమాట !

*

[చాణక్యుని మంత్రాగార భవనము. చాణక్యుడు, పర్వతేశ్వరుడు ప్రవేశము. దూరమునుండి భాగీరథీ ఘోష. ]

చాణ : పర్వతేశ్వరులకు మామీద ప్రత్యేకాభిమానము కలిగినది !

పర్వ : ఎంతమాట ! కేవలమూ ఆశ్రితుల విషయంలో తమ రావిధంగా సెలవియ్యగూడదు !

చాణ : ఎవరికాశ్రితులు ? రాక్షస మంత్రికా ? మాకా ?

పర్వ : నేను రాక్షసమంత్రి కాశ్రితుడనా ? తమకీ మాట కిట్టని వారెవరు చెప్పారో !

చాణ : చాణక్యుడు కిట్టని వారి మాటలు వినేటంత అసమర్థుడనా ? మీ అభిప్రాయము !

పర్వ : నా అభిప్రాయం అదికాదు ! మావల్ల అపరాధములుంటే మహామాత్యులు క్షమించవలెను !

చాణ : నేనెప్పుడూ అపరాధాలు క్షమించను ! నా శిక్షా స్మృతిలో అపరాధిని శిక్షించి తీరవలసిందే!

పర్వ : నేనెప్పుడూ తమకుగాని సామ్రాజ్యానికిగాని అపరాధంచేసి ఉండలేదే !

చాణ : అపరాధం చేసినవారు సరిగా ఈ విధంగానే నటిస్తూంటారు !

పర్వ : తమ రీవిధంగా సెలవీయడం న్యాయం కాదు ! నేను కేవలమూ నిరపరాధిని.

చాణ : మహారాజా ! ఇటుచూడండి! తమలో సామ్రాజ్యానికి ద్రోహచింత బయలుదేరింది. మీరు చాణక్యమంత్రి కన్నులు కప్పలేరు. ఇప్పడైనా మీరు సార్వభౌముని దగ్గిర క్షమాపణ వేడి, చేసిన తప్పిదం అంగీకరించండి! చేతులు కాలిన తరవాత మరి చెయ్యవలసింది ఏమీ ఉండదు!

పర్వ : నేను ఏ పాపమూ ఎరగనే! నన్నీవిధంగా అనుమానించడం ఉచితం కాదు! మీరు!

చాణ : మీకు ఏమీ తెలియదా!

పర్వ : తెలియదు! తెలియదు!

చాణ : మీరు నిప్పలతో చెరలాట మాడుతున్నారు. ఇప్పటికీ మించిపోయింది లేదు!

పర్వ : ఇంక మరి తమకు నేనేమి విన్నవించను!

చాణ : విన్నవించేది ఏమీలేదా?

పర్వ : ఏమీలేదని నేను ఎన్నిసార్లు మనవి చేసుకోను!

చాణ : సరే! మీరు వెళ్లవచ్చును!

పర్వ : నా విషయమై తమరన్యధా భావించవద్దని మనవి.

చాణ : నాకు యధార్థ భావనేగాని అన్యధా భావన ఎన్నడూలేదు. నేను ఒక్కమాట చెబుతున్నాను. అది విని మరీ వెళ్లండి. సామ్రాజ్య పరాధులు ఆ మహాశక్తి క్రోధానికి ఆహుతి అయితీరవలసిందే.—ఇది ముమ్మాటికి నిశ్చయము! మరి మీరు వెళ్లవచ్చును.

పర్వ : చిత్తము.

౭

[చక్రవర్తి చంద్రగుప్తుడు, చాణక్యుడు. చక్రవర్తి భవనంలో, ప్రాత: కాలవేళ.]

చాణ : నాకు పర్వతేశ్వరుని విషయంలో ఇక సందేహంలేదు! అతడు నిశ్చయంగా ద్రోహి.

చంద్ర : ఇది రాక్షస కుతంత్రమేనా?

చాణ : నిస్సందేహముగ!

చంద్ర : ఔరా ఎంత సాహసి!

చాణ : పర్వతేశ్వరుడు రాక్షసుడు మన రహస్యాలన్నీ అవగాహన చేసుకోవడానికి పంపించిన గూఢచారి!

చంద్ర : పర్వతేశ్వరుడు ఈ ప్రాతఃకాలం మీ దర్శనార్థం వచ్చినాడా?

చాణ : ఆహా! వచ్చినాడు!

చంద్ర : అతని వైఖరి ఏమీ మారలేదా?

చాణ : మారలేదు!! ఇక మారదు!

చంద్ర : అయినప్పుడు వెంటనే అతన్ని నిర్బంధించడం సముచితంకాదా?

చాణ : ఇంతకు పూర్వమే నిర్బంధించబడినాడు!

చంద్ర : ఎట్లు!

చాణ : ఈ చాణక్యుని విషపాశాలతో!

చంద్ర : మీ అభిప్రాయం నాకు అవగతం కావడంలేదు.

చాణ : సార్వభౌమా! ఈ చాణక్యుని క్రోధాగ్నికి గురి అయినవాడు, అతని విషపాశాలు తప్పించుకోలేదు!

చంద్ర : అయితే పర్వతేశ్వరునిపై విషప్రయోగం జరిగిందా?

చాణ : అఁ! నిస్సందేహముగ.

చంద్ర : ఎప్పుడు!

చాణ : అతడు సామ్రాజ్య ద్రోహము తలపెట్టి వచ్చాడే. పర్వతేశ్వరుడు విషకన్యను చూచి, ఆమె ద్వారా సామ్రాజ్య రహస్యాలు సంగ్రహించవలెనని నిశ్చయించాడు. నే ననేక విధములుగ - అతన్ని సన్మార్గమునకు త్రిప్పవలెనని ప్రయత్నించాను! - మానలేదు. అప్పుడు అతనికి విషకన్యపై కలుగుతూన్న కామాన్ని చూచి ఉపేక్షించాను!

చంద్ర : విషకన్య అంటే ఎవరు ?

చాణ : ద్వారపాలిక మదిర.

చంద్ర : మదిరకూడా విషకన్యయేనా ?

చాణ : ఔను!

చంద్ర : మదిరకూడా అతని వలచినదా ?

చాణ : ముందు మదిరయే అతన్ని వలచినది. ఆపైన అతనికి గూడ ఆమెపై కొంత అనురక్తి ఉదయించింది. పిమ్మట పర్వతేశ్వరుడు ఆమెను తన కుతంత్రాలకు సాధనగా ఉపయోగించ నిశ్చయించాడు!

చంద్ర : మీ మదిరకోసమైనా పర్వతేశ్వరుని సంరక్షింపకూడదా ?

చాణ : బహుశః వీలులేదు! సముద్రంలో మునిగిపోతూన్న నౌకను సంరక్షించాలని అనుకోవడం కేవలం అవివేకము!

చంద్ర : గురుదేవా! ఎంత క్రూరమైనది మీ రాజనీతి!

చాణ : కామందకీయంలో 'క్రౌర్య' పదం లేదు!

చంద్ర : అంతేనా! ఇక తిరుగులేదా ?

చాణ : అంతే!

చంద్ర : మరి నేను సెలవు తీసికోవచ్చునా ?

చాణ : ఔను! కాలాతీత మవుతూన్నది.

[ నిష్క్రమణము ]

[వకుళ, మదిర ప్రవేశము. చాణక్య గృహానికి సమీపంలో ఉన్న ఉద్యానవనము సాయం సంధ్యాసమయము.]

మదిర : ఇది నిశ్చయమయిపోయినది!

వకుళ : మరి దీనికి మహామాత్యులు అనుమతిస్తారా ?

మదిర : అనుమతించకపోయినా సరే! ఇది ఈ విధంగా జరిగి తీరవలసిందే!

వకుళ : మదిరా! ఇవి నిశ్చయంగా నీ నోటినుండి వెలువడుతూన్న మాటలేనా ?

మదిర : వకుళా - నీవు నా సాహసానికీ, ఈ ఆవేశానికీ ఆశ్చర్యపడుతున్నా వనుకుంటాను!— కాని ఎంత కాలమీ అగ్ని పర్వతం హృదయంలో ధరిస్తూండగలను. వకుళా! నాకీ సామ్రాజ్యసేవ దుఃసహముగా ఉన్నది. నాలో అణువణువూ దీనికి వ్యతిరేకంగా ఘోషిస్తూంది. ఈ కత్తిసాము, ఈ అశ్వారోహణమూ మొదలైన అసిధారా వ్రతాలు నేను అవలంబించలేను. అదీగాక పర్వతేశ్వరులు నన్ను పాదదాసిగా స్వీకరించడానికి అంగీకరించారు. నేను ఇన్నాళ్లనించీ అవలంబించిన ప్రకృతి వైరుధ్యానికిక ప్రాయశ్చిత్తం విధించుకుంటాను!

వకుళ : మదిరా! నీవు అన్నీ నిశ్చయించుకొన్న తరువాత నేను ప్రశ్న పరంపరలు కురిపించడం ఎందుకు! నీకీ నూత్న జీవితంలో, ఈ కళ్యాణ మహోత్సవంలో మహదానంద పరంపరలు కలగాలని ఆకాంక్షిస్తాను. ఈ సమయంలో నా హృదయంలో ఆనంద సముద్రం ఉవ్వెత్తుగా పొంగుతూంది. ఇంక నీకు ఏ నియమ శృంఖలాలూ లేవుకదా! ఈ ఆనంద సమయంలో నన్ను పాటలు పాడుకుంటూ ఆనందించనీ!



పద్మము

శ్రీ మాధవ మెనన్.



కొండలు

తైకన్ యోకయామా.

పాట

హృదయ విహంగా!.....హృదయ విహంగా!
నీలాకాశ వినిర్మల రుచిలో!
లేలే! పోదమరుణరథ మదిగో!
కాంతి తరంగ తురంగమ్ములపై!
శాంతిదేవతాహాసవమ్ములపై!
ప్రేమ విశాల పతాక మ్మదిగో!
హేమకింకణీ కలకల మదిగో!
హృదయ విహంగా! హృదయ విహంగా!
నీలాకాశ వినిర్మల రుచిలో
లేలే పోదమరుణ రథమదిగో!

మదిర: వకుళా! నా కీపాట వింటూంటే చిరకాల కారాగారంలో నించి, ఒక నిర్మల మలయమారుత వాతావరణంలో హాయిగా విహరిస్తూన్నట్లుంది! వకుళా! ఈవేళ నాలో ఒక నూత్న సంగీతం ఉద్భవిస్తూన్నట్లుంది.

పాట.

కాలసాగర తరంగమ్ములపై!
హేలానంద సువర్ణ నౌకపై!
తేలిపోద మింకేల జాలమో నాథా!
సోలిపోద మొక సుఖస్వప్నమున నాథా!

వకుళ: మదిరా! ఇది వింత చక్కని పాట! మనమిద్దరమూ కలసి నృత్యముచేసి ఎంతకాలమైనది! ఒకసారి పాడుకుంటూ నృత్యము చేద్దామా!

- కాలసాగర తరంగమ్ములపై!
హేలానంద సువర్ణ నౌకపై
తేలిపోద మింకేల జాలమో నాథా!
సోలిపోద మొక సుఖ స్వప్నమున నాథా!

౯

[చాణక్య మందిరం. మదిర, చాణక్యుడు.]

చాణ: ఏమి మదిరా! ఇప్పుడు వచ్చావు!

మదిర: తమతో ఒక మనవి చేసుకోనవలెనని వచ్చాను—

చాణ: ఏదో ఆ మనవి!

మదిర: నేను బాల్యమునుంచీ తమవద్ద వీరోచితములైన శస్త్రాస్త్ర విద్యలు అభ్యసించాను! తమ అనుగ్రహంవల్ల వాటిలో బాగా ఆరితేరాను.

చాణ: ఇప్పుడా ప్రసక్తి ఎందుకు!

మదిర: కొంతకాలంనుంచీ, నాకు ఈ వీరోచిత విద్యాభ్యాసమూ, ఈ వీరవేషమూ ఇవన్నీ బరువైపోతూన్నట్లనిపించాయి. అయినా నేను నిగ్రహించుకుని ఈ దుర్భరభారం భరించుకుంటూ వచ్చాను. మరి ఇక ఈ భారం భరించలేను.

చాణ: ఎందుచేత మదిరా! నీకు ఇటువంటి అభిప్రాయం కల్గింది?

మదిర: మహామాత్యులు నా మాట మన్నించవలెను. నేను బాల్యంనుంచీ స్త్రీప్రకృతి విరుద్ధమైన ఆదర్శాలలో పెరిగాను. ఇప్పుడు అవి అన్నీ అసహజములని గ్రహించాను. అంతేకాదు. నా హృదయంలో ప్రతీ అణువూ ఇంతకి పూర్వం ఈ విషయంలో ఆక్రోశిస్తూనే ఉంది. ఇప్పుడే నా ఆక్రోశం చెడచెవిని పెట్టాను. ఇంక అది నావల్లగాదు! నాకీ సామ్రాజ్యసేవనుండి విముక్తి ప్రసాదించండి!

చాణ: నీకు విముక్తి కావలెనా! మదిరా?

మదిర: ఔను! అదే నేను మనసారా అర్థిస్తున్నాను!

చాణ : మదిరా! ఒకసారి ఆ గంగానదికి అవల వైపున ఉన్న తీరంచూడు! అక్కడ నీకేమి కనిపిస్తున్నాయి!

మదిర : మహారణ్యాలూ, ఆ అరణ్యానికి మధ్యగా అనేకమైన ఋష్యాశ్రమాలూ కనిపిస్తున్నాయి.

చాణ : మనమున్న వైపున ?

మదిర : పాటలీపుత్ర మహానగరము !

చాణ : మదిరా! ఆ కనబడుతూన్న ఆశ్రమాలలో మా పూర్వులంతా తపస్సుచేసి బ్రహ్మీభావం పొందారు. ఇప్పటికీ మా వంశీయులలో కొందరా ఆశ్రమాలలో నివసిస్తూ తపశ్చర్య అవలంబించారు. కాని నేనుమాత్రం ఈ అసిధారా వ్రతమైన రాజసేవ అవలంబించాను. కారణమేమో తెలిసిందా ? నీకు?

మదిర : నాకా కారణము లెట్లు తెలియును ?

చాణ : ఒకసారి నేను ఈ పాటలీపుత్ర నగరమునకు వచ్చాను. విదేశీయులైన మ్లేచ్ఛులు అప్పుడే మహానగరం ముట్టడించారు. ఆ సమయంలో నాగరికులు పడుతూన్న యాతనలు చూడగానే నా కన్నులు కరిగిపోయినవి. వెంటనే మహాశక్తి ఎదుట అరణ్యాలకు పోననీ, ఈ నాగరికుల సంరక్షణకై ఇక్కడే నివసింటానని శపథంపట్టాను. ఒక్కొక్కప్పుడు భయంకరమైన ఈ నాగరికజీవనం చూచినప్పుడు, నాకు అరణ్యాలకు పోవాలని అనిపిస్తూంటుంది. నాలో ఎంత సంక్షోభం రేగుతూంటుందో నీకేమైనా తెలుసునా మదిరా!

మదిర : మహా మంత్రులకూ, ఒక అల్పురాలైన మహిళకూ సామ్యమా! తమవంటివారు సహించే సంక్షోభం నేమ సహించగలనా ?

చాణ : ఒకవేళ నీకు విముక్తి లభించిందనుకో! అనంతరం ఏమి చేస్తావు ? మదిరా !

మదిర : ఒక్కసారిగా దుస్సహమైన ఈ యోధ వేషం విసర్జించి నృత్యం చేస్తూ దేవదాసిగా కాలం వెళ్లబుచ్చుతాను !

చాణ : మదిరా ! ఇది అసంభవము ! ఇది ఎన్నటికీ జరగనేరదు !

మదిర : ఎందుకు అసంభవము ?

చాణ : ఒకసారి నీవు జగజ్జనని అయిన ఆ మహాశక్తి సన్నిధానంలో సామ్రాజ్యసేవలో ప్రాణాలైనా త్యజిస్తానని శపథం పట్టి ఉన్నావు! జ్ఞాపకం ఉన్నదా ! ఆ మహాశక్తి సన్నిధానంలో శపథంపట్టి మాట తిరిగినవారు భస్మీభూతులు కావలసిందే !— మరి ఆ అపరాధానికి నిష్కృతిలేదు !

మదిర : అమాత్యదేవా ! నే నీ సామ్రాజ్యసేవ దుస్సహమై ఈ వేదనాగ్నిలో భస్మీభూతురాలనయిపోతున్నాను ! అటు మహాశక్తి శపథం పరిత్యజిస్తే ఆ విధంగా భస్మమైపోతున్నాను. ఏ విధంగానైనా నా బ్రదుకు బూడిదపాలు కావలసిందే అనుకుంటాను ! ఈ సామ్రాజ్య సేవలో నిత్యమూ జీవచ్ఛస్మం కావడంకంటె, పోనీ, ఆ శపథం పరిత్యజించి, ఆ మహాశక్తి కోపాగ్నిలోనే భస్మమైపోతాను. నాకు సెల విప్పించండి !

చాణ : నీకు సెలవులేదు మదిరా !

మదిర : తమరు సెలవీయకపోతే స్వాతంత్ర్యం వహించి నేనే ఈ సేవ పరిత్యజించి వెళ్లిపోతాను !

చాణ : వెర్రిదానా ! అణువంతైనా స్వాతంత్ర్యంలేదని నీకు తెలియదు !

మదిర : నాకు స్వాతంత్ర్యం ఉన్నది ? అది ఎవ్వ రపహరించగలరో చూస్తాను.

చాణ : మదిరా ! ఇటుమాడు. ఇది ఆ జన్మాంత బంధనము ! నేనూ నీవూకూడా ఈ బంధనాలు అతి క్రమించలేము. ఆ విధికూడా ఈ బంధనాలు సడలించలేదు ! తొందరపడకు ! ఈ సామ్రాజ్య సేవ నిర్వహించి ఈ జీవిత సాఫల్యం అందుకో !

మదిర : [ తీవ్రంగా ] నేను ఆత్మ హననమైనా చేసుకుంటాను గాని ఈ విధి నిర్వహించలేను. ఇదే నా తుది నిశ్చయము ! మీరు మీ ఇచ్ఛానుసారం నన్ను శిక్షించవచ్చును ! ఇదిగో నా ద్వారపాలికా ఖడ్గము ! ఇక్కడనించి పోతున్నాను.

చాణ : మదిరా ! ఆగు ! ఒక్కనిమిషం ఆగు ! తొందరపడి వెళ్లిపోకు ! వెళ్లిపోయిందే ! ఎంత రాజసిక ప్రవృత్తి !

౧౦

[చాణక్య అశ్రమోద్యానవనము, వకుళ, మదిర ప్రవేశము]

వకుళ : మదిరా ! ఈవేళ నీవు ఎన్నడూలేని అనంద సాగరంలో తేలియాడుతున్నావు. నీకు విముక్తి లభించిందా !

మదిర : వకుళా, నాకు ఆచార్యదేవుల దగ్గర నించి విముక్తి లభించలేదు, ఎంత ప్రార్థించినా వారు నా ప్రార్థన మన్నించలేదు. ఇక నేనే ఆ సేవ విడిచివేశాను.

వకుళ : అప్పుడే రాజసేవ విడిచివేశావా ? ఎంత సాహసము ! మదిరా !

మదిర : వకుళా ! అది గతగాథ ! మరి దాని ప్రస్తావన వద్దు ! నేను వెంటనే పర్వతేశ్వరులకీ విషయం విన్నవించాను. వారు నన్ను ఎంతో అప్యాయంతో పాదదాసిగా అంగీకరించారు. ఇక వారి పాదసేవలో నర్తకినై జీవితం ఒక సుందర నిమేషంగా గడిపివేస్తాను ! వకుళా ! నన్నెప్పుడైనా స్మరిస్తావా !

వకుళ : మదిరా ! నీవిక పర్వతేశ్వరుని ఆస్థాన నర్తకివై ఆ మహారాజు పాదసేవలో ఈ ఆశ్రమం స్మరించవేమో అని భయంగా ఉన్నది. దానికేమి గాని మదిరా... నాకు ఒక విషయం తలుచుకుంటే హృదయభారంగా ఉన్నది సుమా !

మదిర : ఏ విషయము !

వకుళ : చాణక్యమంత్రులు చిన్నప్పటినించీ నీకు విద్యాబుద్ధులు చెప్పించారు. వారి ఆశీర్వాదం లేకుండా, ఈ విధంగా వారి ఆజ్ఞ తిరస్కరించి వెళ్లడం ఉచితంగాలేదు !

మదిర : నాకున్నూ అ విషయం దుఃఖజనకంగానే ఉంది. అయినా పాటలీపుత్రం విడిచి వెళ్లే ముందు వారి దర్శనంచేసి అనుజ్ఞ తీసుకుని, ఆశీర్వచనం పొంది మరీ వెళ్లిపోతాను.

వకుళ : మనమిద్దరమూ చిన్నప్పటినించీ నృత్యవిద్య అభ్యసించాము. ఇద్దరమూ చిన్నప్పటినించీ కలిసి అనుదినమూ నృత్యం చేసేవాళ్లము ! ఇంక నాకా భాగ్యం లభించదుగదా ! పోనీ మదిరా ! నీవు సుఖంగా ఉంటే అదే పదివేలు ! ఇది మహామంత్రులు విశ్రాంతి తీసుకొనే సమయం. ఈ సమయంలో వెళ్లి నీవు వారి అనుజ్ఞతీసుకో కూడదా !

మదిర : ఔనౌను వకుళా ! ఇప్పుడే వెళ్లివస్తాను.

౧౧

[చాణక్యుని మంత్రాలోచనా గృహము. మదిర, చాణక్యుడు]

చాణ : ఎవరది?

మదిర : నేను మదిరను!

చాణ : ఓహో! నీవా! ఏమి తిరిగి వచ్చావే!

మదిర : నేను తిరిగి రాక ఎక్కడికిపోగలను! వెళ్లిపోయేముందు తమ అనుజ్ఞ అభ్యర్థించడానికై వచ్చాను!

చాణ : నా అనుజ్ఞా!

మదిర : ఔను!

చాణ : అది అసంభవము! అది ఎన్నటికీ లభించదు!

మదిర : నేను మరి తమ దర్శనానికి రాను! ఈ నాడే నేను పాటలీపుత్రము విడిచిపోతున్నాను. ఈ తుదిఘడియలో మీ ఆశీర్వాదభిక్ష అర్థిస్తున్నాను.

చాణ : మదిరా! నేను ఆశీర్వదించినా, నీ వీ జన్మలో సుఖించలేవు! నీవు పర్వతేశ్వరునికి రాజనర్తకిగా వెళ్లుతున్నావని నాకు తెలియును. కాని తుదిసారి చెబుతున్నాను. నీవు సుఖించలేవు! వెళ్లిపోవద్దు!

మదిర : నేను మాటిమాటికీ మీమాటకు ఎదురు చెప్పలేను. ఒకే ఒకసారి విన్నవించుకుంటున్నాను! నన్ను పర్వతేశ్వరులు ఆస్థాన నర్తకిగానే గాక, పాదదాసిగా కూడ అంగీకరించారు. ఈ తుది కోర్కె మన్నించి ఈ దీనురాలిని ఆశీర్వదించండి!

చాణ : ఇన్నాళ్లనించీ ఈ విషయం నీకు తెలియనీయలేదు. ఇప్పుడిక చెప్పక తప్పదు! దీనినిబట్టి నే నెందుకీ విషయం నిషేధిస్తున్నానో నీకే అవగతమవుతుంది! అతి రహస్య విషయము సుమా!

మదిర : ఏమా రహస్య విషయము!

చాణ : నీవు విషకన్యవు!

మదిర : అంటే?

చాణ : నీకు బాల్యంనించీ ప్రతిదినమూ అణువణువ చొప్పున అధికంచేస్తూ విషం ఇచ్చారు! అందుచేత నీ శరీరం అంతా విషపూరితమై ఉంది!

మదిర : అయ్యో! నాకిది తెలియదే!

చాణ! ఔను! నీకిది తెలియదు! ఇంతకంటె ముఖ్యమయిన విషయము మరి ఒకటి! విషపూరితమైన నీ శరీర సౌందర్యం అనుభవించిన పురుషుడు ఒక ఆరు మాసాలలో అవశ్యము మరణిస్తాడు!

మదిర : అయ్యో! దీనికి విరుగుడు లేదా!

చాణ : లేదు! ఈ విషం తగిలినవారికి మరణం ఒకటే విరుగుడు!

మదిర : అయ్యో! నా జీవితం అంతా ఎందుకీ విధంగా విషపూరితంగా చేశారు! దీనికి మరి ఏవిధమైన మార్గమూ లేదా!

చాణ : లేదు! ముమ్మాటికి లేదు!

మదిర : అయ్యో! నేను నా ప్రాణేశ్వరునికి కూడా మృత్యువునైనానే!

చాణ : అవును! అందువలననే నేనీ విషయం నిషేధించాను! నీవు లక్ష్యపెట్టలేదు.

మదిర : నాతో ఈ విషయం మొదటనే చెబితే నా ప్రాణేశ్వరునైనా రక్షించుకొని ఉండునే!

చాణ : అతడు సామ్రాజ్య ద్రోహం తలపెట్టినాడు ! అందుచేతనే ఈ నిష్కృతి!

మదిర : మరి నేనేమి అపరాధం చేశానని నా జీవితం అంతా విషపూరితం చేశారు !

చాణ : మదిరా ! రాజనీతి అంటే అంతే !

మదిర : [ క్రోధంతో ] ఛీ ! ఎంత దారుణము! రౌరవ నరకంలోనైనా నీ పాపానికినిష్కృతిఉన్నదా

చాణ : లేదు! ఆ మహాశక్తి ప్రత్యేకంగా నాకొక భయంకర నరకయాతన నిర్మించవలసి ఉంది ! కాని ఇది నా స్వార్థంకోసం చెయ్యలేదని ఆమెకు తెలియును !

మదిర : మరి దేనికి ఈ దారుణహింసా కృత్యము?

చాణ : ఈ సామ్రాజ్య రక్షణకు !

మదిర : ఈ సామ్రాజ్యం అబల అయిన స్త్రీ హృదయ రక్తంతో రక్షించవలసిందని ఆమె చెప్పిందా ! ఎందుకీ ఆత్మ వంచన ?

చాణ : ఔను ఇదే ఆమె ఆదేశము !

మదిర : అయితే నేనూ నా ప్రాణేశ్వరులూ కలిసి ఈ సామ్రాజ్యం విచ్ఛిన్నం చేస్తాము ! అదీ ఆమె ఆదేశమే !

చాణ : కావచ్చును !

మదిర : ఎంత పాషాణత్వము ! నా శరీర విషాగ్ని జ్వాలతో నిన్ను భస్మంచేయవలెనని ఉన్నది ! అయ్యో ! ఎంతటి దురదృష్టము !

చాణ : నీవు ఏమిచేసినా చేయవచ్చును ! కాని ఆ మహాశక్తి సన్నిధిలోచేసిన శపథం పరిత్యజించడం ఏమీ ఉచితంగా లేదని చెబుతున్నాను !

మదిర : ఏమైనా సరే ! నేను శపథం పరిత్యజించివేస్తాను, ఇంతేకాదు ! మేమిద్దరము కలిసి నీ కుతంత్రాలన్నీ భస్మంచేస్తాము, నేనిప్పుడే పర్వతేశ్వరులసన్నిధికి వెళ్లిపోతున్నాను. ఇంక ఒక్క క్షణమైనా నీముఖం చూడలేను ! [ వెడుతుంది ]

చాణ: ఇన్నాళ్లకి ఒక అబల నన్ను జయించింది!

౧౨

[ పర్వతేశ్వర భవనము, పర్వతేశ్వరుడు, మదిర ]

మదిర : ప్రభూ ! ఎంతో ప్రయత్నించి బంగారు మేడలు కట్టుకున్నాను. కాని వాటి కన్నిటికీ గాలిలో పునాది పడిందని తెలియదు ! చివరికి మీ మృతికికూడా నేనే కారకురాలనైనాను !

పర్వ : అవును మదిరా ! దైవవిధానం ఆ విధంగా ఉన్నది. కాని నాకు ఇంకా ఆరునెలలు జీవితావధి ఉంది ! ఈ ఆరు నెలలోనూ మనం జీవితానంద మధువు అంతా గ్రోలి మత్తిల్లి మైమరచిపోదాము. ఆ చాణక్యుడు నన్ను జయించానని అనుకుంటున్నాడు. ఈ ఆరు మాసాలలో ఆ చాణక్య రాక్షసుణ్ణి హతమార్చివేస్తాను! అప్పుడు ఎవరు జయించారో తెలుస్తుంది!

మదిర : మీరు మీకు ఆరునెలలే జీవితావధి అన్నారు ? నాకుమాత్రం ఆరునెలలే కాక అంతకంటె అధిక జీవితం సంభవిస్తుందా ?

పర్వ : మదిరా ! నీ ప్రేమవల్ల నా ఆత్మ పునీతమైనది. కాని, ఇంక గత జీవితానికీ భావి జీవితానికీ పశ్చాత్తాపపడి ప్రయోజనంలేదు. ఈ ఆరు మాసాల అవధిలోను మనజీవితానందాలలో మత్తెక్కి మైమరచిపోదాము. ఈ షణ్మాసభవిష్యత్తు మన జీవితాలకు ఒక సుందర గీతికగానూ, ఆ చాణక్య రాక్షసునికి ఒక మరణాహ్వానంగానూ పరిణమింపజేద్దాము !

# కోహినూర్ రత్నములు



పిల్లలను ఉల్లాసముగ నుంచుటకు స్వచ్ఛమైన

"కోహినూర్"

చిట్టాముదం ఆవశ్యకము.

వ్యాధులను ఖండించి ఆరోగ్యముగా నుంచును.

★

"కోహినూర్" ఆమ్లా పరిమళ తైలము. మెదడుకు చల్లదనమిచ్చి వెంట్రుకలను పోషించును. చుండు, తల నెరయుట మొదలగు వ్యాధులు ఖండించును.

★

"కోహినూర్" పన్నీరు దేవతారాధనములకు, వివాహములకు మఱియు అనేక శుభ ప్రయోజనములకు అత్యావశ్యకము. దీని గుణము: అయిదారు చుక్కలు "కోహినూర్" పన్నీరు మీ చేతిగుడ్డ యందు చల్లిన, మీరు గులాబి వనమునం దుండుచందమున మనస్సుకు ఆనందం కల్గించును.

## గృహపరిశ్రమలో తయారు చేయబడినది

ఆదరింపతగినది.

టెలిఫోన్ : 3648 టెలిగ్రాము : Betelnust

# ఆనంద బ్రదర్సు

## ఉత్పత్తిదారుల ఏజంట్లు - సరఫరా చేయువారు.

334, తంబుచెట్టి వీధి, జి. టి. మదరాసు.

ఈ క్రింది కంపెనీలకు మేము ఏజంట్లుగా ఉంటున్నాము.

| | | |
|---|---|---|
| ఆంధ్ర పేపరు మిల్సు | ... | రాజమండ్రి లిమిటెడ్ |
| బెంగాల్ బెల్టింగ్ వర్క్సు | ... | కలకత్తా లిమిటెడ్ |
| పైరిథూరమ్ ప్రోడక్ట్సు | ... | కలకత్తా |
| (ఇండియా) లిమిటెడ్ | ... | కలకత్తా |
| డ్రగ్ హౌస్ (ఇండియా)లిమిటెడ్ | ... | కలకత్తా |
| మాయా ఎంజినీరింగ్ వర్క్సు | ... | కలకత్తా |
| రిలయన్సు ఇన్స్యూరెన్సు అండుకో లిమిటెడ్ | ... | కలకత్తా |

బెంగుళూరు ఆఫీసు

మైసూర్ బ్యాంక్ బిల్డింగ్సు, ఎవన్యూ రోడ్డు.

బొంబాయి
బీమన్ ఛేంబర్సు మెడోస్ట్రీట్ (ఫోర్టు)

షోలాపూర్
వార్డుబిల్డింగ్ చాత్రగల్లీ

బెజవాడ
9/315 రంగనవారి వీధి

సికింద్రాబాద్
8091 కింగ్సువే

షిమొగా
టౌన్ రైల్వేస్టేషను దగ్గర

కోయంబత్తూరు
21/138 రంగీగౌండర్ స్ట్రీట్

మైసూరులోను, బీజాపూరులోను డిపోలు ఉన్నాయి.

# వివేకానంద ఇండస్ట్రియల్ ఇంజనీర్స్

## పెరంబూరు, మదరాసు.

**ఎలక్ట్రికల్**

డిజైన్లు—కట్టడములు

*　*　*

బంగాళాలు, సినీమాలు, ఫాక్టరీలలో, ఇంజను ఫిట్టింగులు దీపాలు ఏర్పాటులు.

*　*　*

కోల్డుస్టోరేజి, ఫ్రిజిడరీలు

*　*　*

గ్రామసీమలలో విద్యుచ్ఛక్తిఏర్పాటులు

*　*　*

అన్నిరకాల మోటార్లూ, జనరేటర్లూ మరమ్మతు చేయబడును.

*　*　*

ట్రాన్సుఫారమర్లూ, స్విచ్ గియర్లూ సప్లయి చేయబడును.

**మెకానికల్**

రిపేరీలు—తయారీలు

*　*　*

చేతి-మర-మగ్గములు నూలుయంత్రాలు అంటే వైండింగ్, వార్పింగ్, సైజింగ్ మెషీనులు మొదలయినవి.

*　*　*

చేతికాగితపు గ్లేజింగు, వగైరాయంత్రాలు.

*　*　*

బియ్యము, పిండి, నూనె, పంచదార, మరల బాయిలర్లు, స్టీముఇంజన్లు, పంపులు గ్యాస్ ఆయిలు, ఇంజన్లు, వర్కుషాపు పనిముట్లు, టానరీయంత్రాలు.

ఉక్కు, బీడు, ఇత్తడి, కంచువగైరాపంచలోహములలో మీకు కావలసిన ఏ ఇంజను సామాన్లయినా సరిగా సకాలమునకు పోతపోసి తయారుచేసి ఇవ్వగలము, సరసమయిన చార్జీలు! నికరమయిన పనివాడితనం. !

ప్రొప్రయిటరు,

**టి. సి. యస్. ఆచారి.**



ఇది నెం. 40, ఆయలూరి ముత్తయ్య ముదలి వీథి, (శ్రమజీవి ప్రెస్సు లిమిటెడ్ వారి) 'యూనివర్ సల్ ప్రింటర్సు'లో శ్రీ. వి. టి. గోపాలం ఎం.ఏ. గారిచే ముద్రింపబడి. 10, నరసింగపురం వీథిలోని ఆంధ్రశిల్పి కార్యాలయములో శ్రీ డి. సాంబశివరావు గారిచే ప్రకటింపబడినది సంపాదకులు: శ్రీ గణపతిశాస్త్రి: శ్రీ చిత్రా.

శిల్పి ప్రచురణములు :

# 'నా జీవిత యాత్ర'

ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు
బాల్యం మొదలు పంచాశద్వర్షాలవరకూ గడిచిన మహోజ్జ్వల జీవిత గాథ.
ప్రథమ ఖండము
వెల రూ. 3/—

## 'ఆంధ్రశిల్పి'

ఆంధ్ర సాహిత్యానికీ, లలిత కళలకీ,
సంస్కృతికీ దోహదమిచ్చే
విచిత్ర మాస పత్రిక

సంపాదకులు :
శ్రీ గణపతి శాస్త్రి
శ్రీ చిత్రా

సాలు చందా ౯ రూపాయలు
విడి కాపీ ౧౨ అణాలు.



రానున్న
## 'శిల్పి' ప్రచురణ

ఆంధ్ర కేసరి
శ్రీ టంగుటూరి ప్రకాశంపంత
గారు రచించిన

౧. 'నా జీవిత యాత్ర'
ద్వితీయ ఖండము
౨. యోగసూత్ర సిద్ధాంత
౩. ఈశావాస్యోపనిషత్తు
౪. ప్రశ్నోపనిషత్తు
౫. కఠోపనిషత్తు
౬. భగవద్గీతా భాష్యము

---

వివరాలకు :— మేనేజరు :

ఆంధ్రశిల్పి
౧౦, నరసింగపురం వీధి,
మౌంటు రోడ్, మద్రాసు.